- కాళోజీ 'పరాభవ హేమంతం' - సౌందర్య దృష్టి
- జాషువా 'నాగార్జున సాగర్' ఒక పరిశీలన
- నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము
- ద్విభాషా శ్లేష
- 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక-లేఖా సాహిత్య ప్రతిఫలనం
- చారిత్రక వైభవం గల జైనథ్ ఆలయం
- ఉస్మానియా ముద్దుబిడ్డ 'డాక్టర్ కె.ముత్యం'
- కావ్య మధూలికలో వస్తు వైవిధ్యం

# మూసీ
# MUSI



◆ Samputi : 27 ◆ Sanchika : 11 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ September 2024

UGC CARE List
Approved Journal




Scanned with OKEN Scanner






# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 11
సెప్టెంబర్ - 2024
'క్రోధి' భాద్రపదం మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER

ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

కాళోజీ 'పరాభవ హేమంతం' - సౌందర్య దృష్టి ... జె. అనూరాధ 7
తొలి తెలుగు సంస్కృత ఆచార్యులు 'రాయప్రోలు వెంకటరామ సోమయాజులు'.. డా. వెలుదండ నిత్యానంద రావు 13
జాషువా 'నాగార్జున సాగర్' ఒక పరిశీలన ... డా. జి. వెంకట లక్ష్మి 23
కుందుర్తి వచన కవితా నాటకాలు - విశిష్టత ... డా. జి. మహేందర్ 27
నీతిశాస్త్రము - తాళపత్ర గ్రంథము ... డా. గంఠ్ర లక్ష్మణ రావు 31
ద్విభాషా శ్లేష .... చొప్పర శివకుమారి 34
'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక - లేఖా సాహిత్య ప్రతిఫలనం ... ఆదాల రాజయ్య 39
బెల్లి యాదయ్య కవిత్వంలో ప్రపంచీకరణ వ్యతిరేకత ... ఎం. విప్లవ్ కుమార్ 42
చారిత్రక వైభవం గల జైనథ్ ఆలయం ... చంద్రకాంత్ మునేశ్వర్ 45
తొలితరం చరిత్రకారులు తేరాల సత్యనారాయణ శర్మ ... శ్రీరామోజు హరగోపాల్ 49
నాటితరం మేటి పరిశోధకులు తేరాల సత్యనారాయణ శర్మ ... డా. డి. సూర్య కుమార్ 51
ఉస్మానియా ముద్దుబిడ్డ 'డాక్టర్ కె. ముత్యం' ... తుల రాజేందర్ కుమార్ 53
అంపశయ్య నవీన్ కన్నీటిధారలే అనురాగదీపం నవల ... డా. అగపాటి రాజ్‌కుమార్ 55
కావ్య మధూలికలో వస్తు వైవిధ్యం ... డా. తండు కృష్ణ కౌండిన్య 58
స్వీకృతి... 61

### కవితలు

నమో! గణేశా!! - డా. జనమంచి విఠలేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; ఎడతెగని దుఃఖం - ధూళిపాళ అరుణ ... 11; పూజలందుకో విఘ్నరాజ - కటకం వెంకటరామ శర్మ ... 22; శ్రీకృష్ణ జన్మాష్టమి - పసుపులేటి నరసింహారావు .. 26; సూర్యావధాని ప్రశంస - డా. అయాచితం నటేశ్వర శర్మ ... 33; గురువు - జాతికి సదా పరువు ... కట్ట రంజిత్ కుమార్ ... 48; గురువే సమస్త వెలుగు కిరణం ... డా. అంజనాద్రి ఖమ్మం -52; నేను ఇంకెందరినో - డా. కందుల శ్రీను - 62


ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**



## ఆకర్షణ

ఈ విశ్వమంతా ఒక ఆకర్షణ పరిధిలో ఉంది. సృష్టి అంతా ఆకర్షణమయమే. వ్యక్తులు, వ్యవహారాలు, గ్రహాలు, నక్షత్రాలు అన్నింటికీ ఒక ఆకర్షణ ఉంది. అయస్కాంతం ఇనుప ముక్కను ఆకర్షిస్తుంది. భూమి, చంద్రునితో సహా ఎన్నింటినో ఆకర్షిస్తుంది. భూమికి అయస్కాంతత్వం అధికం. సూర్యుడు నవగ్రహాలను ఆకర్షిస్తున్నాడు. సూర్యునికి భూమికన్నా ఎక్కువ ఆకర్షణశక్తి ఉంటుంది. ఈ ఆకర్షణ శక్తి పరిమితుల్లో ఉంటున్న మనందరికీ కూడా అదే ఆకర్షక శక్తి ఉంటుంది. ఇదేవిధంగా భూమిపై వర్షం పడాలన్నా వాతారణాన్ని, మేఘాలను భూమి ఆకర్షింపక తప్పదు. ఫోన్ సిగ్నల్స్ వంటి భావనలు కూడా అవే. ఇటువంటి అంశాలను గమనిస్తూ ఉండాలి.

భూమికి ఉన్న ఆకర్షణ శక్తికి 'గురుత్వాకర్షణ' అని పేరు. ఈ శక్తికే గణపతి అని నామకరణం. భూమికి, చంద్రునికి మధ్యలోని ఆకర్షణ శక్తిలో లోపాలను గమనించిన భారతీయ సంప్రదాయం ప్రతి భాద్రపద మాసంలో గణపతి వ్రతాన్ని నిర్ణయించింది. ఈ వ్రతం శరీరాన్ని, మనస్సును పక్కకు పోకుండా భూమ్యాకర్షణకు సన్నిహితంగా ఉంచుతుంది. వ్యక్తిలో కోల్పోయిన శక్తి మళ్ళీ సాధించే అవకాశాలు ఉంటాయి. అసంతులితమైన శక్తిగా వ్యక్తి మారితే తన కార్యక్రమాల నిర్వహణ కొనసాగడం కష్టం. కాలం వ్యర్థం.

వ్యక్తిలోనూ గొప్ప ఆకర్షణ శక్తి ఉంటుంది. కొందరికి అది అద్భుతంగా, అత్యధికంగా ఉంటుంది. కొందరికి చాలా కొద్దిగా ఉంటుంది. అధికమైన శక్తి ఏర్పరచుకోవడానికే ఈ జన్మ వ్యక్తికి ఏర్పడుతుంది. ఆ విషయం తెలుసుకోవడమే జ్ఞానం. ఏర్పడిన ఆకర్షణ, లోకానికి ముందు వ్యక్తీకరణ కోసమే అయినా దానివల్ల ఉపయోగం లేదు. అది ఇంకా అహంకారాన్ని పెంచి అజ్ఞానంలోకి తోస్తుంది. జ్ఞానమంటే ఆకర్షణ శక్తిని బాగా పెంచుకునే ప్రయత్నం. జ్ఞానమంటే తమ శక్తిని, విశ్వాకర్షణ శక్తికి సమానంగా మార్చుకునే విధానం. దీనికి కొంత తీవ్రమైన ప్రయత్నం తప్పదు. ఆ ప్రయత్నం పెరుగుతున్న కొద్దీ వ్యక్తి స్థాయి పెరుగుతుంది.

ఆకర్షణ శక్తి, వ్యక్తిలో పెరగాలంటే పూర్ణమైన శుద్ధత కావాలి. ఎంత శుద్ధుడైతే అంత శక్తి విస్తరిస్తుంది. బాహ్య దేహానికి స్నానం ద్వారా శుద్ధి అవసరం. ఎప్పటికప్పుడే అవసరమైనంతగా స్నానాదులు అధికంగా చేస్తూనే ఉండాలి. అంతరదేహానికి యోగ, ప్రాణాయామాదుల ద్వారా శుద్ధత లభిస్తుంది. నిరంతరం మానసికంగా చేసే జపం లేదా ధ్యానం వల్ల మనశ్శుద్ధి కలుగుతుంది. కర్మశుద్ధి దానం వల్ల కలుగుతుంది. ఎవరైనా ఈ నాలుగు మార్గాలు పాటించక తప్పదు. ఏదో 'శాస్త్రానికి' అంటూ … చేసే శుద్ధి ప్రక్రియలో లోపం చేస్తే పొందాల్సిన ఆకర్షణ శక్తి పొందలేము.

భూమి నిరంతరం సూర్యుని చుట్టూ తిరుగుతున్నట్లు మన మనస్సు కూడా మనకన్నా గొప్ప శక్తి చుట్టూ నిరంతరం పరిభ్రమిస్తూ ఉంటే మనకు కూడా అద్భుతమైన ఆకర్షణ శక్తి వస్తుంది. తమలో తాముండటం లేదా దైవం చుట్టూ మనస్సును కేంద్రీకరించడం లేదా తిరగడం వల్ల శక్తి విస్తరిస్తుంది. అదే ఆకర్షణ శక్తి. ఆ శక్తి విస్తరించడం కోసమే ఈ జీవనం. పరోపకార, దాన, ధ్యానాదులు అన్నీ శక్తి విస్తరణ కోసం చేసే ప్రయత్నాలే. కర్మశుద్ధి కోసం చేసే పనులే.

వినాయక చవితి కేవలం పండుగలా కాకుండా, మూలాన్ని అర్థం చేసుకుంటూ.. వ్రతంలా దీక్షగా భావించి, మనలో శక్తిని, ఆకర్షణను పెంచుకోవడానికి ఉద్దేశించింది. దానిని తెలుసుకోకుండా యథాలాపంగా నిర్వహిస్తూ ఉంటే ఈ పండుగల వల్ల ఉపయోగం ఉండదు. ఆకర్షణ విస్తరించుకుంటూ అత్యున్నత స్థాయికి చేరడానికి ఈ మార్గాలను అందరూ అర్థం చేసుకుంటూ ఉండాలి.

# నమో! గణేశా!!





కుడుములుండ్రాళ్ళు భక్తితో కుడువగాను
భువికి రమ్మని నిను బిల్తు భువన రూప
విఘ్న నాయక గణపతి విజయమిమ్ము
మూషకమ్మున యేగుచు ముక్తి నిమ్ము

మొదటిగ మొక్కులన్గొనుచు మోదముతోడుగ విద్యలిచ్చుచున్
పదముల నాశ్రయించ భవ బంధములెల్లను తొల్గజేయు, నో
మధుర సుధాబ్ధి విఘ్నముల మాన్పెడి దేవ దయా సుధాకరా
సదయుడవౌచు బ్రోవుమని సన్నుతి జేతును ఏకదంతుడా!

కోవెల కావలన్ నిలిపి కొల్తురు తొమ్మిది రాత్రులందు యే
తావుల జూచినం జనులు ధన్యత నొందగ గల్లి గల్లిలో
పావనమూర్తిగా కొలుచు భక్తుల నెల్ల ననుగ్రహించి నీ
దీవెనలీయుమయ్య, కరిదేవర, పార్వతి ముద్దుబిడ్డడా

మొదటి పూజల నందెడి ముక్తి దేవ
ఆపదలనెల్ల దీర్చెడి నాదిదేవ
శంభుసుతుడుగ పూజింతు సన్మతి నను
కోర్కె దీర్చర దేవరా కూర్మితోడ

ఆధునికమ్మునందు నినునద్భుతమౌనటు రూపురేఖతో
మేదిని యందు నిల్పుచును మేలిమితోడ యలంకరించుచున్
బాధల దీర్పుమంచు నిను భక్తితొ మొక్కుచు నీవు మెచ్చు, ఆ
మోదక లడ్డుకాల్ నిడెడి ముక్తిని గోరెడి భక్తునేలుమా

కోరిన కోర్కెలిత్తువని కోరి భజింతురు నెల్లవేళలన్
కోరిక లెల్ల గూర్చుకొని, కోటిగనున్న సురూప మంటపాల్
జోరున తిర్గుచున్ కనుల జూచుచు ధన్యమటంచు పాడుచున్
భారము నీదటంచు నిను భక్తితొ గొల్వగ గావుమో ప్రభూ

నీ దయ గల్గినన్ జనులు నీతిని దప్పరు బుద్ధి జీవులై
యీ ధర బేరు నొందెదరు నిర్మలమైన యశస్సు బొందుచున్
క్రోధములెల్ల వీడెదరు కూర్మితొనుందురు మిత్ర భావనన్
బాధలు తొల్గిపోవును అపాయము దప్పును పార్వతీ సుతా!

గణపతి చతుర్థిరోజున
గణదేవుని గరికతోడ ఘన పూజలిడన్
గణములకధి దేవుడునై
అణువణువున బాధలన్ని నణగించునుగా

ఏకవింశతి పత్రాల నేరి తెచ్చి
నేకవింశతి జతలుగ నేర్చి కూర్చి
కుడుములుండ్రాళ్లు కూర్మి నైవేద్యమిడెడి
భక్తజనముల గావుమ శక్తి తనయ

డా. జనమంచి విఠలేశ్వర శర్మ
సంగారెడ్డి, ఫోన్ : 9492 829 083

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

జాతిభేద భావము
విడువవలెనీ జాడ్యము
అంతరంగరంగనాథుని
ఆత్మజులమన్నది సత్యము

బీజమొకటి అంకురించి
సృష్టిరూపమొత్తెను
అనంత జీవకోటిరాశిగా
అవతారము నొందెను
బీజమొకటే రూపము వేరు
తెలుసుకున్న మౌఢ్యము వీడు

నాలో నీవు నీలోన నేను
ప్రతిజీవిని నీవని ఎరుగు
పరబ్రహ్మ ప్రేమను పంచి
హృదయగది విశాలము పెంచు

తుకా పరబ్రహ్మ రూపము
విశ్వభ్రాతృత్వ సత్యము
పరభావన వీడి నడువుము
పరంధామ పథము చేరుము




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్

ఫోన్ : 83283 33720

# కాళోజీ 'పరాభవ హేమంతం' – సౌందర్య దృష్టి

**డా. జె. అనూరాధ,** అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ కళాశాల, ఖమ్మ. ఫోన్ : 81859 55960

**వ్యాస సంగ్రహం :** అక్షరాలను ఆలోచనాగ్ని శిఖలుగా మండించిన కవితా సూర్యుడు కాళోజీ. తన బహుముఖ ప్రజ్ఞతో వర్తమాన రాజకీయ చరిత్రను కవితా చట్రంలో ఇమిడ్చి శాశ్వతంగా చరిత్రలో నమోదు చేసిన చతురుడు. వ్యంగం, ధైర్యం, పోరాట తత్త్వం, లోచన ఆలోచన కలగలిసి పదునెక్కిన అక్షరాల అసిధార ఆయన కవిత్వం.


ఈ విలక్షణ ధీరమూర్తి **'పరాభవ హేమంతం'** కవితల్లో దాగిన సౌందర్య దృష్టిని పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. సౌందర్యం అంటే భావుకత అనే దృష్టితో పరిశీలించడమే కాకుండా జీవితం, సమాజం రెండింటి విషయంలో వివిధ అంశాలను కవిత్వీకరించడంలో కాళోజీ కవిత్వ నిర్మాణంలోని సౌందర్యాన్ని గమనించడం వ్యాస లక్ష్యం. ఈ వ్యాస రచనలో సమగ్ర విశ్లేషణాత్మక పద్ధతిని అనుసరిస్తూ కాళోజీలోని అంతరంగ కవిత్వ సౌందర్యాన్ని ఆకళింపు చేసుకుంటూ 'పరాభవ హేమంతం' రచనలోని ఆలంకారిత ఆధారంగా ఆయన సౌందర్య దృష్టిని పరిశోధనాత్మకంగా పరిశీలించడం జరిగింది.

**ప్రవేశిక :** వాద ప్రతివాదనలు ఎలా ఉన్నా కవికి అంతర్ దృష్టి ముఖ్యం. సిద్ధాంతాల రాద్ధాంతాల్ని పక్కన బెట్టి కవిత్వాన్ని నిష్పాక్షికంగా బేరీజు వేయాల్సి వస్తే... హృదయగత మూలాల్ని స్పృశించాల్సిందే. కవికీ–పాఠకుడికీ నడుమ ఒక అవ్యాజ బంధాన్ని ఏర్పరిచే వారధి 'వ్యక్తీకరణ'. ఈ వ్యక్తీకరణలోని నేర్పు వల్ల మాత్రమే కవి పఠిత హృదయంలో ప్రవేశించి ఆత్మీయుడవుతాడు. అదే కవితాత్మ ఈ ఆత్మ భావంలో వుందా? భాషలో వుందా? అంటే చెప్పడం కష్టం. నిర్మాల్యం లేని మనసు నుండి పూచే కవితా పుష్పం సుగంధితమే అవుతుంది.

కాళోజీ వసివాడని పసి మనసు గలవాడు. ఎటువంటి మాలిన్యం అంటని హృదయంతో చెలిమి చేయగలవాడు. నిర్మలుడైన వ్యక్తి హృదయం నుండి వెలువడే ప్రతిమాటా విలువైనది. పైగా ఆ వ్యక్తి కవితాభివ్యక్తి గలవాడైతే అది అమృత తుల్యమైన కవితాగానం అవుతుంది. కాళోజీ మానవీయత సాధించినవాడు. ఆ మానవీయ సుగంధం ఆయన కవితలను సుదూరాలకు మోసుకు వెళ్లి దేశ కాలాలకు అతీతంగా ఆయనకి అభిమానుల్ని ప్రోగు చేసింది.

కాళోజీ కవితలోని అగ్ని అందరికీ తెలిసిన విషయమే. మాటల పొదుపు ప్రయోగపు ఒడుపు ఆయనకు తెలిసినంతగా మరో కవిలో కనిపించవు. ప్రాసని వాడుకోవటం, గేయ లక్షణాన్ని ఒడుపుగా వచన కవిత్వంలో మిళితం చేసి ఒక విధమైన లయని సాధించడంలో కాళోజీ అనితర సాధ్యుడు.

సాధారణంగా కాళోజీ కవిత్వంలో 'ధిక్కారం' కనిపిస్తుంది. అది ఆయనలోని ఆత్మాభిమాన లక్షణపు ప్రతిరూపం. నిజానికి ప్రశ్న ద్వారానే జ్ఞానం కలుగుతుందనేది పెద్దల మాట. ప్రశ్నించడమే జ్ఞానాభివృద్ధికి మొదటి సోపానం అయితే ఆ ప్రశ్నలకు సంతృప్తికర సమాధానం దొరికే దాకా ప్రశ్నిస్తూనే ఉండడం... అంటే తెలుసుకోవాలనే కోరికతో ఉండడమే జిజ్ఞాస. ఈ జిజ్ఞాసువైన కాళోజీ నిరంతరం



పరిశీలన, పఠన, ఆత్మ శోధనల వల్ల బహువిధ జ్ఞాన పరిపుష్టి పొందాడు. ఆయన బహుభాషా పాండిత్యం కూడా ఆయనకు ఇందులో సహకరించింది. ఎంత పరిపూర్ణుడైనా కూడా కాళోజీ ప్రశ్నించే గుణాన్ని విడువలేదు. ఈ గుణం వల్ల ఆయన కవితలో సాధారణంగా కొంత తిరుగుబాటు ధోరణి, వ్యంగ్యపు చురకలు కన్పిస్తాయి. దాంతో సాధారణ పరిశీలనకు కాళోజీ విప్లవవాదిగా కన్పిస్తాడు. నిజానికి కాళోజీ ఏ ఇజాల చట్రంలో ఇమడని మానవతా వాది. గొప్ప సౌందర్య హృదయం కలవాడు. కాళోజీ కవిత్వంలోని వాక్య ప్రయోగాల్లో ప్రతీకలను ఎన్నుకోవడంలో, పదగుంఫనంలో ఈ సౌందర్య దృష్టిని గమనించగలం. కొన్ని ప్రయోగాలు తెలుగు కవిత్వంలో ఆయన మాత్రమే చేసినవీ, చేయగలిగినవీ ఉన్నాయి.

హృదయగతమైన సౌందర్యం వల్ల కాళోజీ కవిత్వ పరంగా గొప్ప ఔన్నత్యాన్ని సాధించాడు. ఈ ఔన్నత్యమే ఇతర కవుల కన్నా ఆయనను విభిన్నంగా నిలిపింది. పఠితని తన కవితాత్మతో మమేకం చేయగల శక్తియుక్తులన్నీ కాళోజీ కవిత్వంలో బలంగా ఉన్నాయి.

ఈ విలక్షణ కవితాత్మలోని సున్నితత్వాన్ని సునిశితమైన లోచనాదృష్టినీ, ప్రయోగ వైవిధ్యాన్నీ కవిత్వ సౌందర్య దృష్టితో పరిశీలిస్తే అనన్య సామాన్యమైన కాళోజీ కవితా శక్తి అవగతమవుతుంది.

**విషయంలోకి :** కలాన్ని 'కత్తి'గా వాడడం తెలిసిన వాడు కాళోజీ. ఈ మాటని ఆయన అనేక చోట్ల స్వయంగా చాటాడు. ఆ కవిత పేరే 'కలం కత్తి'.

**'దుష్టతకు దుష్కృతికి ద్రోహ చింతనకు**
**కుటిలతకు క్రూరతకు కుత్సితంబునకు**
**ఎదురుబడి నిలుచుటకు కదలు నా కలము'** అని ప్రకటించుకున్న ధీరుడు.

**'శోషితులౌ వారి జూసి, వారలను**
**కాపాడ వేయారు కత్తులకు బదులు**
**కలము దూసితి నేను కలము దూసితిని**
**పౌరసత్వాలకై నోరెత్తలేక**
**చేతు గూర్చిన వారు మాటాడలేక**
**యోజింపగలమన్న యోజనే లేక**
**చావు బ్రతుకుల మధ్య సన్నగిల్లుచున్న**
**అనదలౌ మానవుల అండయై యొప్ప**
**కలము దూసితి నేను కలము దూసితిని'** – అని తన కవిత్వపు లక్షణం, లక్ష్యం ఏంటో స్పష్టం చేసిన మానవీయ శూరుడు కాళోజీ.

తన విలక్షణ పూరితమైన ధిక్కార స్వరంతో కవిత్వాన్ని విన్పించినందున కాళోజీని కొన్ని చోట్ల నిరాశావాదిగా కొందరు భావించే అవకాశముంది. కానీ ఆయన గొప్ప ఆశావాది. మనిషితనంపై నమ్మకం కలవాడు. ప్రకృతిలోని వైవిధ్యాలను కూడా సమతౌల్యతగా అర్థం చేసుకున్నవాడు. బ్యాలెన్స్‌డ్‌గా ఆలోచించ గలవాడు. తన **'బ్యాలెన్స్'** కవితలో **"చీకటి దెయ్యపు ముగాన / వెన్నెల చానిపి జల్లులు"** చూడగలవాడు.

ప్రకృతితో మమేకమై కవిత సృష్టించడం కాళోజి ప్రత్యేకత. తనను ప్రకృతితో మిళితం చేసుకోవడం ద్వారా కవితా గాఢతను పెంచటం కాళోజికి మాత్రమే సాధ్యమైన కవిత విశేషం.

**"పిడుగుల బరువుతో పెనురొదల్ జేయ**
**మెరుపు కోపపు దృష్టి మిరుమిట్లు గొల్ప**
**కారుమబ్బై నాదు కాయ మీదాలె"** అనటంలో ఎంత తాదాత్మ్యం చెందిన కవితాత్మ గోచరిస్తుందో గదా! 'కాయ మీదాలె' అనటంలో ఎంత గొప్ప అర్థసృష్టి ఉంది! కారుమబ్బు గొప్ప ప్రళయకాల వర్షాన్ని కురిపించగలదు. ఉరుమై గర్జించగలదు. పిడుగై సంహరించగలదు. విద్యుల్లతలతో కాంతి నింపగలదు. అలాంటి నల్లమబ్బుని శరీరంగా ఊహించడమే కాక లోక రక్షణార్థం ఆకాశమనే సమాజంలో నల్ల మబ్బులా ఈదాలని కోరుకోవడం కాళోజీకి తప్ప మరో కవికి సాధ్యమయ్యే ఊహ కాదు.

ప్రకృతి పట్ల కాళోజీ గొప్ప సౌందర్యదృష్టి గలవాడు. అయితే ఇక్కడ కూడా ఆయన సమవాదం వెన్నంటి ఉంటుంది. భూమాతని ఎంత ఆర్ద్రతతో వర్ణిస్తాడో చూడండి.

**"ఓ రామ చక్కదనాల దానా !**
**సీతను కన్నట్టి చానా!**
**అందాల బరిణా!**
**అన్నపూర్ణా !**
**భూలచిమీ పుడమి తల్లీ**
**అంద చందాల వల్లీ"** ఈ వర్ణన సినిమా కవుల్లా అంత్య ప్రాసల కోసం ప్రాకులాటలా కాకుండా నిత్య శోభితయైన నిరాడంబరపు తల్లిని ఓ బిడ్డడు పల్లె హృదయంతో వర్ణచిత్రంలా ఆవిష్కరించిన రీతిలో వుంటుంది. ఇది కాళోజీ వర్ణనాత్మక సౌందర్య దృష్టిలోని ప్రత్యేకత.

విరహ బంధాన్ని సంప్రదాయ ధోరణిలో గాక స్నేహబంధంగా భావించగల సంస్కార హృదయశీలి కాళోజీ. **'చెలిమి'** కవితలో ఆర్ద్రమైన పద చిత్రాలతో ఆయన కవిత్వాన్ని ఎలా సౌందర్య సుందరం చేశారో గమనించవచ్చు.

**"ఏడు అడుగుల నేల కూడి నడిచిన యంత**
**కలకాలముండేటి చెలిమి చేకూరునట.**
**నడుమంతరపు చిలిపి గడబిడలు ఎడబాట్లు**
**అలుకలు –అగచాట్లు చెలిమిలో సహజమట.**
**ఏ త్రోవ నడిచినను, ఏ మ్రోల నిలిచినను**
**అడుగులేసిన నాటి 'ముడి' మనల వీడదట"** అనురాగ చిత్రణలో కూడా కాళోజి గొప్ప కవితా సౌందర్యాన్ని ప్రదర్శిస్తారు. అచ్చ తెలుగు పదాల గుబాళింపుతో ఆ అనురాగ పరిమళాన్ని ఒకసారి ఆస్వాదించండి....

**"నా యెడద నిలిచిన నీయెడద గురుతు**
**ఆనాటి ఆ గురుతు నేనెటుల మరుతు?**
**మాయ మమతల గురుతు మాయజాలని గురుతు**
**నాణ్యమై నా స్మృతుల నాట్యమాడే గురుతు**
**దీక్షగా యెదజేరి మోక్షమైన గురుతు**
**లోకమును మరపించి నాకమైన గురుతు**
**ఎదిగి యెదిగీ ఒదిగె ఎదనిండు నీ గురుతు**
**ఒదిగి వొదిగీ ఎదిగె ఎదనిండ నీ గురుతు"**... ఈ కవితలో హృద్యమైన అనురాగ వర్ణనా సౌందర్యాన్ని పొందుపరిచారు. కాళోజీ కవిగా చాలా గడుసు వాడు. పై వర్ణనలో స్థూల దృష్టితో చూసినప్పుడు ఆర్ద్రమైన మనసుతో వర్ణించే అనురాగపు స్థాయి ఉంటుంది. కాస్త జాగ్రత్తగా పరికిస్తే... **'మాయ మమతల గురుతు'** అనటంలోనే ఆయనలోని చమత్కారి కనిపిస్తాడు. గుంభనంగా తన కవిత్వ లక్ష్యసాధన చేసుకుపోయే కవిత్వ చతురుడు కాళోజీ.

స్నేహం పట్ల గొప్పదైన ఉదాత్తమైన భావనగల కవి కాళోజి. అనేక కవితల్లో ఈ భావనని గమనించగలం. భార్యాభర్తల మధ్య అయినా సరే స్నేహం ఎలా ఉండాలో ఎంత హృద్యంగా చెబుతున్నారో చూడండి.

**"తరుగు పెరుగుల మాట ఎఱుగునా స్నేహంబు**
**స్నిగ్ధతను వీడునా స్నేహమెపుడైనా?"** స్నేహితుల మధ్య ఎక్కువ తక్కువల మాటే ఎరుగనిదీ స్నేహమట. స్నేహం అంటే నూనె. అది స్నిగ్ధంగా అంటే జిడ్డుగా ఉంటుంది. ఈ జిడ్డు గుణం వదలనిదే స్నేహం అని గొప్ప ప్రతీకాత్మక వర్ణన చేశారు. ఇది కవితాత్మక సౌందర్య దృష్టి.

ప్రతీకల్ని సౌందర్యాత్మకంగా వాడటంలో కాళోజీ అనితర సాధ్యుడు. చిరస్థాయిగా నిలిచిపోయే ప్రయోగాల్ని అందంగా కవితాత్మ అనే చక్రంలో అమర్చడం ద్వారా వాటికి పాఠక హృదయాల్లో శాశ్వతత్వం ప్రసాదిస్తారు. ఈ ప్రయోగ సౌందర్యాన్ని ఆస్వాదించండి–


**"అందాలు చూపులను విందారగించుమని**
**వెలుగు విస్తరిజేరి పిలిచినది యెపుడొ?**
**నీకు మాత్రము యెరుక నాకు మాత్రము యెరుక**
**పూల వాసన తీపి గాలి మోసినదెపుడొ**
**వాసనల నాసికలు శ్వాస చేసినదెపుడొ"** అందాలు చూపులకు విందు చేస్తాయి. విందుకు విస్తరి అవసరం. ఆ విస్తరి వెలుగైతే వెలుగులో మెరిసిన అందాల్ని చూపులు ఆరగిస్తాయి. **"వెలుగు విస్తరి"**వంటి ప్రయోగం చేయటానికి కవి సౌందర్య దృష్టి ఎంతో పరిణతి చెంది ఉండాలి. పూల వాసనల తీపిని గాలి మోయటం.... ఎంత సుందరమైన ప్రయోగం. కవితాత్మకమైన సౌందర్య దృష్టిని హృదయంలో నింపుకున్న సజ్జనకవి శ్రేష్ఠుడే ఇలాంటి ప్రయోగావిష్కరణ చేయగలడు.

కవితాత్మను నిరూపించే ప్రయోగాలు కాళోజీ కవిత్వంలో అసంఖ్యాకంగా గమనిస్తాం. అధిక సంపాదన వల్ల జీవితం కాంతివంతం కాదనే భావాన్ని ఎంత కవితా సౌందర్యంతో వెలిగించాడో చూడండి–

**"ప్రమిదను ముంచెడి తైలము / ప్రజ్వలింపలేదొత్తిని"** ప్రమిద నిండా నూనె నింపేస్తె **'వత్తి'** నూనెలో మునగి పోవటం వల్ల దీపం వెలగదు. సంపాదనతో జీవితం మునిగిపోతే జీవితంలో ఆనందపు వత్తి వెలగదని కవి భావన.

**"వత్తికి తల ఎత్తు చోటు / ప్రమిద కట్టుపై మిగిల్చి**
**కట్టును చెలియలి కట్టగ / గమనించునదే స్నేహం"** దీపంలో వత్తి చివర తల యెత్తుకుని నిలబడేలా, ప్రమిద అంచులు పొంగిపోకుండా కట్టను కట్టగా గమనిస్తూ వుండేదే స్నేహం... అంటే నూనె. ఇక్కడే కాళోజీలోని సౌందర్యాత్మక కవి తన ప్రత్యేకత చాటుతాడు. స్నేహం అంటే సామాన్యార్థం **'నేస్తం'** అని గదా! సంపాదనలో మిత్రుడు కట్టు దాటి జీవితాన్ని ఆర్పేసుకోకుండా తల ఎత్తి జీవితాన్ని కాంతవంతం చేసుకునేలా హెచ్చరించేవాడే స్నేహితుడు అని కవి, చమత్కార సౌందర్యసాధన.

**"వత్తికి తల మునకలైన / ఎత్తును చీకటి తన తల**
**చమురు వత్తి మిగులు కాని / తిమిరారి జ్వలియింపదు"** వత్తి తల నూనెలో మునిగితే చీకటి తల ఎత్తుతుంది. నూనె, వత్తి మిగులుతాయిగాని వెలుగురాదు. ఇక్కడ వెలుగు / జ్వాల వంటి ప్రయోగాల బదులు 'తిమిరారి' (తిమిర + అరి) అని వాడటంలో విశేషార్థ ప్రయోజనముంది. తిమిరం అంటే చీకటి. దాని 'అరి' అంటే శత్రువు – వెలుగు. తిమిరాన్ని అజ్ఞానంతో పోలుస్తాం. అధిక ఆర్జనా తాపత్రయం వల్ల జీవితం అజ్ఞానం అనే చీకటిలో మునిగిపోతుంది. తగిన ఆర్జనతో



తృప్తిపడి గౌరవంగా తల ఎత్తుకుని వెలుగుల జీవితం గడపండి అని సూచించాడు కవి.

**"జీవిత్తము అమితమైన / జీవితమునకె ప్రమాదము"** జీవితములో విత్తము (ధనము) ఎక్కువైతే జీవితమే ప్రమాదములో పడుతుంది అని కవి హెచ్చరిక. 'జీవితంలో విత్తం' అనే ప్రయోగాన్ని సౌందర్య సాధనలో భాగంగా వైవిధ్యవంతంగా 'జీవిత్తము' అని ప్రయోగించారు కవి.

జీవితం పట్ల నిర్దుష్టమైన భావజాలం ఉన్న కాళోజీ స్వతంత్రమైన ఆలోచనలు, సొంతకాళ్లపై నిలబడడం అనే అంశాల్ని గాఢంగా విశ్వసిస్తారు. అందుకే పిల్లల విషయంలో పెద్దల మితిమీరిన జోక్యాన్నీ, పిల్లలకోసం అధికంగా కూడబెట్టి ఇవ్వడం అనే విషయాలను తప్పుబడుతూ ఇలా అంటారు–

**"పెద్దల పోషణ పిన్నల / దద్దమ్మల జేయురీతి**
**ఆస్తి పాస్తులందు కలదు / జీవితమే మునుగు భీతి"**

ఏ ఎండకి ఆ గొడుగు పట్టే కవులని వ్యంగ్యంగా విమర్శిస్తూ కవితా పద ప్రయోగాలు పల్లె వాసనతో తెలుగు సామెతల్ని గుర్తు చేసే వణిముత్యాలు –

**"మహాంధ్రంలో మహా కవులకు**
**మేత కనువుగా కూత మారును**
**రోటి కనువుగ పాట మారును**
**చోటు కనువుగ మాట మారును**
**నెలవు కనువుగ చెలిమి మారును"**

మనిషి ఎప్పుడూ వర్తమానంలో బ్రతకాలి తప్ప, గతాన్ని స్మరిస్తూనో, భవిష్యత్తు కలలుగంటూనో ఉండరాదని ఈ కవి నిశ్చితాభిప్రాయం. ఈ గంభీర విషయాన్ని కవితాత్మక సౌందర్యాన్ని ప్రతిఫలింపచేసేలా ఎంత హృద్యంగా పలికారో చూడండి –

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2024



**"గతాన్ని గతికే వాడిప్పట్లో లేనివాడు**
**భవిష్యత్తులో బ్రతికే వాడింకను పుట్టలేదు**
**ఇప్పట్లో ఉన్నవాడె బ్రతికున్నవాడు**
**ఉన్నవాడు"**

వర్తమాన కాలంలో జీవించేవాడే నిజమైన సంపన్నుడు అనే అంతరార్థ సూచనని నర్మగర్భంగా చేయటం కవి చమత్కార సౌందర్యం. 1959 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌పై రాసిన కవితలో చమత్కార సౌందర్యాన్ని గమనించవచ్చు. బడ్జెట్ అంకెలన్నీ రాబడి, వ్యయాలను చూపుతాయి. వాటిని సూచిస్తూ కాళోజీ –

**"అంకెల తోడను గారడి / ఆర్థికాలపై 'ప్యారడి'**
**లోటు – మిగులు అద్వైతము / రుజువు చేయు పొడి అంకెలు**
**అంచనాల వంచనలకు / వంచిన తలలో వంకలు**
**...................... / ...........................**
**'ఫైనాన్సెస్' పై 'ప్యారడీ' / 'ఫైను' ఫైనుల గారడీ"**

కాళోజీ కవితల్లో శబ్ద చమత్కార సౌందర్యానికి ఈ కవిత కూడా మరో ఉదాహరణగా చెప్పుకోవచ్చు. "లోటు – మిగులు – అద్వైతం" అనే ప్రయోగం చాలా అర్థవంతమైంది. అలాగే బడ్జెట్ అనగానే ప్రజలకు తమపై వడ్డించే పన్నులు, పెంచిన ధరలు గుర్తొస్తాయి. ఆ విషయాన్ని శబ్ద చమత్కారంతో 'ఫైను ఫైనుల గారడీ' అనటం ద్వారా తన ప్రయోగ వైశిష్ట్యాన్ని చాటారు.

నూత్న ప్రయోగాల విషయంలో కాళోజీది ప్రత్యేక ఒరవడి. ఆడంబర ప్రయోగాలు వుండవు. అవసరమైన చోట్ల నూతనత్వం కోసం విలక్షణ ప్రయోగం చేయటం వుంది. ఇది కూడా కవితా సౌందర్య దృష్టిలో భాగమైన అంశమే.

**"మూగకు వాచాలత్వం / ఈగకు గరుడ గురుత్వం**
**'చేపి'కి యోజన గంధం / చేదుకు చిరజీవనము ఓట్లు"**

పై కవిత్వ ఖండికలో 'చేపి' అనే ప్రయోగాన్ని 'ఆడచేప' అనే అర్థంలో వాడటం విశేషం. కవిగానే కాక వ్యక్తిగా కూడా కాళోజీ అత్యంత ఆత్మ గౌరవం గలవాడు. నిశ్చితమైన ఆలోచనలు గలవాడు. ప్రభావాలకు అతీతంగా తనపని తాను చేసుకుపోయే ముక్కుసూటి మనిషి. తనలోని తత్త్వాన్ని తాత్వికంగా వ్యంగ్య రీతిలో ఇలా ఆవిష్కరిస్తాడు.

**"అహం బ్రహ్మాస్మిగాడు / ఆత్మానందుడు**
**లచ్చిమొగనికైనా / ఆత్మార్పణ చేయడు**
**ఏ బ్రహ్మానికైనా / తాకట్టుబడడు**
**ఏ శివయ్యకైనా లోకువ కాడు / అహం బ్రహ్మాస్మివాడు**
**అందరినీ అదేకమ్మంటాడు.**
**.................................**
**అహం బ్రహ్మాస్ములలో**
**ఆత్మదర్శనం చేసుకుంటాడు"** తనలో లోకంలో ఏకాత్మను దర్శించగలగటమే 'అహం బ్రహ్మాస్మి' అని గుర్తెరగటం. అద్వైతంలోని చిట్టచివరి స్థాయి మహా వాక్యం ఇది. మానవీయతలో చివరి స్థాయిగా చెప్పుకోవచ్చేమో. కాళోజీ నిర్మలమైన ఆత్మసౌందర్యానికి సాక్ష్యం ఈ కవిత.

కాళోజీ ఆశావాది అని మొదటే చెప్పుకున్నాం గదా! దాన్ని రూఢి చేసే ప్రకృతిపరమైన ప్రబోధ కవిత...

**"పండు వెన్నెల దాల్చి / ప్రసవ వేదన తోడ**
**నెలవంక కన బోవు / నిండు పొద్దుల రేయి**
**.................... / ....................**
**తిమిరాల కడుపులో / తేజాలు జనియించు**
**అమావాస్య నిశికింత / హడలేల బెగడేల?"**

అమావాస్యని తిమిరాల కడుపు అనడం, ప్రసవ వేదనతో తరువాయి రాత్రిని నిండు పొద్దుల రేయి అనటం, ఆ రేయి నెలవంకని కనబోతుంది అనటం......కాళోజీ మాత్రమే సృష్టించగల కవిత.

అనితర సాధ్య పద ప్రయోగాల్లో కాళోజీ చేయితిరిగిన వాడు అనటానికి – ఈ కవిత నిదర్శనం –

**"తలచి తరచి తలపులన్ని / పలుకుల్లో ఒలికిస్తే**
**ప్రాణాలే ఝల్లుమనుచు / గుండె మువ్వ ఘల్లు మనుచు"**

తలపుల్ని పలుకుల్లో ఒలికించటం గొప్ప సౌందర్యదృష్టితో చేసిన ప్రయోగం అనుకుంటే గుండెని మువ్వతో అభేదం చెప్పి గుండె మువ్వ అనే రూపకాన్ని సృష్టించటం అపూర్వం. గుండె మువ్వలా మ్రోగుతూ వుంటే... గొప్ప పదసృష్టి యిది.

**"................. / ....................**
**తల ప్రాణం తోకకొచ్చి / చెరుకు గడను ఆశ్రయించి**
**నారిగ మారిన నారిని / కొలికి మీటాలని మీటగ**
**పూల బాణ మెక్కింపగ / శివుని మనసు నొచ్చుకొనెను**
**చిచ్చుకన్ను విచ్చుకొనెను"**

మరుని దహనాన్ని ఎంతో హృద్యంగా చెప్పారు. ఇలాంటి చోట్ల గేయ లక్షణాల్ని నిరూపించగలం. "నారిగ మారిన నారిని" ..... చిచ్చుకన్ను విచ్చుకొనెను" వంటి ప్రయోగాలు చిరస్థాయిగా పాఠకుల హృదయ పుటల్లో ముద్రితం అయిపోతాయి. **"ముదిమి"** కవితలో ముసలితనాన్ని వర్ణిస్తూ .....

**"నేనొక కళాపూర్ణ శిథిలాన్ని**
**నేనొక శిథిల కళాఖండాన్ని**
**శరీర చరిత్ర ఫలితాలీ ఎముకలు**
**స్పర్శజ్ఞాన పూరితాలీ ముడుతలు**
**కలలు దీర బ్రతికినదీ ముఖము**
**కలలు కరిగిన మదికి ఆముఖము"** అంటారు కాళోజీ. జీవనం పట్ల పరిపూర్ణ అవగాహన, జీవితం పట్ల సౌందర్యదృష్టి ఉంటేనే ఇలాంటి కవితా సౌందర్యాన్ని సృష్టించటం సాధ్యమవుతుంది.

**ముగింపు**

**"సూర్యుని వలె దీపాలు వెలుగుతుండగా**
**చాంద్రమానం ప్రకారం చంద్రోదయందాకా**
**దారి కనబడదని ప్రయాణం ఆపుకొనేవాడే మూర్ఖుడు"**

ఇదీ కాళోజీ అభ్యుదయ దృష్టి. కవిత్వపరంగా ఎన్ని రకాలైన ప్రయోగాలు చేసినా కాళోజీ సమ్మింది మానవీయతనే. ప్రశ్నించే స్వరం ఆయన స్వంతం.

**"ఖాద్యం విదేశీ అయ్యాక**
**సాధ్యం ప్రశక్తి ఎందుకు ?"** – అని చురక వేసినా...

**"రాజనీతికి బదులు నేతకు**
**ఉండవలసింది ప్రజాభీతి"**– అని నీతి చెప్పినా.....

**"ఈగ తలల నరకుళ్ళకు**
**వజ్రాయుధముల దిగుమతి"** – అని ఈసడించినా...

**"ఇంతేనా ఈ దేశం గతి?**
**ఓటర్లకు పోయిందా మతి?**
**సహ్యమగునా అభిమాన క్షతి?**
**వరమా? ఏమిటి మనకీ దుస్థితి?"** అని ఆక్రోశించినా, ప్రతి వాక్యంలో ఒక నిష్పాక్షికమైన, సహేతుకమైన లోచనా ప్రవంతిని సారించి, చైతన్య కవితా ప్రవాహాన్ని పారించి, తెలుగు కవితా మాగాణిని పండించిన కృషీవలుడు కాళోజీ అనటంలో అతిశయోక్తి లేదు.



# ఎడతెగని దుఃఖం

**ధూళిపాళ అరుణ,** ఫోన్ : 871 234 2323

ఒంటి నిండా దట్టంగా
ఆకుపచ్చ రంగేసుకొని
మనో చిత్రాలుగా మురిపించే
నిశ్చలమైన కొండలకు
ఎందుకొచ్చిందో
అంత కలవరపాటు?
ఒళ్ళు విరుచుకున్నాయి
భీకర శబ్ద ప్రకంపనలతో



నీలి నింగి అలిగి
విడిచిన జలపాతాన్ని
ఇముడ్చుకోవడం
పెనుభారంగా తోచిందేమో!
తునకలుగా విడిపోయి
మృత్యువు ఆసరాగా
కిందకు కూలాయి వేగంగా



రేపటి సూరీడు
నెత్తుటి ముద్దగా జ్వలిస్తాడని
ఆగిన శ్వాసలకేం తెలుసు?
కాలుని సమతూకంలో
చేయని నేరమైనా
దండన ఒకటేనని
ఏ అనుభవం చెప్పగలదు?



ఇప్పుడక్కడ నేల
ఎడతెగని దుఃఖాన్ని తాగుతోంది
చెదురుమదురుగా పరుచుకున్న
దేహభాగాల కుప్పల నడుమ
మిగిలిన ప్రాణాలు
వెతుక్కుంటున్నాయి
అంతుచిక్కని మరో ఉదయాన్ని
(వయనాడు సంఘటన... స్పందన)



❖ ❖ ❖ ❖ ❖

## ఆదిత్య హృదయ మహిమ

**"రశ్మిమన్తం సముద్యన్తం దేవాసుర నమస్కృతమ్**
**పూజయస్వ వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్"**

ఒక చిన్న సంవాదం గుర్తుకు వస్తున్నది. నాకు నమకచమకాలు, శ్రీసూక్త పురుషసూక్తాలు ఉపదేశించిన ఒక మహానుభావుడు ఒకనాడు శర్మగారూ! జపము, తపము, ఉపాసనము మొదలైనవన్నీ చేస్తున్నాం. చివరకు "ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు" అంటున్నాం. అయితే మనకు మిగిలిందేమిటండీ! అని పెద్దగా నవ్వుతూ అడిగారు. వెంటనే నా నోటినుండి ఆ బ్రహ్మమే మనకు దక్కుతుంది కదండీ అనే సమాధానం వచ్చింది.

దానిని అలా ఉంచుదాం. ప్రకృతానికి వస్తే పై మూడు ప్రశ్నలకూ "కర్మణ్యేవాధికారస్తే, మా ఫలేషు కదాచన" – 'కర్మము చేయుటం వరకే నీ పని. ఫలం మీద నీకు అధికారం లేదు' అన్న గీతావాక్యం ఒక్కటే సమాధానం. కాబట్టి ఏ సమారాధాన అయినా నిష్కామ భావన తోనే చేయాలి అనే తాత్పర్యంతో అగస్త్యులవారు ఈ పదాన్ని నిబంధించారు. ఇలా అన్నంతమాత్రాన 'ఫలం ఉండదు' అని భావం కాదు. ఫలం గూర్చి నీవు ఎదురుచూడటం కానీ, ఫలం కోసమే నేను ఈ పనిచేస్తున్నాను అనుకోవటం కానీ సరియైనది కాదు అని మాత్రమే ఇక్కడ సంభావితార్థం. ఆదిత్యుడు దైవ, మానుష, దానవ గుణాలతో ప్రవర్తించే అందరికీ, అన్ని కాలాలలో నమస్కరింపదగిన వాడు – అని తాత్పర్యం.

4. వివస్వంతుడు : ఇది సూర్యునికి ఒక పర్యాయపదం. భగవత్పరమైన నామాలన్నీ కేవలం వ్యవహారానికి సంబంధించినవి కావు. అవి గౌణాలు. అంటే గుణసంబంధం చేత ఏర్పడినవి. "వివస్తే ప్రభవా ఆచ్ఛాదయతీతి వివస్వాన్" అని గురుబాల ప్రబోధిక వివరించింది. తన కాంతితో అందరినీ, అన్నింటినీ కప్పి సంరక్షించే వాడు అని అర్థం. సూర్యకాంతిని ఒక ప్రత్యేక విధానంతో దేహానికి తాకేవిధంగా ఏర్పాటు చేసుకొంటే సర్వరోగాలూ సదలిపోతాయి. 'ఆతప స్నానం' అని ఒక ప్రక్రియ ఉన్నది. ప్రకృతి చికిత్సలో అదొక భాగం. కనుక ఆదిత్యుడు అమ్మ లాగా అన్ని జీవరాశులకూ కావలసిన కాంతిని నిర్వ్యాజ వాత్సల్యంతో అందిస్తున్న పరమదైవం అని వివస్వంతుడు అనేదానికి అర్థం. (సశేషం)

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

❖ ❖ ❖ ❖ ❖

## సత్సంగం




### స్వప్నము – సుషుప్తి – సమాధి

**శిష్యుడు :** స్వప్నాలను ఏ విధంగా నిగ్రహించాలి?

**భగవాన్ :** జాగ్రదవస్థలో వాటిని నిగ్రహించగలిగితే, నిద్రలో కూడా వాటిని నిగ్రహించుకోవచ్చును. జాగ్రదవస్థలో పొందిన స్పందనల ముద్రలే, నిద్రావస్థలో స్వప్నంగా పరిణమిస్తాయి. ఇది నిద్రావస్థలోనే గాని సుషుప్తిలో కాదు. స్వప్నంలో దర్శించినవాటి గురించి శిష్యుడు అడిగాడు : "అవి ఏమిటో నాకర్థం కాలేదు. కోతుల ముఖాలతో పెద్ద పెద్ద ఆకారాలు స్వప్నంలో కనిపించాయి."

భగవాన్ : ఆత్మకు పరిధులు లేవు. మనస్సే పరిమితమైన రూపాలను సృష్టిస్తుంది. మనస్సుకే పరిమితు లున్నాయి. అది ఇతరులకు కూడా పరిమితులు కల్పిస్తుంది. పరిమితులు అనేవి మనస్సుకే. పరమాత్మకంటే మనస్సు భిన్నం కాదు. ఒక బంగారు ఆభరణం కేవలం బంగారం కాకపోయినా, బంగారం కంటే భిన్నం కూడా కాదు.

మనస్సు ఒక అద్భుతమైన శక్తి. అది పరమాత్మయొక్క విచిత్రమైన శక్తి. మనస్సు ఉద్భవించిన తరువాతనే ఈశ్వరుడు, జగత్తు, జీవుడు ఉద్భవిస్తారు. గాఢనిద్రలో మనం వీటిని విడివిడిగా దర్శించలేము. అది భగవంతుని యొక్క మాయాశక్తి. గాఢనిద్రలో మనకు వీటి సంగతి తెలియకపోయినా, నిద్రలో మనం ఉన్నామని మనం ఎరుగుదుము. మనస్సు లేవగానే మనము మేలుకొంటాము.



ఎరుగుట, ఎరుగక పోవుట మనస్సుకు సంబంధించినవి మాత్రమే. జాగ్రదవస్థలో మనం మనసుతో తాదాత్మ్యం చెంది ఉంటాము. ఇప్పుడు మనస్సు వెనుకనున్న నిజతత్త్వం తెలుసుకొంటే, మనకు ఇంక ఎటువంటి పరిమితులు ఉండవు. సుషుప్తి అవస్థలో ఏమి పరిమితులు ఉన్నవి?

**శిష్యుడు :** నాకు తెలిసినంత వరకు ఏమీ లేవు.

**భగవాన్ :** 'నాకు తెలియదు' అని అంటున్నదేదో, అది కూడా మనస్సే. గాఢమైన నిద్రలో, నీవు నీ నిజమైన స్వరూపంగానే ఉంటావు. మధ్యలో కనిపించేదంతా, మధ్యలోనే మాయం అవుతుంది. 'ఆత్మ' జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో కూడా నిలిచే ఉంటుంది. అది జాగ్రదవస్థకు, సుషుప్తి అవస్థకు కూడా మూలస్థానం (ఆధారపీఠం). ఈ మూడు విభిన్న అవస్థలు మనస్సుకే. సమాధి స్థితి, సుప్త చైతన్యస్థితి కూడా మనస్సుకే. ఆత్మకు అవి అంటవు.


ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11 (13) హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

# తొలి తెలుగు సంస్కృత ఆచార్యులు రాయప్రోలు వెంకటరామ సోమయాజులు

డా. వెలుదండ నిత్యానందరావు, విశ్రాంతాచార్యులు. ఫోన్ : 9441666881

*(ప్రప్రథమ తెలుగు ప్రొఫెసర్ రాయప్రోలు వెంకట రామ సోమయాజులగారి గురించి వినూతన అంశాలతో కూడిన మొట్టమొదటి పరిశోధనాత్మక వ్యాసం ఇది. ఆచార్య నిత్యానందరావు ఎంతో ఓపిగ్గా ప్రాథమిక ఆధారాలు, (primary sources), అధికారిక పత్రాల నుండి సేకరించి రాసింది. కేవలం "ఇంటిపేరు" సాయంతో గుంటూరులో గాలించి వారి వంశీకులను పట్టుకున్నారు. ఇంటర్నెట్ సౌకర్యాన్ని ప్రతిభావంతంగా వాడుకుని వారి రచనలను వెలుగులోకి తెచ్చారు. వయస్సు నిర్ణయించడానికి రాయప్రోలువారి పరంగానే కాకుండా ఆయన భార్య వైపు నుండి కూడా పరిశీలించడం గమనార్హం. సోమయాజులు గారు బి.యే ఉత్తీర్ణుడైన సంవత్సరాన్ని నిర్ధారించడంతో ఆగకుండా, సహాధ్యాయులు, అధ్యాపకులు, పాఠ్య ప్రణాళిక, ప్రశ్నపత్రాల దాకా పరిశోధన సాగడం పరిశోధక విద్యార్థులకు స్ఫూర్తిప్రదం. వ్యాసం చివర ఆధారాలను ఇవ్వడమే కాక సహకరించిన వారందరికీ సాదర కృతజ్ఞతలు తెలిపి పరిశోధక మర్యాదను చాటుకున్నారు. ఈ వ్యాసం చివరలో పేర్కొన్నట్లు కురుగంటి సీతారామయ్య, సరిపెల్ల విశ్వనాథ శాస్త్రి లాంటి వారి గురించేకాక, ఇతర అజ్ఞాత పండితుల గురించి "ఈ వ్యాసం నమూనాలో" సప్రమాణంగా రాసే రచయితలకు మూసీ స్వాగతం పలుకుతుంది. అలాంటి వ్యాసాలు రావాలని ఆశిస్తుంది. అధ్యాపక దినోత్సవ సందర్భంగా ఇలాంటి అజ్ఞాత ఆచార్యుని గురించి వ్యాసం రావడం ఆనందదాయకం. ఆచార్య నిత్యానందరావు గారికి ప్రత్యేక అభినందనలతో... ఎడిటర్ మూసీ).*

1887 జూన్‌లో హైదరాబాద్ స్కూలు, మదర్సా ఆలియా పాఠశాల కలిసిపోయి "నిజాం కళాశాల"గా అవతరించింది. ఇందులో అప్పటి నిజాం నవాబుల పిల్లలు, జమీందారుల పిల్లలు, అత్యున్నతాధికారుల, సంపన్నుల పిల్లలకు ప్రవేశం దక్కేది. ఆ రోజుల్లో గుర్రాల మీద, పల్లకీల మీద కూడా కళాశాలకు వచ్చేవారట. భారతదేశంలో సైన్స్‌లో తొలి డాక్టరేట్ పట్టభద్రులు అఘోరనాథ చటోపాధ్యాయ నిజాం కళాశాలకు మొదటి ప్రిన్సిపాల్. తెలంగాణలో సామాజిక చైతన్యం కలిగిన, కలిగించిన ఎందరో మహనీయులు ఈ కళాశాల నుండి వచ్చినవారే. కారణం ఇది మద్రాస్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండి ఆంగ్ల మాధ్యమంలో సాగడమే.



*రాయప్రోలు వెంకట రామ సోమయాజులు*

మా ప్రియతమ గురువుగారు, పరిశోధక వతంసులు ఆచార్య బిరుదురాజు రామరాజుగారు 1947-49 సంవత్సరాల మధ్య కాలంలో ఆర్థికశాస్త్రం, రాజనీతిశాస్త్రం, తెలుగు ఐచ్ఛికాంశాలు (optional subjects) విషయాలుగా నిజాం కళాశాలలో బి.ఏ చదివారు. వారు చదివిన కాలానికి కాస్త ముందు వెనుకలుగా గరికపాటి లక్ష్మీకాంతయ్య, కురుగంటి సీతారామయ్య (నవ్యాంధ్ర సాహిత్య వీధులు) సంస్కృతం బోధించారు. సరిపెల్ల విశ్వనాథశాస్త్రి తెలుగు బోధించారు. ఈ ముగ్గురు విద్వాంసుల గురించి వారు సగౌరవంగా ఒక వ్యాసంలో వివరిస్తూ అందులో ఒక మాట రాశారు.

**"నేను నిజాం కళాశాలలో చేరటానికి చాలాకాలం పూర్వమే రాయప్రోలు వెంకట రామ సోమయాజి గారనే పండితులు అక్కడ ఆచార్యులుగా పనిచేసి రిటైర్ అయిపోయినారట. 1947 నాటికే వారు లేరు. ఈనాడు వారి గురించి చెప్పగల వారు కూడా ఎవరూ లేరు. కనుక ఆ మొదటి ఆచార్యునికి అంజలి ఘటించి ముందుకు సాగిపోతాను. వారి ఆయిల్ పెయింటింగ్ ఒకటి ఆ కళాశాలలో ఒకప్పుడు చూసినాను. పెద్ద కుంకుమ బొట్టు, తలపాగా ఉన్నవి. మీసాలు లేని కొక్కొండ వెంకటరత్నం గారి పోలికలు వారిలో కనబడినవి"** [1]



*శ్యామలాంబ సీతారామశాస్త్రి*

మా గురువుగారు రామరాజు గారి ఈ పంక్తుల తర్వాత మళ్లీ ఎవరూ దీన్ని గురించి ఆలోచించినట్లుగా లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో అధ్యాపకులుగా రాయప్రోలు సుబ్బారావు గారు 11-9-1919 నాడు నియమితులయ్యారు. వీరే ఇంతవరకు తొలి అధ్యాపకులు అనుకోవచ్చు. కానీ

రాయప్రోలు వెంకట రామ సోమయాజులుగారు వీరికన్నా ముందే నిజాం కళాశాలలో అధ్యాపకులుగా నియమితులు కావడం గమనార్హం. వీరిరువురికి బంధుత్వం ఏదైనా ఉందో లేదో చెప్పగలిగే వారు నేడెవరూ లేరు. నా అన్వేషణలో నాకు లభించిన అదనపు సమాచారాన్ని రికార్డు చేయడమే ఈ వ్యాసం పరమావధి.

**జీవన వివరాలు :** రాయప్రోలు వెంకటరామ సోమయాజులు ఆనువంశికంగా యజ్ఞయాగాదులు చేసే పరమ నిష్ఠాగరిష్ఠమైన వైదిక కుటుంబంలో జన్మించారు. వీరి పూర్వీకులు తెలంగాణీయులు. కాకతీయ ప్రభువు రెండవ ప్రోలరాజు ఇచ్చిన అగ్రహారంవల్ల ఇంటిపేరు వచ్చిందని తలపోసేవారు. మహ్మదీయుల ప్రాబల్యం పెరిగాక గుంటూరు వలస పోయారట. వీరి జననం 15-6-1284 ఫస్లీ. దీన్ని ఆంగ్లశకంలోకి మార్చుకుంటే 19 మార్చి 1875 అవుతుంది. తండ్రిపేరు సూర్యనారాయణ సోమయాజులు.[2] ఆత్రేయ గోత్రీకులు. వెంకటరామసోమయాజులు పసిప్రాయంలోనే తండ్రివద్ద వేదాధ్యయనాన్ని సస్వరంగా, నిర్దుష్టంగా అలవరుచుకొన్నారు. పుష్పగిరి పీఠాధిపతులు వీరి గ్రామానికి వేంచేసినపుడు వారి సమక్షంలో ఈ బాలుడు నిర్భయంగా, నిరాటంకంగా, ఉదాత్తాను దాత్త స్వరితంగా వేదపనసలు వల్లించాడట. దానికి వారెంతో మురిసిపోయి తండ్రితో సహ ఈ బాలుని గజారోహణంతో సత్కరించారట. తండ్రి చిన్ననాటనే చనిపోవడంతో ఎదిగే వయస్సులో ఎంతో దరిద్రబాధ ననుభవించారు. తల్లిగారు శేషసోమిదేవమ్మ స్మార్తం, వేదం, పౌరోహిత్యాల కన్నా ఇంగ్లీషు, డిగ్రీల చదువు చెప్పిస్తే బాగుంటుందని ఎంతో దూరదృష్టితో నిర్ణయించుకొంది. ఆమె భవిష్యద్దర్శనం చాల గొప్పది. కుమారుడు 1933లో రిటైరయ్యే నాటికి (58, కొడుకు పుట్టేనాటికి 17 ఏళ్ళు వేసుకున్నా 75 ఏళ్ళుంటాయి. ఆ వయసులో ఆమె విజయవాడలో దుర్గగుడి సమీపంలో ఒక సంస్కృత (వేద) పాఠశాల నిర్వహించిందట.[3] ఎన్నో కష్టనష్టాలకోర్చి మొత్తం మీద కొడుకును చదివించింది. (ఇంకో కొడుకు కూడా ఉన్నాడు. అతన్ని కూడా చదివించింది. అతని వివరాలు తెలియవు కానీ అతను 1933 నాటికే చనిపోయాడని కురుగంటి వారి వ్యాసం వల్ల తెలుస్తుంది). కొడుకు కూడా తల్లి ఆశలు వమ్ము చేయలేదు. వెంకట రామ సోమయాజులు పట్ట భద్రులయ్యారు. ఆనాటికి ఉస్మానియా, ఆంధ్ర విశ్వవిద్యాలయాలు ఉనికిలోనే లేవు. కనుక సమీపంలో ఉన్న మద్రాసు విశ్వ విద్యాలయం నుండి బి.ఏ డిగ్రీ చేశారు. (ఆపై టీచర్ ట్రెయినింగ్ కూడా చేసి ఉంటారు). తెలుగు, సంస్కృతం, ఆంగ్లభాషల్లో అపార పాండిత్యాన్ని గడించారు. పద్యరచనపై పట్టు సాధించారు. ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువాదాలు చేశారు. వీరికి వేదాంతం అంటే మక్కువ ఎక్కువ. వేదాంతగ్రంథాల విపరీత అధ్యయన ప్రభావంతో 21ఏళ్ళ ప్రాయంలో(1889) సన్న్యాసదీక్షకు సంసిద్ధమయ్యారు. కానీ శ్రేయోభిలాషులు నివారించారు.

**కుటుంబం:** శ్యామలాంబ సీతారామశాస్త్రి. వెంకట రామ సోమయాజులుగారి సహధర్మచారిణి మహాలక్ష్మమ్మ. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురి పేరు లలితాంబ. ఈమె భర్తపేరు బొమ్మకంటి నరహరిశాస్త్రి. ప్రభుత్వ వకీలు. వీరి ఏకైక కుమారుడు బొమ్మకంటి సీతారామశాస్త్రి. తర్వాత చిన్నవయసులోనే ఆమె మరో కొడుకుని కని చనిపోయింది. "రెండవకూతురు శ్యామలాంబ. ఈమె భర్త గరికపాడు గ్రామస్థుడైన సీతారామశాస్త్రి. అగ్రికల్చరల్ డెమాన్స్ట్రేటర్. సంపన్నకుటుంబం. వీరికి ఒక అబ్బాయి, ఐదుగురు అమ్మాయిలు, 1950లో ఉవ్వెత్తున చెలరేగిన కమ్యూనిస్టు పోరాటంలో వీరి ఇంటిపై నలభైమంది కమ్యునిస్టులు దాడిచేశారు. నగా నట్రా అన్నీ తీసి ఇస్తూ నా భర్తనేం చేయకండని శ్యామలాంబ ఎంత వేడుకొన్నా వినకుండా పరమ కిరాతకంగా పొడిచి సీతారామశాస్త్రిని చంపేశారు. శ్యామలాంబ ఎంతో ఉదార హృదయ. ఎందరికో పెళ్ళిళ్ళల్లో తాళిబొట్లు దానం చేశారు. ఎన్నో రకాల సహాయాలు చేశారు. ఆధ్యాత్మిక కీర్తనలను శ్రవణపేయంగా ఆలపించేవారు. నేను శ్యామలాంబ దౌహిత్రిని. ఇక మా తాతయ్య వెంకటరామ సోమయాజులు దబ్బపండుఛాయతో నిగనిగలాడుతూ ఉండేవారు. అచ్చం శంకరాచార్యులలాగా ఉండేవారు. చదువుకొనే పిల్లలంటే చాల ప్రేమ చూపేవారు. నేను S.S.L.C ఆ రోజుల్లో పాసయ్యానని నా పట్ల బాగా అభిమానం చూపేవారు. ఆయన ఎప్పుడూ జపం చేసుకొంటూ మౌనంగా ఉండేవారు. మా అమ్మమ్మ శ్యామలాంబ 76వ ఏట 1972 కార్తీక సోమవారం మాసశివరాత్రినాడు శివ సాయుజ్యం పొందింది"- అని శ్యామలాంబ దౌహిత్రి శ్రీమతి వేలూరి భగవతిగారు (భర్త. వేలూరి వెంకటకృష్ణమూర్తిగారు) ఎంతో సంతోషంతో టెలిఫోను ద్వారా వివరాలందించారు. వారికి నా కృతజ్ఞతలు...


శ్యామలాంబ1896లో జన్మించిందని రూఢి అవుతుంది. తరువాత 15ఏళ్ళకు పుట్టిన ఏకైక కుమారుడు రాయప్రోలు సదాశివ సూర్యనారాయణ సోమయాజులు (1911లో). తండ్రి పేరు కలిసి వచ్చేలా పేరు పెట్టుకొన్నారన్నమాట! సదాశివ సూర్యనారాయణ సోమయాజులు గారి శ్రీమతి పేరు సంపూర్ణ కామేశ్వరమ్మ. వీరికి నలుగురు కొడుకులు, ఏడుమంది కూతుళ్ళతో తామరతంపరగా వంశాభివృద్ధి జరిగింది. సదాశివ సూర్యనారాయణ సోమయాజులు 24-11-1986న 75 ఏళ్ళకు కాస్త అటూ ఇటూగా ఒక పెళ్ళిలో అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు.

వెంకట రామ సోమయాజులుగారి భార్య మహాలక్ష్మమ్మ భర్తకు అన్నివిధాలా చేదోడువాదోడుగా ఉండేది. అరవై ఏళ్ళకు కాస్త అటూ ఇటూగా స్వర్గస్థురాలైంది. (1933-36 మధ్యలో). అప్పటినుంచి సోమయాజులుగారు, తమ సహధర్మచారిణి స్మారకంగా కేవలం మధ్యాహ్నం పూట మాత్రమే భోజనం చేసి రాత్రి పూట ఏ పండో తిని, కాసిన్ని పాలు తాగి కాలం గడిపే నియమం పెట్టుకొని 1964లో అస్తమించేదాక 30 ఏళ్ళపాటు గడిపారట.

వెంకట రామ సోమయాజులుగారు సంపూర్ణాయుష్కులై మనుమలు మనుమరాళ్ళ సంతానాన్ని కూడా కళ్ళారా చూసి ఆనందించి బాగా పండిన దోసకాయ తొడిమ నుంచి రాలిపోయినట్లు (సుగంధిం, పుష్టివర్ధనం ఉర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్)గా 31-10-1964 శనివారంనాడు తమ జీర్ణ శరీరాన్ని వదిలేశారు. అయితే గుంటూరు మునిసిపాలిటీ వారిచ్చిన డెత్ సర్టిఫికేట్‌లో 96 ఏళ్ళని పేర్కొనబడింది. నిజాం ప్రభుత్వం కాలంలో ఉద్యోగం చేస్తున్నపుడు నమోదైన జననతేదీ 19 మార్చి 1875. (వెంకట రామ సోమయాజులుగారి మునిమనుమడు రాయప్రోలు శరత్ బాబుగారు ఫోటోలను, మరణధ్రువీకరణ పత్రాన్ని, తగిన సమాచారాన్ని, వారి మేనత్త శ్రీమతి భగవతిగారి ఫోన్ నంబరును అందించి సహకరించారు. వారికి సాదర ధన్యవాదాలు. శరత్ బాబుగారి ఫోన్ నెంబర్ ఇచ్చి పరిచయం చేసిన డా.ధూళిపాళ రామకృష్ణ (సంస్కృతం లెక్చరర్,) సోదరి వెలిదండ్ల మంగాదేవి (తెలుగు లెక్చరర్, మేరీ స్టెల్లా కాలేజి విజయవాడ) గారలకు కృతజ్ఞతలతో ....)

వెంకటరామ సోమయాజులు మహాలక్ష్మమ్మ సదాశివ సూర్య నారాయణ, సంపూర్ణ కామేశ్వరమ్మ. 96 ఏళ్ళని విశ్వసిస్తే 1964-96=1868 పుట్టిన సంవత్సరమవుతుంది. వారు చిన్నపుడు సాంప్రదాఅతీకంగా పౌరోహిత్యం, వేదాధ్యయనంతో ఎదిగి ఉంటారు. బతుకు తెరువు నిమిత్తం ఇంగ్లీషు పాఠశాలలో చేరినపుడు దాని కనుగుణంగా వయసు తక్కువ వేసి ఉండడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. ఆలా చాలమందికి అసలు పుట్టిన తేది ఒకటి, అధికారికంగా నమోదైన తేది ఒకటి ఉండడం గమనిస్తాం. వారు వారి కుటుంబీ కులతో తమకు 96 ఏళ్ళు అని చెప్పడం వల్లనే మరణ ధ్రువీకరణ పత్రంలో 96 అని వేసి ఉంటారు. వారు రిటైరయ్యేనాటికి ఈ లెక్కన 65 ఏళ్ళు నిండుతాయి. వారి అమ్మగారు శ్రీమతి సోమిదేవమ్మ గారు బతికే ఉన్నారు. అంటే ఆమె వయస్సు దాదాపు 82 దాకా ఉంటాయి. ఇది కరెక్టా కాదా అని మరో రకంగా పరీక్షించవచ్చు. భార్య 60వఏట చనిపోయింది. తర్వాత వారు 30 ఏళ్ళు బతికి 1964లో పోయారు. 1964-30= 1934. 1934నాటికి అరవై అయితే (1934-60)1874 ఆమె పుట్టిన సంవత్సరమవుతుంది. సోమయాజులుగారి ఆధికారికంగా నమోదైన పుట్టిన సంవత్సరం 1875. ఆ ప్రకారం భార్యకన్నా చిన్నవారవుతారు. కనుక అది పొసగదు. అందువల్ల 1868 ఆయన జన్మించిన అసలు సంవత్సరమే నని అని విశ్వసించవచ్చు. ఇంటినెంబరు 24-11-79/ఏ. రామచంద్రపుర(R)) అగ్రహారం, గుంటూరు వారి నివాసస్థలం.

**నిజాం కళాశాల జీవితం :** సోమయాజులు గారు 1902లో నిజాం కళాశాల నుండి బి.ఏ తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆ సంవత్సరం మద్రాసు విశ్వవిద్యాలయం బి.ఏ ప్రథమ శ్రేణిలో ఉ


*మహాలక్ష్మమ్మ, సదాశివ సూర్యనారాయణ, సంపూర్ణకామేశ్వరమ్మ*

త్తీర్ణులైన వారు ఇద్దరే. ద్వితీయ శ్రేణిలో కొన్ని వందలమంది, తృతీయ శ్రేణిలో ఇంకా అంతకు రెట్టింపు అని గమనిస్తే చాలు. ఈనాటి ఉత్తీర్ణతా శాతాన్ని బట్టి ఆలోచించకూడదు. తృతీయశ్రేణి రావడం కూడా చాలా గొప్ప అనుకోవాల్సిందే. రాయప్రోలు సోమయాజులతో పాటు ఆయన సహాధ్యాయులైన సయ్యద్ జహుర్ అలీ, నాదిర్షా బంజిషా, కృష్ణాజి గోవింద్‌కాలే, గోవింద నారాయణ పోద్దార్, నారాయణ హరిపంత్ పరాందేకర్, కృష్ణంరాజు లాంటివారు తృతీయశ్రేణిలో ఉత్తీర్ణులైతే. వ్యాకరణం రంగాచారి, (గోవర్ధనం), భీం రావు, భూపేంద్ర నాథచౌదరి, కార్నియన్ చార్లెస్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. (అప్పటి తెలుగు ప్రశ్న పత్రమెలా ఉండేదో కింద ఫుట్‌నోట్స్ లో ఇచ్చాను. జిజ్ఞాసువులు నేటి ప్రశ్నపత్రంతో సరిపోల్చి చూసుకోవచ్చు.)

సోమయాజులు గారు చదువుకునే రోజుల్లో నిజాం కాలేజీకి ఈ.ఏ సీటన్ ప్రిన్సిపాల్. పీహెచ్ స్టర్జ్ (వైస్ ప్రిన్సిపల్) ఇంగ్లీష్ చరిత్ర చెప్పేవాడు. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ గారు సైన్స్ బోధించేవారు. చందా రైల్వే స్కీం గొడవల్లో నిజాం ప్రభుత్వ ఆగ్రహానికి గురై, ప్రిన్సిపాల్ పదవిని పోగొట్టుకొని, రాజ్య బహిష్కరణ శిక్ష అనుభవించి కొంతకాలానికి పెద్దల జోక్యంతో తిరిగి ప్రిన్సిపాల్‌గా కాకుండా సైన్స్ లెక్చరర్‌గా అఘోరనాథ్ ఛటోపాధ్యాయ నిజాం కాలేజీలో చేరారు. ఆయన కూతురు సరోజినినాయుడు గారితో కూడా చాలినంత పరిచయం ఉండేది. సమ వయస్కులే.

కే. బర్నెట్ (తదనంతర కాలంలో చాలా ఏళ్లు ప్రిన్సిపాల్‌గా పని చేసిన వారు) ఇంకా ఏ. గ్లోరియా హెచ్.సి కూని అనే మరో ఇద్దరు ఆంగ్లేయులు ఆంగ్లం లాటిన్ నేర్పేవారు. దత్తాత్రేయ కృష్ణ హర్డికర్ సంస్కృతాన్ని, యడవల్లి వెంకట శాస్త్రి గణితాన్ని, మౌల్వి అలీ హైదర్ పర్షియన్, మహాదేవశాస్త్రి సంస్కృతం నేర్పేవారు.

1902లో డిగ్రీ పూర్తి కాగానే మదరాసు విశ్వవిద్యాలయాని కనుబంధమైన హైదరాబాదులోని చాదర్ ఘాట్ ఉన్నతపాఠశాలలో అధ్యాపకులుగా నియమితులయ్యారు. 1937లో వీరి బాల్యకృతి

ఆంధ్ర మేఘ సందేశం ప్రచురితమైంది. దాని ముందుమాటలో "దాదాపు ముప్పదినాలుగు సంవత్సరముల క్రింద" ప్రభుత్వ ఛాదర్ ఘాట్ హైస్కూలులో పనిచేస్తున్నపుడు రాసిన రచనగా పేర్కొన్నారు. కనుక వారు 1903 నాటికే ((1937-34=1903. అధ్యాపకులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించారని నిర్ధారణగా తెలుస్తుంది. ఛాదర్ ఘాట్ స్కూల్లో వారు గణితం, ఆంగ్లం, సైన్స్ బోధించారు. 1910 నిజాం కళాశాలలో సంస్కృత ఆంధ్ర అధ్యాపకు (assistant professor) లయ్యారు. ఇది కొంత సంశయాన్ని కలిగించకపోదు. కురుగంటి సీతారామయ్య 1933 మార్చి భారతిలో వీరి గురించి రాస్తు **"ఇరువదియారు వత్సరములు నిజాం రాష్ట్రము హైదరాబాదు నందలి యున్నత కళాశాలలో సంస్కృతాంధ్రపీఠము నధివసించా"** రన్నారు. ఆవిధంగా అయితే 1933-26 = 1907 అవుతుంది. నిజాం కళాశాలలో 1907లో చేరి 1933లో రిటైరయినట్లు తెలుస్తుంది.

(Madras University calendar 1934లోని నిజాం కాలేజి అధ్యాపకుల్లో వారి పేరు లేకపోవడం కూడా ఒక సాక్ష్యమే.) 1928లో ప్రచురించిన "మిహిరాండభారతి" నాటకానువాదంలో **"హైదరాబాదు లోని నిజాంకాలేజి యందలి ప్రధాన సంస్కృతాంధ్రోపాధ్యాయులు"** అని పేర్కోవడం ప్రొఫెసర్ అయ్యారనేదే తెలుపుతుంది. నెలవారి జీతం 340. (ఇది చాల ఎక్కువ జీతమే ఆరోజుల్లో. బహుశా పూర్వ సర్వీసు వల్ల వచ్చి ఉంటుంది.) స్కేలు 250-60. 1929-30 నాటికే వారు Professor of Telugu and Sanskrit అని విస్పష్టంగా పేర్కొనబడ్డారు. ఉద్యోగంలో ప్రవేశించిన తేదీ 1-5-36 ఫస్లీ. అంటే 3 ఫిబ్రవరి 1927 అని ఒకటి లభించింది. ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొందిన తేది అది. 1927నాటికి ఏ విశ్వవిద్యాలయ తెలుగు శాఖల్లోనూ తెలుగు ప్రొఫెసర్ లేరన్న సంగతి అందరికీ తెలిసిందే. కనుక వీరే తొట్టతొలి తెలుగు ఆచార్యులన్నది నిర్వివాదాంశం.

**విద్యార్థులు – పాఠ్య ప్రణాళిక :** సోమయాజులు నిజాం కళాశాలలో పనిచేస్తున్న కాలంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, సూరి భగవంతం, సిరుగూరి జయరావు, ఖండవల్లి లక్ష్మీరంజనం, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, నవాబ్ అలియావర్ జంగ్ లాంటి లబ్ధ ప్రతిష్ఠులెందరో చదివారు.

ఆ రోజుల్లో నిజాం కాలేజీలో ఇంటర్మీడియట్, డిగ్రీ రెండూ ఉండేవి. కనుక సోమయాజులు గారు రెండింటికీ బోధించాల్సిందే. వారు, వారి సహాధ్యాపకులు సరిపెల్ల విశ్వనాథశాస్త్రి గారు ఇద్దరు కలిసి తెలుగు క్లాసులు నిర్వహించేవారు. మరి అప్పటి వారి పాఠ్యప్రణాళిక (సిలబస్) కూడా ఎలాంటిదో గమనిద్దాం. వారు రిటైర్ అయ్యే చివరి సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పాఠ్యప్రణాళిక ఇలా ఉండేది. ప్రాచీన పద్యభాగంలో 1.నన్నయభారతం నుంచి ద్రౌపదీ స్వయంవరం 2. ముక్కుతిమ్మన పారిజాతాపహరణం పంచమాశ్వాసం, 3.శంకర కవి హరిశ్చంద్రోపాఖ్యానం తృతీయాశ్వాసం. ఇక భోగరాజు నారాయణమూర్తి 'కంకణం' ఆధునిక పద్యభాగం కింద ఉండేది. బలిజేపల్లి లక్ష్మీకాంతం ఉత్తర రామచరిత్ర నాటకం ఉండేది. గద్యభాగంలో శతఘంతం వెంకటరంగయ్య శాస్త్రి భాగవతం దశమస్కంధం, విద్వాన్ దూసి రామమూర్తి శాస్త్రి 'ఉదయసుందరి' ఉండేవి. సత్య గోదావరిశర్మ 'వీరవిలాసిని' (చారిత్రక నవల) మండపాక కామేశ్వర శాస్త్రి 'ప్రాయశ్చిత్తం' ఉండేది.

డిగ్రీకి వస్తే పద్య భాగంలో భారతం ద్రౌపదిహరణం- సైంధవ భంగం 118 పద్యాలు, పంచనళీయం- నలవరణం శృంగారనైషధం నుండి 30 పద్యాలు, మంజువాణి దౌత్యం వసుచరిత్ర నుండి 68 పద్యాలు ఆధునిక పద్యభాగంలో వడ్డాది సుబ్బరాయ కవి మేఘ సందేశం, సిహెచ్ నరసింహశాస్త్రి శృంగారకాదంబరి పంచమా శ్వాసం పూర్వభాగం ఉండేవి. నాటకవిభాగంలో వేదం వెంకటరాయ శాస్త్రి నాగానందం, ఉండేది. గద్యభాగంలో శతఘంటం వెంకట రంగయ్య శాస్త్రి భాగవతం ప్రథమస్కంధం, కోరాడ రామచంద్ర శాస్త్రి 'పరశురామ విజయం', కళివె వీర రాజు ఆంధ్ర వచన భారతం సభాపర్వం ఉండేవి. జి.సత్య గోదావరిశర్మ 'రాజశ్రీ' నవల, భాష్యకారాచార్యుల 'వీరాబాయి' నవల ఉపవాచకాలు. ఇవి మచ్చుకు చాలు. పార్ట్ 1,2, ఏ, బి ఇత్యాది తేడాలున్నాయి. ద్వితీయ సంవత్సరం సిలబస్ అనవసరం.


కే. బర్నెట్ ఆ రోజుల్లో చాలా కాలం ప్రిన్సిపాల్ గా(1918-1928) పని చేశారు. అబ్దుల్ రెహమాన్ ఖాన్ (భౌతికశాస్త్రం), గుండూరావ్ (భౌతికశాస్త్రం) అరుణాచల శాస్త్రి (లెక్కలు), జెసి కామేశ్వరరావు (సైన్స్), తనికెళ్ల వీరభద్రుడు (ఆంగ్లం) సిరుగూరు హనుమంతరావు (చరిత్ర-ఒక ప్రత్యేక మోనోగ్రాఫ్ రాయదగిన మహనీయుడు. 1920-1953 దాకా పని చేశారు), ఎస్.కె. అయ్యం గార్ (ఆర్థికశాస్త్రం) హుస్సేన్ అలీఖాన్ (ఆంగ్లం) ఎ. సీతారామారావు (సంస్కృతం) ఇలాంటి వారంతా వివిధ కాలాల్లో వారికి సహాధ్యాపకులుగా పనిచేశారు. స్థానికంగా ఉన్న ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగుశాఖ పాఠ్యప్రణాళికాసంఘంలో చాలా ఏళ్ళు సభ్యులై మెట్రిక్యులేషన్, ఇంటర్, డిగ్రీల పాఠ్యప్రణాళిక రూపకల్పనలో ఉ.వి.తెలుగుశాఖ అధ్యక్షులు రాయప్రోలు సుబ్బారావుకు చేదోడు వాదోడుగా సోమయాజులు వ్యవహరించారు.

నిజాం కళాశాల ప్రిన్సిపల్ బర్నెట్ క్రమశిక్షణకు మారుపేరు. చండశాసనుడు. కానీ విద్యార్థుల మీద వాత్సల్యం కూడా ఉన్నవాడు. బర్నెట్ కాలంలో జరిగిన ఒక సంఘటన అప్రస్తుతమైనా చెప్పకుండా ఉండలేకపోతున్నాను. ఆనాటి పెద్దల సంస్కారం స్ఫూర్తిమంతమైంది.

నూతనతరానికి అందాలన్న తపనతో ఇక్కడ పొందుపరుస్తున్నాను. నిజాం రాష్ట్ర ప్రధానమంత్రి సర్ కిషన్ ప్రసాద్ కొడుకు నిజాం కాలేజీ విద్యార్థి. ఏదో అల్లరి చేశాడని, క్రమశిక్షణ విరుద్ధంగా వ్యవహరించాడని ప్రిన్సిపాల్ బర్నెట్ అతన్ని కళాశాల నుండి బహిష్కరించారు. మరురోజు పొద్దున్నే ప్రధానమంత్రి కిషన్ ప్రసాద్ కళాశాలకు స్వయంగా వచ్చారు. ప్రిన్సిపల్ తన టోపీ ధరించి ప్రధానమంత్రి గారికి సగౌరవంగా స్వాగతం చెప్పి ఆహ్వానించారు. ప్రధానమంత్రి ప్రిన్సిపాల్ గదిలో కూర్చున్నారు. **"ప్రిన్సిపల్ సాహేబ్! బచ్చే సే గల్తీ హుయ్ హోగి. ఆప్ బుజుర్గ్ హెయిన్, ఆప్ మెహెర్బాని కర్కే మాఫ్ కర్ దీజియే"** ("పిల్లవాడు ఏదో చిన్నతనం కొద్దీ తప్పు చేశాడు. కాదని నేనేమీ అనడం లేదు. మీరు పెద్దవారు, అనుభవజ్ఞులు. పెద్ద మనసు చేసుకొని క్షమించవలసింది.) అని కిషన్‌ప్రసాద్ చేతులు జోడించి ఉర్దూలో అర్థించారు. ప్రిన్సిపాల్ కూడా అంతే గౌరవంగా విద్యార్థి బహిష్కరణను ఉపసంహరించారు. ఈకాలంలో అయితే ప్రిన్సిపాల్ ను తీసేయడం, మరేవేవో చేసేవారు. ఆనాటి పెద్దల హుందాతనం మనకెప్పుడూ ఆదర్శం కావాలి.




నిజాం కాలేజిలో వారు 1932దాక పని చేసినట్లు అధికారిక దాఖలాలు లభిస్తున్నాయి. 1933 మార్చి భారతి మాసపత్రికలో కురుగంటి సీతారామయ్య "కొలది దినముల కిందట ఉపకార వేతనం పొందా"రని రాశారు. కనుక 1933 మార్చిలో రిటైరయ్యారని స్పష్టమవుతుంది. అంటే 58 ఏళ్ళకు రిటైరయ్యారన్న మాట. మొత్తం మీద వీరి ఉద్యోగకాలం (ఛాదర్ ఘాట్ హైస్కూలు, నిజాంకళాశాల కలిపి) 1900–1933గా నిర్ణయించుకోవచ్చు.




హైదరాబాదులో ప్రముఖన్యాయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు యడవల్లి శివరామశాస్త్రి తమ జీవిత చరిత్రలో పేర్కొన్న ఉదంతం స్మరణీయం. నిజాం కళాశాలలో గణితశాస్త్ర ఆచార్యులుగా పనిచేసిన యడవల్లి వెంకటశాస్త్రి (1858–1927)దత్తపుత్రుడే శివరామశాస్త్రి. ఆయనకు కారణాంతరాల వల్ల నిజాం కళాశాలలో ఇంటర్మీడియేట్ (ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశం లభించలేదు. అప్పుడు రాయప్రోలు వెంకట రామ సోమయాజులు 1942 జూన్‌లో సిటీకాలేజిలోని ఇంటర్ మీడియేట్ (ఉర్దూ మీడియం)లో తనను చేర్పించినట్లుగా శివరామశాస్త్రి రాసుకొన్నారు. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్‌లో చేరడానికి తల్లి ఇష్టపడలేదు. అప్పుడు రాయప్రోలు సోమయాజులు, వారి అల్లుడు, ప్రభుత్వ న్యాయవాది అయిన బొమ్మకంటి నరహరిశాస్త్రి తమ తల్లిగారికి నచ్చ చెప్పాలని శతవిధాలా ప్రయత్నించి విఫలురయ్యారనీ, ఆవిధంగా తాను ఇంజనీర్ కాకుండా లాయర్ నైనట్లు శివరామశాస్త్రి పేర్కొన్నారు.

**తెలుగు సారస్వత సమితి :** నిజాం కళాశాల విద్యార్థులు **"నిజాం కళాశాల తెలుగు సారస్వత సమితి"** అని ఒక సంస్థను స్థాపించుకొని దాని పక్షాన "విద్యార్థి" అనే పేరుతో ఒక షాణ్మాసిక పత్రికను చాలా కాలం నిర్వహించారు. ఇది 1935లో ప్రారంభమైందని తెలుస్తుంది. ఆ ప్రారంభ సంచిక దొరికితే వీరికి సంబంధించిన ఏవైనా వివరాలు తెలియవచ్చు. ఇది లిఖితపత్రికగా మొదలై రెండు మూడేళ్ళలో ముద్రితపత్రికగా వృద్ధిలోకి వచ్చింది. ఈ సంచికకు తెలుగు అధ్యాపక వర్గం మార్గదర్శనం చేసేది. విద్యార్థులు వ్యాసాలు, కవితలు రాసేవారు. 1953– 54 'విద్యార్థి' సంచికలో యావజ్జీవ గౌరవసభ్యులుగా శ్రీ రాయప్రోలు వెంకటరామ సోమయాజులను, తనికెళ్ల వీరభద్రుడు గారిని ప్రత్యేకించి పేర్కొన్నారు. వారికీ, వారి ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలుపుతూ భగవంతుడు వారికి ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని కోరుకున్నారు విద్యార్థి సంపాదకులు. సోమయాజుల తరువాత నిజాం కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులైన సరిపెల్ల విశ్వనాథశాస్త్రి గారు 1951లో రిటైరయ్యారు. కనుక వారివల్ల విద్యార్థి సంపాదకులకు తెలియడం సహజం.



**విస్మృతుడు :** ఇంతటి పండితుడు, తొలితరంవ్యక్తి సాహిత్య చరిత్రలో, సమాజంలో అనామకుడుగా మిగిలిపోవడం ఆశ్చర్యకరం. హైదరాబాదులోని ఉద్యోగ కాలంలో 1903– 1933లో పెద్దగా పేరు రాకపోవచ్చు. కానీ అది కూడా సరికాదు. సురవరం ప్రతాపరెడ్డి లాంటి శిష్యులే ఉన్నారు. ఎందరో సాహితీవేత్తలకు నిలయమైన గుంటూరులో 1933 నుంచి 1964 వరకు (చనిపోయేదాకా) మూడు దశాబ్దాలు జీవించారు. చివరి పదేళ్ళు వార్ధక్యం అనుకున్నా, సాహిత్య వ్యాసంగానికి ఎలాంటి ఆటంకం లేదు. కాశీ కృష్ణాచార్యులు, ఓరుగంటి నీలకంఠశాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ, వావిలాల సోమయాజులు, పల్లె పూర్ణ ప్రజ్ఞాచార్యులు, మిన్నికంటి గురునాథ శర్మ, వల్లభజోస్యుల సుబ్బారావు, జటావల్లభుల పురుషోత్తం, నోరి నరసింహశాస్త్రి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, గుర్రం జాషువా లాంటి దిగ్దంతులైన పండితులు, కవులు గుంటూరులో ఉన్నారు. వేలూరి శివరామశాస్త్రి గారితో బంధుత్వం ఉంది. సంస్కృతం, ఆంగ్లం, ఆంధ్రం బాగా వచ్చిన పండితులు. పద్యరచన తెలిసిన పండితులు అయిన రాయప్రోలు వెంకటరామ సోమయాజులు వారందరికన్నా వయసులో పెద్దవారు కనుక పెద్దరికం కూడా కలిసి వస్తుంది. కానీ వీరు ఒక రచయిత అని కుటుంబసభ్యులకుకానీ, పుర ప్రముఖులకు కానీ తెలియకుండా పోయింది. స్వాతంత్రోద్యమ పవనాలు బలంగా వీస్తున్న కాలం అయినా స్పందన శూన్యం. బహుశ ఏమాత్రం చొరవ లేనితనమేమో! రిటైర్మెంట్, భార్య మరణం తరువాత తాను రాసిన పుస్తకాలను అచ్చులో చూసుకుని ఆనందించారు. తర్వాత తననుతాను పూర్తిగా ఉపసంహరించుకున్నారు. లౌకికమైన సాహిత్య వ్యాసంగం పట్ల, సమాజం పట్ల అనాసక్తత పెంచుకున్నారు. అమ్మవారి ధ్యానం తప్ప అన్యమేదీ గమ్యం కాదనుకొని మానసిక సన్యాసం స్వీకరించి అంతర్ముఖులైపోయారు. దాంతో పూర్తిగా తెర మరుగైపోయారు. తెలుగు శాఖలో ఆచార్యునిగా పొట్ట పోసుకొని బతికిన నాకు, నిజాం కళాశాలలో పదేళ్లపాటు అధ్యాపకునిగా పనిచేసిన నాకు, మా నిజాం కళాశాలకే కాదు, అన్ని విశ్వవిద్యాలయాల తెలుగు శాఖలకు ప్రప్రథమ తెలుగు సంస్కృత ఆచార్యులైన రాయప్రోలు వెంకటరామ సోమయాజుల గురించి రాసే అవకాశం భగవంతుడు ప్రసాదించడం అత్యంత ముదావహం. ఇలాంటి వ్యాసాలు రాయటం నాకు నిత్యానందదాయకం.

**సాహిత్య జీవితం :** సోమయాజులుగారు కేవలం పాఠాలు చెప్పుకొని అనామకంగా బతికినవారేమీ కాదు. ఆనాటి హైదరాబాదు చైతన్యకేంద్రమైన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయంతో వారికి సంబంధాలున్నాయి. పద్యకవిగా, నాటకానువాదకునిగా, వ్యాస కర్తగానేకాక శాస్త్రవాఙ్మయకర్తగా కూడా మన్ననలందుకొన్నారు.

**పద్యకవిగా :** రాయప్రోలు సోమయాజులు ఆంధ్ర మేఘసందేశాన్ని 1937లో వెలువరించారు. కాళిదాసు మేఘసందేశానికి ఇది అనువాదమని ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. **"ఈ మహాకవి కావ్యం మేఘ సందేశమును సక్రమ విధమున నాంధ్రీకరించు సమర్థత నాకు లేదని యెఱింగియు...... నా చిన్నతనమున దాదాపు ముప్పది నాలుగు సంవత్సరముల క్రిందట నప్పటి యనుభవ హీనమైన సాహసమున గవర్నమెంట్ ఛాదర్ఘాట్ హైస్కూల్లో నాంగ్ల భాషా ప్రకృతిశాస్త్ర గణితశాస్త్రాదులను బోధించు నుపాధ్యాయ పదవిలో ఉన్న కాలమునందు రచియించి యుంచితిని. కానీ, నాకే తృప్తి కరముగా లేని యాంధ్రీకరణమగుటచే నింతవరకు ముద్రణమునకు పంపనైతిని"** అని పీఠికలో చెప్పుకున్నారు. అనువాదం బావుందా బాగాలేదా అనేది అభిరుచి సమస్య. ముప్పది నాలుగేళ్ల కింద (1937 –34) అనగా 1903లో రాసినట్లు స్పష్టం. అప్పటికి బహుశా ఆయన తొలి రచన కావచ్చు. ఆనాటి కాయనకు 28ఏళ్ళు. మరీ రాయలేని వయసేం కాదు. తర్వాతి కాలంలో రిటైర్ అయిన పిదప బాల్య రచనల మీద, అముద్రితాల మీద ఆసక్తి జనించి ముద్రణ రూపంతో చూసుకోవాలి అన్న కోరిక తలెత్తడం సహజం. అందుకే 1937లో దీన్ని ప్రకటించారు. ఆనాటికే సాహిత్యంలో వ్యావహారిక భాషోద్యమం, సమాజంలో వినూతన ఆలోచనలు, కళాశాలల్లో సరికొత్త అధ్యయనాంశాలు, భాషల తులనాత్మక పరిశీలనలు– వెరసి నూతన చైతన్యం మొదలైంది. పీఠికలో వాటి ప్రతిధ్వని వినిపిస్తుండడం గమనించవచ్చు. **"ఈ కాలమున నానా వ్యాకరణ సిద్ధాంతములు ప్రబలుటయే కాక, వ్యాకరణమే పనికిరాదను సిద్ధాంతము కూడ ముదిరి యుండుటచేత ధైర్యం వహించి... నా యీ చిన్నతనంపు గావ్యమును ప్రచురించు చున్నాడను"** అని చెప్పుకున్నారు. కానీ పద్యరచనలో ధార, నిర్దుష్టత, కాళిదాసును తెలుగులోకి తేవాలన్న దీక్ష కనిపిస్తున్నాయి.

**శ్రీ జనకాత్మజాస్నపన సేవన పూత జలంబు గట్టులన్**
**భూజపునీడలం గరముఁ బొల్పగు రామగిరిన్ వసించె య**
**క్షోజన రాజశాపమునఁ జొక్కి సతిన్ మఱువంగ లేక యే**
**రోజుఁ దదేక చింత నొకరుండు హయానను డొక్కయేడటన్**

మూలం

**కశ్చిత్కాంతా విరహ గురుణా స్వాధికారాత్ప్రమత్తః**
**శాపే నా స్తంగమిత మహిమా వర్ష భోగ్యేన భర్తుః**
**యక్షశ్చక్రే జనకతనయా స్నాన పుణ్యోదకేషు**
**స్నిగ్ధ చ్ఛాయా తరుషు వసతిం రామగిర్యాశ్రమేషు**

మరొకటి

**కనియెన్ గాముక యక్షుఁడంత గిరిపైఁ గాంతావియోగార్తితో**
**వని మాసంబులు కొన్ని పుచ్చి యెటులో వర్షాగమోద్యద్ఘటనా**
**ఘన మాషాఢపుటాది వాసరమునం గట్టుట నుతా?త కే**
**ళిన నాగంబుగతిన్ గడాని కడెముల్ లేకుంట గేల్బోసిగాన్**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11  UGC CARE List Approved Journal
హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

మూలం

**తస్మిన్న ద్రౌ కతిచిదబలావిప్రయుక్తస్సకామీ**
**నిత్వా మాసా మాసాన్ కనకవలయ భ్రంశరిక్త ప్రకోష్టః**
**ఆషాఢస్య ప్రథమ దివసే మేఘమాశ్లిష్టసానుం**
**వప్రక్రీడా పరిణత గజప్రేక్షణీయం దదర్శ**

మేఘసందేశం పూర్వోత్తర భాగాలు రెండు చంపకోత్పలాలు, మత్తేభ శార్దూలాలు, కందాలతో సాగాయి. ఒక మందాక్రాంతం, తోటకం కూడా అనువాదంలో చోటు చేసుకోవడం విశేషం. (ఈ పుస్తకాన్ని అందించిన సన్మిత్రులు బంగారు రామాచారి కోదాడ, నిజంగా బంగారం లాంటి మనిషే, వారికి ధన్యవాదాలు.)

**నాటకానువాదకునిగా :** ఆంగ్ల సాహిత్యంలో షేక్స్పియర్ నాటకాలు శిఖరప్రాయమైనవి. నేరుగా ఆంగ్లేయుల శిష్యరికంలో షేక్స్పియర్ నాటక మాధుర్యాన్ని మనసారా గ్రోలిన వారు రాయప్రోలు లాంటి స్వాతంత్ర్య పూర్వం విద్యార్థులు. అందుకే ఆ నాటకాలకు ఆకృష్టులై సోమయాజులు మూడు షేక్స్పియర్ నాటకాలకు "ఆంధ్రీకరణలు" చేశారు.


1. మిహిరాండభారతి– Tempest కు అనువాదం. 1928 . పుటలు 138
2. కార్యలీనుడు– Coriolanus కు అనువాదం. 1928 తర్వాత, 1936కు ముందు
3. స్వప్నశివపాలిత – Mid Summer night dreams కు అనువాదం. 1936. పుటలు. 135.

నేడు సాధారణంగా అనువాదాలకు పాత్రల పేర్లను, స్థలాల పేర్లను యథాతథంగా ఉంచుతూ మూలంలో గద్యం ఉన్నచోట గద్యాన్ని, పాట పద్యం ఉంటే ఆ రూపంగానే అనువాదం చేయడం స్థిరపడింది. కానీ సోమయాజులు కాలంలో ఉన్న ధోరణి వేరు. పాత్రల పేర్లను, స్థలాలపేర్లను కూడా తెలుగు జేసేవారు. నాంది, ప్రవేశిక, చివరికి భరతవాక్యం రాసేవారు. సోమయాజుల కన్నా ముందు వావిలాల వాసుదేవశాస్త్రి షేక్స్పియర్ ప్రసిద్ధనాటిక జూలియస్ సీజర్ ను "సీజర్ చరిత్రము" పేరిట 1875లో ఆనువదించారు. తెలుగులో వచ్చిన తొలి పాశ్చాత్య నాటకానువాదమిది. దీనిలో కూడ ఇదే రకం అనువాద విధానం పాటించబడింది. 1881లో కందుకూరి వీరేశలింగం అనువదించిన షేక్స్పియర్ నాటిక "కామెడీ ఆఫ్ ఎర్రర్స్" లో కూడ నాంది, ప్రస్తావనలు, భరతవాక్యాలు చూడవచ్చు. సోమయాజులు కూడా అదే విధానంలో సాగిపోయారు.

షేక్ స్పియర్ రాసిన "ది టెంపెస్ట్" నాటకాన్ని "మిహిరాండభారతి" పేరుతో 1928లో అనువదించి ప్రకటించారు. ఇందులోను స్థల వ్యక్తి నామాలకు తెలుగురూపాలను కల్పించారు. ఈ నాటకంలో "మిరాండ" అనే స్త్రీ పాత్ర ప్రధానమైంది. ఆ పాత్రను "మిహిరాండభారతి" అని నామకరణ చేసి దేశీయత గుబాళింపచేయటం సోమయాజుల సృజనాత్మకప్రతిభకు నిదర్శనం. ఆంటానియో– అంధనరుడు, ప్రొస్పెరో– పరాత్పరుడు, పెర్దినాండ్ ప్రతినందుడు –ఇలా ఇంగ్లీషు పాత్రలు తెలుగుపాత్రలుగా మారిపోయాయి. దయ్యాలు, మంత్రాలు, ఆత్మలు, శృంగారం, హాస్యం అన్నీ కలబోసిన విశిష్ట నాటకం టెంపెస్ట్ (మిహిరాండభారతి).


మచ్చుకు టెంపెస్ట్ నాటక ప్రారంభం గమనిస్తే ఈ నాటకం పోకడ, మిగితా రెండు నాటకాల పోకడ ఎలా ఉంటుందో అర్థం అయిపోతుంది.

"మిహిరాండ భారతి : శ్రీ శివా! ఏమి యీ వింత కల్లోలము! శ్రీ సతికిం పుట్టిల్లై, సమస్త మహానదీమతల్లికలకుం బతియై, యఖిలరత్న ములకుం దగ్గని గనియై వెలయు నిమ్మహోదధి


Page no 119

University Of Madras
The Calender for 1903-1904
PASS LISTS.
BACHELOR OF ARTS.
1902.
ENGLISH LANGUAGE DIVISION.
Third Class


Venkataraman, P. M. .. Pres. Coll.
Venkataraman, R. (Ramalinga) .. St. Jos. Coll., Trichy.
Venkataraman, S. (Subrahmanya). Madras Chr. Coll.
Venkataramana, T. H. .. Do.
Venkataramanamurti, Mandivada. Do. [Bangalore & P. S.
Venkataramanan, K. Ananta .. S.P.G. Coll., Trichy. Cent. Coll.,
Venkatarama Rau, Subba .. Mah. Coll., Trivandrum.
Venkataramasomayajulu, R. .. Nizam Coll., Hyderabad, & P. S.


120

PART XVIII—EDUCATIONAL

| No. | Name of Officer | Designation | Native country or birth place | Date of birth | Date of entering service |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| (22) NIZAM COLLEGE—(concld.) | | | | | |
| 10 | Aga Md. Husain .. | Asst. Prof. of History | Masulipatam | 0-3-97 F. | 26-12-19 F. |
| 11 | J. C. Kameshwar Rao .. | Asst. Prof. of Physics | Vijayanagar | .. | 30-9-39 F. |
| 12 | R. Krishnamoorti .. | Asst. Prof. of Mathematics | Madras | 15-6-08 F. | 15-11-26 F. |
| 13 | Taher Ali Khan .. | Asst. Prof. of Persian | Hyd. | 7-7-13 F. | 8-9-41 F. |
| 14 | Vacant .. .. | Asst. Prof. of Economics | .. | .. | .. |
| 15 | Ahmed Abdullah Siddiqi .. | Asst. Prof. of Urdu | Hyd. | 31-5-1303F. | 1-5-31 F. |
| 16 | R. V. Somayajulu .. | Asst. Prof. of Telugu & Sanskrit | Guntur | 15-6-84 F. | 1-5-36 F. |
| 17 | S. K. Raghavan .. | Asst. Prof. of English | Hyd. | 21-7-07 F. | 1-1-36 F. |
| 18 | Allauddin Ahmed .. | Asst. Prof. of English & Logic | Hyd. | 16-11-08 F. | 26-5-32 F. |

The Classified List Of Officers Of
The Civil Departments Of H. E. H.
The Nizam S Government 1932



121

DEPARTMENT.

| Date of present appointment | Salary | Allowance | Station | Date of taking charge at the station | Examinations passed | Remarks |
|---|---|---|---|---|---|---|
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 1-6-35 F. | 600 | .. | Hyd. | 19-9-25 F. | M.A. | Grade 450 to 600 |
| 30-9-39 F. | 550 | .. | do | 30-9-39 F. | D.SC. | do |
| 6-9-39 F. | 450 | .. | do | 6-9-39 F. | M.A. | do |
| 8-9-41 F. | 350 | .. | do | 8-9-41 F. | .. | do |
| .. | .. | .. | .. | .. | .. | do |
| 18-10-35 F. | 340 | .. | Hyd. | 18-10-35 F. | B.A. | do |
| 1-5-36 F. | 340 | .. | do | 1-5-36 F. | .. | do |
| 1-1-38 F. | 325 | B.Al. 75 | do | 1-1-38 F. | .. | Grade 250 to 400 |
| 6-9-39 F. | 280 | .. | do | 6-9-39 F. | M.A., B.T. | do |

The Classified List Of Officers Of
The Civil Departments Of H. E. H.
The Nizam S Government 1932


University of MADRAS THE CALENDAR
FOR 1929-30 VOL II


IN THE DEGREE COURSES. 145

11. *Members of the Staff*—

| | | |
|---|---|---|
| Assistant Professor of Mathematics | „ | R. Krishnamurti, M.A., L.T. |
| Professor of Persian ... | „ | Aga Syed Mohamed Ali. (on leave.) |
| „ „ ... | „ | Aga Mohamed Kirmani, (B.A., Acting). |
| Professor of Arabic ... | Dr. | Zahid Ali, B.A., D.Phil (Oxon). |
| Professor of Urdu ... | Mr. | A. A. Siddiqui, B. A., Moulvi Alim. |
| Professor of Sanskrit ... | „ | A. Sitaram Rao, M.A. |
| Professor of Telugu and Sanskrit. | „ | R. Venkatarama Somayajulu. |
| Part time Lecturer in Logic ... | „ | G. S. Prakash Rao, M.A., L.T. |
| Lecturer in Marathi ... | „ | R. A. Kashirsagar, B.A. |
| Lecturer in Kanarese ... | „ | H. V. Krishnaswami, B.A. |
| Lecturer in Urdu ... | „ | Aga Hyder Hassain. |
| Lecturer in Persian and Urdu ... | „ | Gulam Nabi. |
| Lecturer in Telugu and Sanskrit ... | „ | S. V. Sastri, M.A., Vidvan. |

Z—19


Page no 11
University Of Madras
The Calender for 1903-1904
PASS LISTS.
BACHELOR OF ARTS.
1902.
ENGLISH LANGUAGE DIVISION.
Third Class
Venkataraman, P. M. .. Pres. Coll.
Venkataraman, R. (Ramalinga) .. St. Jos. Coll., Trichy.
Venkataraman, S. (Subrahmanya). Madras Chr. Coll.
Venkataramana, T. H. .. Do.
Venkataramanamurti, Mandivada. Do. [Bangalore & P. S.
Venkataramanan, K. Ananta .. S.P.G. Coll., Trichy. Cent. Coll.,
Venkatarama Rau, Subba .. Mah. Coll., Trivandrum.
Venkataramasomayajulu, R. .. Nizam Coll., Hyderabad, & P. S.

యాటోపము నిట్టి సమయములం జూచిన నెవ్వరాశ్చర్య భయ భ్రాంతులు కారు! రంగత్తరంగ కల్లోలితమగు నీటిపై గభీరములయ్యు, మీ మహానావలెట్లు తల్లడిల్లుచున్నయవి! అనుక్షణమును సమస్త యంత్ర సాధన సహితములయ్యు, నీ పాథోనిధిలోని నావ లట్లాహుతి కాబోవుచున్నట్లు కానంబడుచున్నయవి! కొన్ని నావలు మునిగి తిరిగి లేచుచున్నట్లు దూరదృష్టికిం దోచుచున్నవి. కొన్ని నిశ్చయముగా మునుగుచున్నవి: మరికొన్ని మునిగినవి కనుకనే ఈ సుడిగుండము లేర్పడినవి. అదిగో నాయనా! ఆ యోడస్తంభము మీదం జేరి కొందరీదుచున్నట్లున్నయదిబీ చూచితిరా ?

పరాత్పరుడు: ఔనే! భారతీ! ఆ యీదుచున్నవారు మన వంటి మర్త్యులే..

భారతి: నాన్నా! వారి దుర్గతి జూచుచున్నను, నీకు జాలి పుట్టకున్నదేల? అదిగో! చూచుచున్నారా! ఆ యోడ సహస్ర శకలము లు కాక తప్పదు. అందలి కర్ణధారాదులును, సముద్రయాయులును దప్పక యమ నిలయముం జేరగలరు. నాకే నీ మంత్ర శక్తి యున్న యెడ, నే నా యోడల. కీ పాట్లు రాకుండ గాచుచుంటిని".

ఈ రెండు నాటకాలు భారతీయ పద్ధతిలో నాంది, ఆ తరువాత సూత్రధారుడు, నటి కలిసి నాటకవైశిష్ట్యం, రచయిత పరిచయం చేస్తూ కథలోకి ప్రవేశిస్తారు. సుదీర్ఘగ్రాంథిక సంభాషణలు సమకాలీన రచనా ధోరణికి ప్రతిబింబాలు. మొత్తంమీద ప్రస్తుతకాలానికి ఈ రీతి అనువాదం కాలం చెల్లిందనే చెప్పాలి.

అధ్యాపక జీవనం నుండి విశ్రాంతి తీసుకుంటున్న కాలంలో 1936లో "మిడ్ సమ్మర్ నైట్ డ్రీమ్స్" అనువదించారు. తెలుగులో దీనిపేరు "స్వప్న శివపాలిత" అని పెట్టారు. లోపల ప్రవేశికలో "నట్టెండకాలపు రాత్రి స్వప్నము" నాటకాన్ని ప్రదర్శించబోతున్నట్లు చెప్తారు. నాయిక Hippolytaను శివపాలితగా, Hermiaను హ్రీమ యిగా, Theseusను దేవేశనుడుగా, Egeusను అజజుడుగా , తక్కిన పాత్రలను కూడా ఇలాగే అనువదించారు. (ఆంధ్రభారతి.కమ్ వ్యవస్థాపకులై సర్వ నిఘంటువులను గుప్పిట్లోకి తెచ్చిన సాంకేతిక నిపుణులు, పరమ సాధు హృదయులు, మిత్రులు వాడపల్లి శేషతల్పసాయిగారు తమ సాంకేతిక ప్రజ్ఞతో పుస్తకాలందించి నందుకు ధన్యవాదాలు)

కార్యలీనుడు నాటకాన్ని తెనుగు చేసినట్లు, అది ముద్రితమైనట్లు 1936లో ప్రకటించిన స్వప్నశివపాలిత నాటకం ముందుమాటలో చెప్పుకొన్నారు కానీ 1928లో వచ్చిన మిహిరాండభారతిలో అనువాదాల గురించి ప్రస్తావించలేదు. కనుక 1928 తర్వాత 1936 కు ముందు రాసివుంటాడు. నాకు చూసే అవకాశం కలగలేదు. ఈ మాత్రం చాలు.

**వ్యాసకర్తగా :** రాయప్రోలు వెంకట్రామ సోమయాజులు రాసిన రెండు వ్యాసాలు ప్రస్తుతానికి లభించాయి.

1. ఆంధ్రకర్ణాటకులం బునరైక్యము –ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక. 1910

2. అల్లసాని పెద్దన అల్లిక జిగిబిగి – శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయం రజతోత్సవ సంచిక 1927

ఆంధ్ర పత్రిక 1910 నుండి ఉగాది ప్రత్యేక సంచికలు పెద్ద ఎత్తున ప్రచురించడం మొదలుపెట్టింది. 1910 నాటి ప్రథమ సంవత్సరాది సంచికలో సోమయాజులు గారు "ఆంధ్ర కర్ణాటకుల పునరైక్యం" అనే వ్యాసం రాసి కన్నడ ఆంధ్ర లిపుల ఏకీకరణా వశ్యకతను నొక్కి చెప్పారు. నిజంగా ఆనాటి వారి కల నెరవేరి కన్నడ తెలుగులకు ఒకే లిపి ఏర్పడితే ఒక విశాల ప్రాంతానికి భాషాపరమైన పెద్ద అవరోధం తొలగిపోయేది. దీనికి వారు చారిత్రకంగా కర్ణాటకులు, తెలుగువారు ఒకటిగా ఉన్న సంగతిబీ భాషాపరంగా ద్రావిడ భాషా సోదరత్వాన్ని ప్రాతిపదికగా తీసుకున్నారు. ఆర్యుల ఆగమనం, మతసాంఘిక పరిణామాలు వివరించారు.

మన ఆంధ్ర కర్ణాటక లిపియే మహా ప్రాచీనమనియు, దీని నుంచే పురాతనమైన చీనా ఈజిప్టు దేశాల లిపులు తప్ప మిగిలిన లిపులు వ్యాపించాయని నేను నిరూపించగలనని వారు ఘంటా పథంగా చెప్పారు. సనాతనాచారాల మీద శ్రద్ధ క్షీణించిన ఈ కాలంలో దేవనాగరిలిపిలో సంస్కృతం ఇకముందు చదవబోరు. కూపస్థ మండూకాల వలె మాతృభాషలే చదువుతారు. ఇట్టి స్థితిలో ఆంధ్ర కర్ణాటక లిపిని సంస్కరించి ఏకీకృతం చేస్తే మూడు కోట్ల 20 లక్షల మందికి ఉపకారం అవుతుంది. (ఇది ఆనాటి జనాభ) ఇంగ్లీషులో క్యాపిటల్ లెటర్స్, స్మాల్ లెటర్స్ ఉన్నట్లే కన్నడలిపిని క్యాపిటల్ లెటర్స్ గా, తెలుగులిపిని స్మాల్ లెటర్స్గా వినియోగించుకోవచ్చు నన్న ఒక విచిత్రమైన సూచన చేశారు. దీని సాధ్యాసాధ్యాల సంగతి అటుంచి వారి ఆరాటంలోని సామంజస్యాన్ని గుర్తించాలి. ఆంధ్ర కర్ణాటక విశ్వవిద్యాలయం ఏర్పడాలని వాంఛించారు– అంటే నేటి ద్రావిడ విశ్వవిద్యాలయం లాంటి దాన్ని సోమయాజులు 1910 లోనే ఆశించారంటే ఎంత దూరదృష్టితో ఆనాటి వారు ఆలోచించారో విదితమవుతుంది.

1927లో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం తన రజతోత్సవ సంచికను వెలువరించింది. అందులో శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషా నిలయం చరిత్రను నాటి కార్యదర్శి బూర్గుల రామకృష్ణా రావు సుదీర్ఘంగా వివరిస్తూ గ్రంథాలయాభివృద్ధికి అకుంఠితదీక్షతో పాటుపడినవారిని స్మరిస్తూ వెంకటరామ సోమయాజులకు కూడా

కృతజ్ఞతలు చెప్పారు. కృష్ణదేవరాయల అస్థానంలోని అష్టదిగ్గజాల ప్రతిభను గురించిన వ్యాసపరంపర ఇందులో క్లుప్తంగా ఉంది. బహుశా ఆ సందర్భంలో ఇచ్చిన ఉపన్యాసాలకు సంక్షిప్తలేఖనాలు కావచ్చు. మాదయ గారి మల్లన్న గురించి ఖండవల్లి లక్ష్మీరంజనం, తెనాలి రామకృష్ణుని గురించి శేషాద్రి రమణ కవులు, మరికొందరు పద్యాలు రాశారు. ఆ వ్యాసాలతో పాటు అల్లసాని పెద్దన వ్యాసాన్ని "ప్రొఫెసర్ వెంకట రామ సోమయాజులు" రాశారు. దాన్ని ఈ వ్యాస పరంపరలో మొదట ప్రచురించారు. దాని సారాంశమిది.

చంపూ ప్రబంధ రచనావిర్భావం నన్నయాదులలోనే మొలకెత్తినా, అవన్నీ సనాతన పురాణేతిహాస నైతిక సౌందర్యాన్నే వెలార్చినవి. కానీ వాటిలో కథాంశ కల్పన మిక్కిలి తక్కువ అని నొక్కి చెప్పవచ్చు నన్నారు సోమయాజులు గారు. ఆంధ్ర కర్ణాట భాషా వాఙ్మయాల ఉచ్చ దశాకాలం శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలమే. ఉభయ భాషా శాఖలు ప్రౌఢ సౌందర్యాన్ని వహించిన కాలమిది. మంచికో, చెడ్డకో ముంచుకొచ్చిన మహమ్మదీయ ఐస్లమిక (వారు వాడిన పదం. ఐస్లమిక - ఇస్లాంకు తద్ధిత రూపం) నాగరికతా ప్రవాహానికి అడ్డుకట్ట వేసింది విజయనగర సామ్రాజ్యం అనేది సత్యం.

వాఙ్మయావిర్భావ భూమికలు జాతీయ ఆవిర్భావ భూమికలను ప్రతిఫలింప చేస్తాయి. ఆయా కాలాల్లో ఉద్భవించిన వ్యక్తులు ఆయా ఆవిర్భావ దశలను అనుసరించే ఉంటారు. కావున నూతన ప్రబంధ కల్పన కాలానుగుణం. పెద్దనార్యుడు నిమిత్తమాత్రుడు. రసాభివృద్ధికి అనుగుణంగా రచనా ధోరణిని కేవల సాంస్కృతిక సమాసాలతో కానీ, తేనెలొలుకు అచ్చతెనుగు పలుకులతో కానీ నింపివేయు సమర్థత పెద్దనకుంది. వేటను వర్ణించుటలో స్వభావ వర్ణనమున సూక్ష్మతమాంశములను కూడా తృణీకరింపడు. ఈ తరహా వర్ణనలోని కౌశల్యమును మించ నెంచి రామరాజభూషణుని తరువాత యత్నించిన కవులు చెడగొట్టారు-అని రాయప్రోలు సోమయాజులు గార భిప్రాయపడడం వారి సాహిత్యాభినివేశానికి, ఆలోచనారీతికి నిదర్శనం. ఆనాటి పత్రికల్లో మరెన్ని వ్యాసాలు దాగున్నాయో! పనిగట్టుకొని గాలిస్తే దొరుకగలవు.

ఇవేకాక మరికొన్ని కూడా వీరు రాసినట్లు తెలుస్తుంది. కాని ప్రస్తుతానికి అవి అలభ్యాలు.

1. కేకావళి - మోరోపంత్ (1729-940) మరాఠీ రచన. దాదాపు ఐదువేల ద్విపద పంక్తుల లాంటి భగవత్సంకీర్తనలు. ఇప్పటికీ మరాఠీ వారు పాడుకొంటారు. దీనిని 1933కు ముందే సంస్కృతాంధ్రాలలోకి సోమయాజులు అనువదించారు. దీనివల్ల వారికి సంస్కృతాంధ్రాంగ్లాలతో పాటు మరాఠీ కూడా వచ్చునని భావించ వచ్చు. బహుశ హైదరాబాదులో ఉండడం వల్ల మరాఠీ వచ్చి వుంటుంది.

2. భూగోళ శాస్త్రము - ఆంగ్లం నుంచి అనువదించిన పాఠ్య గ్రంథం కావచ్చు. చాదర్ ఘాట్ ఉన్నత పాఠశాల ఉద్యోగకాలంలో (1903-1907) రాసి ఉండవచ్చు.

3. రసాయనశాస్త్రము - ఆంగ్లం నుంచి అనువదించిన పాఠ్య గ్రంథం కావచ్చు. ఇది కూడా అప్పుడే ఉండవచ్చు. పైగా ఆయన స్కూల్లో సైన్స్ టీచర్ కూడ.

4. నీతిమీమాంస (1928కి ముందు. మిహిరాండభారతి లో పేర్కొనబడింది. "నీతిమీమాంసాది బహుగ్రంథకర్తలును" అని చెప్పు కోవడంవల్ల మరికొన్ని ఉన్నవని కూడా తెలుస్తుంది.)

5. మహామారికాస్తోత్రం (ఆంధ్రవాఙ్మయసూచిక. పుట149లో పేర్కొనబడింది.)

ఇతిహాసపు చీకటికోణంలో అట్టడుగున పడి కనిపించకుండా పోయిన రాయప్రోలు వెంకటరామ సోమయాజులు నిజాం రాజ్యంలో తొలి తెలుగు సంస్కృత ఆచార్యులు. వీరి రచనలమీద ఎవరైనా పీహెచ్.డీ చేయవచ్చుననీ సూచిస్తూ, వారికి నావ్యాసం ప్రేరణ కలుగాలని ఆకాంక్షిస్తున్నాను. వారి ఆంధ్ర మేఘసందేశాన్ని మూలంతో, ఇతర మేఘ సందేశానువాదాలతో సరిపోల్చి రాయవచ్చు. షేక్స్పియర్‌ను అనువదించడంలో ఎదుర్కొన్న సమస్యలను, అధిగమిం చిన తీరును వివరిస్తూ ప్రత్యేక వ్యాసాలను జిజ్ఞాసువులు రాసుకోవచ్చు.

**తాజాకలం :** రాయప్రోలు వెంకటరామ సోమయాజుల తరువాత నిజాం కళాశాలలో తెలుగు అధ్యాపకులైన సరిపెల్ల విశ్వనాథశాస్త్రి, కురుగంటి సీతారామయ్యగారలు సామాన్యులేమీ కాదు. పిహెచ్.డీలు చేయదగినంతవారే. వారిని గురించి సమగ్ర పరిచయాత్మక వ్యాసాలు రాయడానికి ఎవరైనా పూనుకొంటే బాగుంటుందని సూచిస్తున్నాను.

1. నిజాం కళాశాల శతాబ్ది సంచిక 1887-1997. పుట. 145.

2. ఆంధ్ర మేఘ సందేశం గద్య (ఇయ్యది రాయప్రోలు నామకాత్రి వంశోద్భవ కీర్తిశేష శ్రీ సూర్యనారాయణ సోమయాజిపుత్ర బుధవిధేయ వేంకట రామసోమయాజి నామధేయ విరచితాంధ్ర మేఘ సందేశోత్తర భాగము సమాప్తము.)

3. రాయప్రోలు వెంకట రామసోమయాజులు-కు.సీ. భారతి మాసపత్రిక మార్చి1933 పుట.491 & 492 (సోమయాజులు పిదప అధ్యాపకులుగా వచ్చి చేరినవారు కురుగంటి సీతారామయ్య గారు. కు. సీ. అన్న సంక్షిప్త నామంతో రాసిన వ్యాసం. దీనిలో సోమయాజులు గురించిన ఎన్నో వివరాలున్నాయి. అయితే వారి నవ్యాంధ్రసాహిత్యవీధుల్లో సోమయాజుల పేరు కనిపించక పోవడం విశేషం).

4. Madras University calendar 1903 p.41

5. University of Madras . The calendar for 1931-32 volume no.1, Part. II. Page no70 &147.

6. osmania university calendar1926-27 page 36; 1927-30 page 49; 1930-34 page 60


7. Glimpses of Nizam College- A Flashback prof. N. G. Rajurkar% (నిజాం కళాశాల శతాబ్ది సంచిక 1887-1997. పుట. 44.

8. University of Madras .The calendar for 1925-26. Page. 145.

9. University of Madras . The calendar for 1930-31 volume no.2 page no148 &31-32 vol.2 page no154

10. As I look back yadavalli sivaramasastry 2002 pages 15&16

University of Madras .The calendar for 1903-04. Vol.III



మరణధ్రువీకరణపత్రం.
31-10-1964న మరణం.

దీనిలో అలవాటులో పొరపాటుగా యాంత్రికంగా అందరికీ asst.prof గానే వేయడం గమనార్హం. జననతేది, ఆచార్యుడైన తేది, జీత భత్యాల వివరాలున్నాయి. మిగిలిన సంవత్సరాల సంపుటాల్లో వీరి పేరు కానరాలేదు. కానీ మద్రాసు విశ్వవిద్యాలయ గ్రంథాల్లో తమ అనుబంధకళాశాల యైన నిజాంకళాశాలలో పని చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొనబడింది. దీనిలో ప్రొఫెసర్ గా చెప్పారు. డిగ్రీలను వదిలేశారు.

❖ ❖ ❖ ❖ ❖

# పూజలందుకో విఘ్నరాజ!

**కటకం వెంకటరామ శర్మ**
ఫోన్ : 9440 472 321



శ్రీగణ నాథునిన్గొలువ చిత్తము శంభుని చింత జేయు వే
దాగమ శాస్త్ర సంహిత విహారుని తత్త్వము బోధ సేయు తా
పోగొని మూర్ఖ శీర్షమును పొందె దయాళువు చేత నూత్నమౌ
నాగ ముఖమ్ము సంభరిత జ్ఞాన కళానిధి దివ్యరూపమై

తల్లి తనొక్క బాలునకు ధైర్యము రూపము కూర్చి దైవమున్
బల్లిదమున్ కనున్గొనగ ద్వారము కడ్డుగ నిలిప దార్ఢ్యమే
చెల్లదు బుద్ధి కావలెను సిద్ధిల బ్రహ్మమనంచయు నేర్పెగా
నల్లదె విఘ్న నాయకుని యద్భుత రూపము గాంచె లోకముల్

గిరగిర చుట్టివచ్చు తన కేకి రథమ్మున జోదు తమ్ముతో
పరువుల వెట్టకుండ ప్రతిభా ప్రతిపత్తుల తల్లిదండ్రులన్
సరగున జేరి మ్రొక్కులిడి సర్వము వారలె వారి సేవలే
పురణములందు స్నానముల పుణ్యములబ్బునటంచు దెల్పెనే
కరిముఖుడమ్మ నాన్న లనకు గాదిలి మ్రొక్కె ప్రదక్షిణమ్ముగా

చేటంత చెవులుండి చెప్పిన వినవేమి?
చేటు దెచ్చితివిట నీట మునగ
గ్రామ గ్రామమ్మున కరవున్నదని వేడ
బురద నీరందించి మురిసినావు
చవితి కుడుములును చవులూర తిందువ
ఇడుముల బడద్రోసి సుడుల ద్రిప్పి
పార్వతీపుత్ర! మన్నింపు బాధలందు
నిన్ను కాక దేరెవరిని నింద సేతు?
జగము నడిపించు ఘనుడవు ఛత్రధారి
వేగ మా పూజలందుకో విఘ్నరాజ!

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11 (23) హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

# జాషువా 'నాగార్జునసాగర్' ఒక పరిశీలన

**డా. జి. వెంకటలక్ష్మి,** సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్ 9949059179





**"కులమతాలు గీచుకున్న గీతలను జొచ్చి**
**పంజరాన కట్టు వడను నేను**
**నఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు**
**తిరుగు లేదు విశ్వనరుడను నేను"** అని తన హృదయ వైశాల్యాన్ని నవయుగ కవి చక్రవర్తి, కవి దిగ్గజ, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్, కవితా విశారద గుర్రం జాషువా ప్రకటించుకున్నాడు . భావ కవిత్వఛాయలో అడుగిడక, సర్వ మానవ శ్రేయస్సుకై కైతలల్లిన వాగ్దేవి ముద్దుబిడ్డ. సామాజిక ప్రయోజనం కోసం వ్యక్తిగా కాక ఒక శక్తిగా తన రచనలనే ఆయుధంగా మలచుకొన్న ధీశాలి. ప్రస్తుత పల్నాడు సీమలోని చాట్రగడ్డపాడు, వినుకొండ మండల ప్రాంతంలో 1895 సెప్టెంబర్ 28న జన్మించిన ఈ కవి ధీరుడు **"వడగాల్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం"** అంటూ ప్రకటించుకున్నాడు. ఆ వెన్నెల కవిత్వంలోని ఒక సోన నాగార్జునసాగర్. దీనిలో కవి నాగార్జునసాగర్ కృష్ణమ్మ సోయగాలను హృదయంగమంగా, అద్భుతంగా చిత్రీకరించాడు .

నందికొండ లోయల్లోని శ్రీ పర్వతగిరులు అహింస నాదాన్ని నినదించాయి. "మణిభూషల్ 'మణిసౌధంబుల్ విడిచి, సామ్రాజ్యంబు బోనాడిదారుణ సన్యాసము స్వీకరించిన......" బుద్ధుడు "అది చల్లారని జ్యోతి, ప్రోజ్వలిత మాయా మానినీ గర్భసంపద..." " నవ యుగంబు ధన్యమున్ జేయుచున్" మహావతారం ఎత్తాడు. నడయాడే అహింసామూర్తి సిద్ధార్థుని ఆలోచనలను ఆచరణలో పెట్టి, రెండవ బుద్ధునిగా పేర్గాంచిన ఆచార్య నాగార్జునుడు శ్రీగిరి పర్వతకీర్తిని దేశ విదేశాలకు వ్యాపింప చేశాడు. ఆచార్య నాగార్జునుడు రసవాది, తత్వవేత్త, అన్నింటికీ మించి గొప్ప బౌద్ధ మత సన్యాసి, గురువు. ఇతడు మొదట తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల్లో అనేకమంది శిష్యులకు విద్య గరపిన గురువు. ఈయన చేత ప్రభావితుడైన శాతవాహన రాజు యజ్ఞశ్రీ శాతకర్ణి శ్రీపర్వతంపై బౌద్ధ విద్యాలయాన్ని, విహారాలు, చైత్యాలు, స్థూపాలు కట్టించి ఆచార్య నాగార్జునుడిని సాదరంగా తెలుగుదేశంలోకి ఆహ్వానించి, ఇక్కడి శిష్యులకు అధ్యాపకునిగా నియమించాడు. ఈయన తన ప్రతిభతో భారతదేశ యశస్సును ఖండాతరాలకు సైతం వ్యాప్తి చేశాడు. ఎందరో ఆయుర్వేదాన్ని ఇక్కడ నేర్చుకొని గొప్ప వైద్యులుగా పేరు గడిచారు. నిరంతరం బౌద్ధ శిష్యుల సంచారంతో ఆ నేల పవిత్రమైంది. అందుకే కవి ఆ కొండ ఔన్నత్యాన్ని చెప్తూ **"పులులు ప్రదక్షించినవి, ముద్దిడుకున్నవి నందికొండలోయలు చరణాంక ముద్రికలు స్వాగత గీతము లాలపించి పక్షులు తమిమీర రెక్క గొడుగుల్ ఘటియించిన విందు..."** అంటూ దాని గొప్పతనానికి కవి జాషువా పొంగిపోయాడు. శ్రీ పర్వతాన్నే నాగార్జునకొండగా మార్చిన మహా ధన్యజీవి, శాశ్వత కీర్తి సముపార్జితుడు ఆచార్య నాగార్జునుడిని కవి తలచుకున్నాడు.

బుద్ధుడు ప్రవచించిన అహింసా మార్గాన్ని అనుసరించే భారత దేశం స్వేచ్ఛా, వాయువులను పీల్చి, సుఖాన్ని అనుభవిస్తున్నట్లుగా కవి చెప్పాడు. **"జాతి ప్రభుందైన జవ్హారు మంత్రీషుడు..."** పంచవర్ష ప్రణాళికలకు పునాది వేయడంవల్ల రసవాణి కృష్ణవేణి బంగారు పంటలు పండించడానికి ప్రాజెక్టు రూపంలో దేశం సుభిక్షంగా ప్రకాశించేట్లు ఏతెంచినట్లు చెప్తూ, ఇదంతా పవిత్రులైన బుద్ధుని శిష్యావళి నడయాడిన పాదపద్మాల పుణ్యం తప్పితే ఇంకేం లేదు అంటూ కవి పొంగిపోయాడు.

**"ఉరవళ్ళున్, ఒరవళ్ళు ద్రొక్కుచు ప్రగాఢోర్మిచ్ఛటాలాస్యా సుందరియై, చక్కటి పిల్లకాల్వలు మహేంద్రక్షోణికిన్ కోటి వత్సర ముల్ శ్యామ సస్యభూషణముల్ సంధింప .."** కృష్ణావాహిని, మోహినీ పూజలు అందు కుంటూ సాగిపోవాలని కవి కోరుకున్నాడు.




Gurram Jashuva

కేవలం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ మాత్రమే కాక, పంచవర్ష ప్రణాళికల వల్ల పరిశ్రమలు ఎన్నో అభివృద్ధి చెంది, ప్రజలకు జీవనాధారాన్ని కలిగించాయి. దీనివల్ల జాతి జనుల జీవనం గాడిన పడిందనీ, హఠాత్తుగా ఏవైనా యుద్ధాలు సంభవించినా ఎదుర్కోవ దానికి జవాన్ శిక్షలకు విద్యాశాలలు, పొదుపు చేసుకోవడానికి బ్యాంకులు, విద్య నేర్పే పాఠశాలలు, వయోజన పాఠశాలలు ఎన్నో ఏర్పడ్డాయని పండిట్ నెహ్రూ ప్రణాళిక కృషిని, భవిష్యత్తు దృష్టిని అభివర్ణించాడు కవి.

ఒక్కసారిగా కవి గతంలోకి తొంగి చూస్తూ, కాలగతిలో భారతదేశ ఖ్యాతిని విదేశాలకు విస్తరింపచేసిన బౌద్ధ విద్యాలయం వన్నెమోసిన గాథను తలుచుకుంటూ, తథాగతు పుణ్య కథానకంబులన్ జాలిగా బాడుచున్నవి దిశల్ పులకింప విపంచి మీటుచున్ అంటూ కాలగర్భంలో కలిసిపోయిన సువర్ణాధ్యాయాన్ని జాలిగా కవి వినిపించాడు. కానీ తరచి చూస్తే హృదయంతో ఆలకిస్తే బౌద్ధ భిక్షుకుల యొక్క దివ్య శంఖారావాలు సంసార దావాగ్ని తప్తులకు శాంతిని ఉపదేశిస్తూ, నాటికి నేటికీ, వారు నిద్రించకుండా ఉన్నారని మహాత్ములు నడయాడిన ప్రదేశాన్ని సందర్శించే సౌభాగ్యం కలగడమే అదృష్టంగా కవి భావించాడు.

తెలుగుప్రాంతపు వైభవాన్ని ప్రస్తుతిస్తూ ఆచార్య నాగార్జునుడి నయనద్వయం నుండి సౌభాగ్యసాగరం జన్మించిందని, బ్రహ్మానాయని హృత్కమలం నుండి హరిజనాభ్యుదయ సంధ్య వికసించిందని, పంచవర్షప్రణాళికల నుండి నగరం సంక్షేమదిశగా అడుగులు వేస్తుందని, సస్యశ్యామలం చేయడానికి కృష్ణవేణి నదీమతల్లి ప్రవహిస్తుందని, తెలుగుఖ్యాతిని ఇనుమడింప చేయడానికి కవులు కోయిలల్లాగా మధుర ధ్వనులు చేస్తున్నారని చెప్తూ తెలుగు గడ్డ ప్రజల కోరికలను తీరుస్తూ పదికాలాలు చల్లగా ఉండాలని కవి ఆశీర్వదించాడు.

స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పొందిన భారతావని పౌరులు పరదేశాల సహాయం పొందక కష్టతరమైన యంత్రాలను తయారుచేసుకొని ఎందరికో జీవనాన్ని చూపే ఈ అధ్యాయం బంగారు అక్షరాలతో లిఖించదగినదని సగర్వంగా కవి చెప్పుకున్నాడు. **"ఘన శైలంబును వ్రక్కలించిరి సొరంగం బొందు నిర్మించి, రుద్ధన శైలంబున ....."** కృష్ణానదికి ఆనకట్టను కట్టిన మానవ విజ్ఞానాన్ని కవి కీర్తించాడు. ఇంజనీర్ల ప్రతిభవల్ల నవ్యసుందర భవంతుల రీతిలో జలవిద్యుత్తు ప్రాజెక్టులు కట్టబడ్డాయి. వీటివల్ల పులులు, పందులు, విషపూరిత సర్పాలు తిరుగాడే భూములు కన్నుల పండుగగా విద్యుల్లతా నిలయ శ్రేణులతో తెలుగు తల్లి తలపై ధరించే ఉజ్వలమైన రత్నాభరణంగా, స్వేచ్ఛాచిహ్నంగా భాసిస్తున్నాయని కవి తెల్పాడు.

మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ దగ్గర పుట్టి భీమా, మూసీ, ఘటప్రభ వంటి ఉపనదులు సఖులుగా చేయూతనీయగా, తన దారిలో ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రజలందరికి కరువుకాటకాలను దరి చేరనీయకుండా, ప్రతీ పన్నెండేళ్లకు పుష్కర పూజలందుకుంటూ యవ్వనాన్ని సంతరించుకుంటూ సముద్రదిశగా సాగే కృష్ణమ్మతల్లికి కవి వినతులు సమర్పించుకుంటున్నాడు. **"అన్నమో రామచంద్రా అంటూ బ్రతుకుతెరువు కోసం వలస వెళ్ళేవాళ్ళు, ఎకరాకు ఒక్కగింజ కూడ రాక హరిహరీ అని అంగలార్చేవారు, శిస్తు కట్టలేక ఇళ్ళు వాకిళ్లు అమ్మి కట్టుబట్టలతో మసలేవాళ్ళు, వానల్లేక సుంకు వట్టిన కంకులు ఎండిపోతుంటే చూచి ఏడ్చేవాళ్ళు అంతా నీ దాపునే ఉన్నారని, నిశ్చయంగా వాళ్ళందరూ నీ రాకను చూసి సంతోషించి నీవు మెచ్చునట్లు నీకు పూజలు చేస్తారని, వారిని దయతో చూడమని"** కవి వేడుకున్నాడు .

పల్నాటి సీమ పరిస్థితిని కవి చెప్తూ – వ్యవసాయదారులు పొలాలను తమ చెమటను ధారపోసి సేద్యం చేస్తున్నా కనీసం ప్రభుత్వ శిస్తు కట్టలేని స్థితిలో ఉన్నారు. తలలు తాకట్టు పెట్టి పన్నులు కట్టాల్సివస్తుంది. పశుగణం కడుపారా తిండి లేక శుష్కించి పోతుంది. బుంగెడు నీళ్ల కోసం పాతాళ కూపాలను తవ్వాల్సివస్తుంది. ఇలాంటి పల్నాటి ప్రాంతంలో కష్టాలు తొలగించి, సిరులు పండించడానికే గొప్ప మనసున్న కృష్ణమ్మ వచ్చిందని కృష్ణవేణీ రాకను హర్షపులకింత హృదిలో చాటాడు.

నదీమతల్లి స్వాగతంతో ఇరవై లక్షలకు మించి సాగుభూమి తయారై ఆకలితో అలమటించే పేదవారి కష్టాలు తొలగిపోతాయి. దీనుల యొక్క చింతలు సమసి పోతాయి. కరువు పులి పండ్లు రాలిపోతాయి. ఎన్నో తరాలనుండి ఎదురు చూసిన శుభఘడియ రావడంవల్ల మా కష్టాలు తొలగి, దిగులు మాని సంతోషంగా ఉన్నామని, గంగమాతకు సమానమైన నీవు చేసే సేవవల్ల లక్ష భూములే కాదు, లక్ష జిహ్వాలు కూడ సుఖపడతాయని, **"నీ మధుర నీరము గ్రోలు ప్రజాళి కెల్ల"** ఈ తరమే కాదు వచ్చే తరాలకు కూడ మృష్టాన్నములు పెట్టి రాష్ట్ర ప్రజ మొత్తం సుఖంగా ఉండేటట్లు చూడమని వేడుకుంటూ, నీది ఘనమైన దేశసేవ అంటూ కవి కృష్ణమ్మకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు సమర్పించుకున్నాడు.

నైషధ ప్రముఖ నానా కావ్య నిర్మాతృ చంద్రమ శ్రీనాథ మహాకవి పల్నాటిసీమ గూర్చి **"అంగడి యూరలేదు, వారి అన్నము లేదు, శుచిత్వమేమిలే దంగనలింపులేర"**ని వక్కాణించాడు. దీన్ని కవి ప్రస్తానిస్తూ – నవ్విన నాపచేనే పండినట్లు అప్పటి పరిస్థితికి భిన్నంగా నందికొండ శిఖరాగ్రం నుండి పరవళ్లు త్రొక్కే కృష్ణమ్మ తన జలాలతో తెలుగు భూములను పాడి, పంటలతో పల్లె ప్రజ ఐశ్వర్యంతో తుల తూగేటట్లు చేసిందని చెప్తూ, కవిసార్వభౌమ శ్రీనాథ మహాకవిని ఉద్దేశించి **"అంగన లందరిందు దమయంతులు, దొరకవన్నా నీకు జొన్నన్నముల్, వరియన్న మంతయున్ బంగారు బువ్వగా బలికి వ్రాయవే నైషధ కావ్యముల్ కవీ!"** అంటూ పల్నాటి సీమ పచ్చదనాన్ని కవి భళి, భళీ! అంటూ మెచ్చుకున్నాడు.

మహాకవి జాషువా జాతిని ఉద్దేశించి ఒక మంచిపని చేసేటప్పుడు విమర్శించేవాళ్ళు చాలామంది ఉంటారు. **"లోపములెత్తి చూపు పెను లోభుల మాటలకేమి"** ఎవరేమి అనుకున్నా దేశోపకృతుల్ సహస్రము సముద్భవించినవని, తెలుగు సోదరుల కోరికలన్నీ తీరుతాయని ఘంటాపథంగా చెప్పాడు.

అభివృద్ధి ఒక్కసారిగా చేతికి అందింది కాదని, ఎంతోమంది మహాత్ములు కన్న కలలు సాకారమై భవిష్యత్ తరాలకు బంగారు బాటగా నిర్దేశకత్వం అవుతుందని చెప్తూ కవి మొదటగా ఆచార్య నాగార్జునుడిని సంస్మరించాడు. **"ఓ నాగార్జున సన్ముని ప్రవర! నీ ఉ ర్వీస్థలిన్ బాసి, ఎన్నో నూర్లబ్దము లంతరించినవి ..."** ఐనప్పటికీ ఆయన ఆశించిన సర్వతోముఖాభివృద్ధి తెలుగు ప్రజలు నేటికి సాధించారని, ఆనాటి దీక్షావనుల్ నేటికి సాధించామని, ఆయన కన్నకలలు, కృషి వృథాగా పోకుండా తెలుగుప్రాంతం అందమైన ఉద్యానవనంగా నేడు విలసిల్లుతుందని కవి నాగార్జునుడికి తన సందేశం వినిపించాడు.

భారతక్షితి అభ్యుదయం ఏనాడూ కాంక్షించని బ్రిటిష్‌వారి పాలనాచెర నుండి తప్పించడానికి, జాతిలో పౌరుషాన్ని రగుల్కొల్పి దుర్దశల పాలైన వారిలో చలనం నింపిన శాంతిదూత గాంధీజీని తలచుకుంటూ కవి **"నీ జలములు గ్రోలి దీవెనలు సల్పగ లేఁడు గదమ్మ సాగరా"** అంటూ కృష్ణానదికి విన్నవిస్తూ వాపోయాడు.

ముందు, ముందు దేశమంతా సురక్షితంగా, సుభిక్షంగా ఉండా లనేదే కవి ఆకాంక్ష. దీన్నే ఆకాంక్షిస్తూ **"జవహరువోయె, శాస్త్రి దివిషత్సభ కేగె, మహాత్ముడెప్పుడో యవని త్యజించె..."** అంటూ జాతిని పాలించిన వారిని తలుస్తూ **"మార్దవమతి, కోమలంబగు హృదయము"** గల ఇందిరమ్మ చేతిలో ధరణి శుభోన్నతి కలగడానికి సోదరులంతా చేయూత నీయాలని కవి కోరుకున్నాడు.


ఇలా కవి నాగార్జునసాగరం ఖండకావ్యంలో ఆచార్య నాగార్జునుడి ఘనత, శ్రీనాథ ప్రస్తావన, దేశ సోదరులంతా కలిసికట్టుగా మహాత్ముని అడుగుజాడలలో సాధించుకున్న స్వాతంత్ర్యం, శాంతి–అహింసల ప్రాధాన్యం, శాస్త్రి –నెహ్రూల ప్రభుత్వ హయాంలో




వెలువడిన పంచవర్ష ప్రణాళికల ద్వారా జరిగిన అభివృద్ధి, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ వల్ల తెలుగు సోదరులకు కలిగే లాభం, పల్నాటి సీమ అభివృద్ధి కాంక్ష వంటి అంశాలను క్షుణ్ణంగా వివరించాడు. కవి కోకిల జాషువానే చెప్పినట్లు –

**"రాజు మరణించే నొక తార రాలిపోయే**
**కవియు మరణించే నొక తార గగన మెక్కె**
**రాజు జీవించే రాతి విగ్రహములందు**
**సుకవి జీవించే ప్రజల నాలుకలయందు"**

అన్న పలుకులు అక్షర సత్యాలు. పై పద్య మణిదీపిక జాషువాకే కాదు నత్కృతులందించిన కవులందరికి సంబంధించింది. జాతిని మార్చే మాయాదండాన్ని ధరించినవాడు కవి. జాతి మేలుకు దిక్సూచి కవి. ఇలా యావత్ భారత ప్రజానీక శ్రేయస్సును ఆకాంక్షించే కవి దిగ్గజమైన జాషువా కీర్తి అజరామరం. సాహితీభారతి వెలుగొందు తున్నంత కాలం చిరస్మరణీయుడు ఈ మధురకవి జాషువా.



ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

# శ్రీకృష్ణ జన్మాష్టమి

**పసుపులేటి నరసింహారావు**, ఫోన్ : 98408 56206



బాలుడవతరించె బహుళాష్ట తిథిరోజు,
శ్రవణ మాసమందు చరణు మోపె,
అష్టమావతార హరి ఆత్మ అతడండి,
దుష్ట శిక్ష చేయ, దునిమి వార్ని.

అష్టమి తిథినాడు, అష్టమ గర్భాన,
అవతరించె నాడు ఆది విష్ణు,
అర్ధరాత్రి వేళ, అంత నిదుర పోవ,
అడుగు మోపి నాడు అవని పైన.

నదిని దాటి పోయి, నంద యశోదల
బిడ్డ తోడ మార్చె పిల్లవాని,
అచట పెరగ దొడిగె అవతార పురుషుండు,
చిలిపి చేష్ట లెన్నొ చేసుకొనుచు.



కొంటె కృష్ణ జేయు కోణంగి చేష్టలు,
చెప్ప నెవరి తరము గొప్ప గాధ,
భాగవతము నందు బమ్మెర పోతన,
వాని చేష్టలన్ని బాగ వ్రాసె.

చోర విద్య అబ్బె చెరసాల పుట్టంగ,
పిల్లలంత కలసి పెరుగు, పాలు ,
జున్ను, వెన్నలంత తన్నుకొనుచుపోవ
గొల్లభామలంత గోల పెట్టె.



చట్టెనందు పెట్టి, ఉట్టెపై దాయంగ,
దొడ్డిదారి వచ్చి దొంగలాగ,
తస్కరించి వెన్న, తనివితీర తినుచు,
తోటి వార్కి పంచు కొంటి కృష్ణ.

తానమాడ నదిన, తరుణుల వీక్షించి,
వలువ లన్ని దాచె వారు ఏడ్వ,
దిక్కు తోచకుండె దిసమొల భామల్కి
వారు మిగుల వేడ, మరల ఇచ్చె.

చల్లనమ్మబోవు గొల్లభామల నడ్డి,
దారి వదల కుండ వారినాపి,
ఆట, పాట తోడ ఆనందపడుచుండు,
మగువలంత వాని మాయ పడగ.

వేణుగాణ ధ్వనులు వీనుల తాకించి,
గొల్లభామ ఎదల కొల్లగొట్టి,
బృంద వనము నందు బృందనాట్యము జేసి,
ఏడిపించ వార్ని ఆడి పాడి.

మన్ను తినెను యనుచు, అన్న చెప్పిన యంత,
నోరు తెరవ మనుచు కోర తల్లి,
అందు జూపినాడు పదునారు భువనాలు,
దిమ్మ తిరిగెనంట అమ్మ కపుడు.

కాలసర్ప మొకటి కాళింది నదిజేరి,
విషము జిమ్మ, జల కలుషితమవ్వ,
వాని పడగనెక్కి పాదాల తొక్కంగ ,
శరణుజొచ్చె నంత, వరము నొసగె.

చెప్ప తరమె వాని చిలిపి చేష్టలగూర్చి,
ఎంత వ్రాసినాను కొంత మిగులు,
అట్టి గాధలన్ని అందించ గ్రంధాన,
కృష్ణ లీల లనుచు కీర్తిగాంచె.

కోప మెరుగ డంట, కొండంత కృపయంట,
నమ్మినట్టి వారి, కొమ్ముకాయు,
దుష్ట శిక్ష చేసి, శిష్ట రక్షణ చేసె,
అయిన వార్కి పెద్ద అండ యంట.

వాడ వాడ లందు పందిళ్ళు వేసేరు
భక్తులంత కూడి భజన చేయ,
కుర్రకారు లంత కోలాట మేయంగ,
అన్నదాన మొసగ అన్ని చోట్ల.

ఉట్టిగొట్టబోవ ఉత్సాహవంతులు,
గొల్లభామ లాగ కుండనెత్తి,
ఆట, పాట , నృత్య, అలరార మహిళలు
చిన్నపిల్లలంత చిందులేయ.

వాకిటందు వేసి పాదాల ముగ్గును,
స్వాగతింతు రండి వాని రాక,
అటుకు, వెన్న, జున్ను, ఆరగింపగ పెట్టి
పూజ జేతురండి పూలతోడ

# కుందుర్తి వచన కవితా నాటకాలు – విశిష్టత

**డా. జి. మహేందర్,** సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ములుగు. ఫోన్ : 990 816 1151

**'పాతకాలం పద్యమైతే వర్తమానం వచన గేయం'** అంటూ ప్రజా కవిత్వానికి, ఆధునిక ప్రజాస్వామ్య యుగానికి తగిన రూపం వచన కవిత మాత్రమే అని నమ్మి, వచన కవిత్వాన్ని ఒక ఉద్యమంగా భావించి తన జీవిత కాలమంతా వచన కవితా వికాసానికి కృషి చేసిన కవి కుందుర్తి ఆంజనేయులు. 1967లో ఫ్రీవర్స్ ఫ్రంట్ సంస్థను స్థాపించి ప్రతీ సంవత్సరం ఒక ఉత్తమ వచన కవితా సంపుటికి బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు. వచన కవిత్వాన్ని కుందుర్తి ఆరంభించక పోయినా వచన కవిత్వాన్ని ప్రచారం చేయటం వల్ల **'వచన కవిత్వ పితామహుడు'** అయ్యారు.

**"ఇది నా కవిత్వం గీతం**
**వినేవాడు నరుడు**
**చదువూ సంధ్యలూ రాని రోడ్డుమీద పామరుడు**
**లేమి తల్లి ఒడిలో నిరంతర గాఢనిద్రాపరుడు"** అంటూ కవిత్వ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని సామాన్యుని కోసం కవిత్వ రచన చేసిన కవి కుందుర్తి.

కుందుర్తి ప్రధానంగా వచన గేయాలు, వచన కవితలో కథా కావ్యాలు, వచన కవితా నాటకాలు, వచన కవితా లేఖలు, వచన కవితా అనువాదాలు, వచన కవులను ప్రోత్సహిస్తూ వివిధ కావ్యాలకు పీఠికలు, వచన కవితా తత్త్వాన్ని, ప్రాశస్త్యాన్ని వివరిస్తూ విమర్శ వ్యాసాలు, వచన కవితా సంపుటాలకు సమీక్షలు రచించారు. కుందుర్తి ఏ రచనలు చేసినా అన్నీ వచన కవితా ప్రక్రియకు సంబంధించినవే అయి ఉన్నాయి.

వచన కవితలో ఆత్మాశ్రయ లక్షణానికి బదులుగా వస్త్వాశ్రయ లక్షణాన్ని పెంపొందించాలని కుందుర్తి భావించారు. పాఠకులకు సందేశాన్ని అందించటానికి వచన కవితలో కథా కావ్యాలు రావాలని ఆశించిన వారిలో కూడా కుందుర్తి ప్రథముడు. వస్త్వాశ్రయ పద్ధతిని అనుసరించటంవల్ల ప్రాచీన కావ్యాలు జీవితంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించగలిగాయని, ఆ మార్గంలోనే ఉత్తమకావ్యం వెలువడటానికి అవకాశం వుందని ఆయన విశ్వాసం. ఏ మాత్రం కథాంశం లేని కవితలు కేవలం ప్రబోధగేయాలు, వర్ణనాత్మక రచనలు కావచ్చు కాని రసపోషణ మొదలయిన లక్షణాలకు అవి సరిపోవని ఆయన అభిప్రాయపడ్డారు. జీవితంలో సమస్త విషయాలను తనలో ఇముడ్చుకో గలిగి, వాటిని సమర్థవంతంగా ప్రకటించగలిగిన కవితా ప్రక్రియ వచన కవిత్వం అని అభిప్రాయపడిన కుందుర్తి వచన కవితలో రసపోషణకు ఆస్కారమున్న నాటకాలు కూడా రచించారు.

## వచన కవితా నాటకాలు

నాటకం వచన సాహిత్య ప్రక్రియ. గద్యాత్మకమైన నాటక ప్రక్రియ తెలుగు సాహిత్యంలో పద్య సంప్రదాయాన్ని కూడా తనలో ఇముడ్చుకుంది. అందుకే తెలుగు సాహిత్యంలో పాండవోద్యోగం లాంటి పద్యనాటకాలు ప్రసిద్ధిపొందాయి. సంప్రదాయబద్ధమైన రచనల్ని అన్నింటినీ బాగా అధ్యయనం చేసిన కుందుర్తి గద్య పద్యాత్మకాలైన నాటకాల్ని చదివి, చూసి ప్రేరణ పొంది వుంటారు. అందువల్లే ఆయనకు వచన కవిత్వంలో నాటకాల్ని రాయాలనే ఉద్దేశం ఏర్పడి వుంటుంది. వచన కవిత్వంలో నాటకాలు రాయడానికి గల నేపథ్యాన్ని 'ఆశ' నాటకానికి రాసిన పీఠికలో వివరిస్తూ కుందుర్తి **"సమకాలీన జీవితాన్ని ఆవరించుకున్న వివిధ భావనా రీతులను మేళవించుకుని, తన తోటి మానవుల సుఖ దుఃఖాలను, అనుభవాలను రచనల్లో ప్రతిఫలింపజేయటం నేటి కవుల కర్తవ్యం. ఏనాటి కవుల కర్తవ్యమైనా అదే. అయితే వాటిని అన్ని కాలాలకు వర్తింపజేయటం వారి వారి ప్రతిభా సంపదపై ఆధారపడి ఉంటుంది. దీనినే దృశ్యకావ్య రూపంలో సమర్పించటం కొంతవరకు కష్టమే. 'నాటకాంతం సాహిత్యం' అన్నారు గదా. క్రొత్తగా ఫ్రీవర్స్ రూపంలో వ్రాయటం ఇంకా కష్టమేమో, అయినా ప్రయత్నం చేశాను. ఇదొక ప్రయోగం"** అని తెలిపారు. వచన కవిత్వంతో కుందుర్తికి పరిచయం ఏర్పడినప్పటి నుండీ ఏవైనా నూతన ప్రయోగాలు చేయాలనే సంకల్పం ఎక్కువగా వుండేది. ఆ సంకల్పమే వచన కవితా నాటక రచనకు దోహదం చేసింది. కుందుర్తి ఏ ప్రయోగం చేసినా వచన కవిత్వ వికాసం, కవిత్వంలో సామాన్యునికి ప్రాముఖ్యం ఇవ్వటమే ప్రయోజనంగా చేశారు. ప్రసిద్ధి పొందిన నాటకాల్లో సంభాషణలు గొప్పగా ఉన్నాయని అనిపిస్తున్న ప్రతీ సన్నివేశంలో అవి కవిత్వ స్థాయికి చాలా దగ్గరికి వచ్చినట్టు కనిపిస్తాయి. ఆ దృష్ట్యా వచనకవిత్వంలో నాటక రచన ఉత్తమ సాహిత్య రచనకు దోహదం చేస్తుందని చెప్పవచ్చు.

వచన కవితా రచన కత్తిమీద సాము వంటిది. ఏ మాత్రం గతి తప్పినా అందులో కవిత్వం లోపించి వచనం మాత్రం మిగులుతుంది. వచనంలో కవిత్వం రాయడం కష్టమైతే కవితా నాటకం రాయటం, ప్రదర్శించటం మరింత కష్టం. కవిత్వం హృదయ స్పందనను కలిగిస్తుంది. నాటకం ఒక విషయాన్ని ఎత్తి చూపుతుంది. ఎదిరించి నిలబడి ఆలోచించేటట్లు చేస్తుంది. కేవలం కవిత వల్ల, కేవలం నాటకం వల్ల తన రచనా ప్రయోజనం నెరవేరదు అనుకున్నపుడు కవి కవితా నాటకాన్ని రచిస్తాడు. ప్రముఖ నాటక రచయిత గొల్లపూడి



మారుతీ రావుగారు **'కవితా నాటకం – ఆశ'** (యువ స్వరాలు – శ్రీ కుందుర్తి సంస్మరణ సంచిక) అనే విమర్శ వ్యాసంలో వచన కవితా నాటకం వల్ల సమస్యలను, ప్రయోజనాలను ఈ క్రింది విధంగా వివరించారు.

**కవితా నాటకంలో సమస్యలు**

1. Visual Medium Intellectual mediumతో జతపరచటం కొంత సాహసమే అని చెప్పవచ్చు. నాటకంలో ముఖ్యమైనది సమస్య. అది కవిత్వాన్ని ఆశ్రయించుకున్న నాటకంలో తప్పక పల్చబడుతుంది లేదా ద్వితీయశ్రేణిలోనే ఉంటుంది.

2. కవితా నాటకంలో సంభాషణలను, భావనలను, అర్థాన్ని తెలుసుకోవడానికి ప్రేక్షకుడు కొంత జిజ్ఞాస, శ్రద్ధను చూపాలి. తప్పనిసరిగా ప్రేక్షకుడికి పాత్ర చెప్పుతున్న విషయం మీద దృష్టి అవసరం అవుతుంది. ఇలా నాటకంలో పాత్ర, సన్నివేశం మీద కన్నా మాటల మీద దృష్టి ఉండటం సన్నివేశాన్ని దెబ్బతీస్తుంది.

3. కవిత్వానికి ధ్వని (అనుప్రాసం మొ.అలంకారాలు) ప్రాణప్రద మైనవి. పూర్తిగా కాకపోయినా చాలా మట్టుకు కవిత్వం ధ్వనిని ఆశ్రయించుకుని ఉంటుంది. నాటకానికి సంబంధించినంత వరకు ధ్వని పనికిరాదు.

4. కవితా నాటకాన్ని చూడడానికి సిద్ధపడ్డ ప్రేక్షకుడు కొంతవరకు కవిత్వంలో కనిపించే సౌందర్యాలను చూడడానికి సిద్ధపడి కూర్చోవచ్చు, లేదా నాటకంలో కనిపించనక్కరలేని యిబ్బందులకు సిద్ధపడి కూర్చోవచ్చు. ఈ విధంగా రాజీ పడడం పూర్తి నాటకానుభవాన్ని (Theatrical experience) ఎంతో కొంత దిగజారుస్తుందే కాని పెంచదు.

5. నాటకంలో సంభాషణలు చెప్పడం ప్రధానమైనందువల్ల కవితా నాటకంలో నటుల సమర్థత పాలు ఎక్కువగా ఉండాలి.

6. కరుణరసాన్ని ఆలంబనం చేసుకొని ఒక సన్నివేశపు లోతుల లోకి తీసుకుపోయే ప్రక్రియను నాటకంలో Melodrama అంటారు. నాటకంలో Melodrama రసానికి ఒక ఉపాంగంగా ఉండాలి. అలా కాకుండా అదే ప్రముఖ పాత్ర వహిస్తే నాటకం విఫలమవుతుంది.

7. నాటకంలో వాస్తవికత ఒకానొక ధోరణి మాత్రమే కానీ ప్రతీ నాటకంలో ఉండి తీరవలసిన ముఖ్య లక్షణం కాదు. కవితా నాటకం వాస్తవికత ప్రభావానికి కాస్త దూరంగా ఉండక తప్పదు.

**కవితా నాటకం వల్ల ఉపయోగాలు**

1. ఒక భావం పద్యంలో లేదా గేయంలో పకడ్బందీగా ఇమిడినట్లు సాధారణవాక్యంలో ఇమడదు. మంచి కవితా నాటకంలో సంభాషణల ద్వారా సాధించగలిగిన ఫలితాన్ని ఏ గద్య నాటకంలో కూడా సాధించలేము.

2. భావాన్ని సూటిగా చెప్పడం లేదా సూచించడం కవి పని కనుక నాటకం ద్వారా అలాంటి పనిని సాధించాలనుకున్నప్పుడు కవితా నాటకం తప్పనిసరిగా ఎక్కువ ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది.

3. గద్య నాటకానికన్నా కవితానాటకానికి సంగీతం వల్ల అదనపు ప్రయోజనం చేకూరుతుంది.

4. కవితా నాటకంలో వస్తువు సామాన్య ప్రజలకు తెలిసిందే అయినప్పుడు ప్రేక్షకులను ఇంకా ఎక్కువగా ఆకర్షించగలుగుతుంది.

5. పద్య, గేయ నాటకాల కంటే ఫ్రీవర్స్ నాటకానికి ఎక్కువ భవిష్యత్తు ఉంటుంది. ఇతివృత్తాన్నంతటిని చెప్పనక్కరలేకుండా ఒక భావన లేదా ఒక ఆలోచనను రేకెత్తించే పనిని ఫ్రీవర్స్ నాటిక చేయగలుగుతుంది.

కుందుర్తి వచన కవితా నాటకంలో కష్టాన్ని కూడా సులువు చేసి వచన కవితను రంగస్థలం మీద నిలిపారు. కుందుర్తి వచన కవిత్వంలో **'ఆశ'** నాటకం, **'ఆచార్ల గారమ్మాయి'** అనే రేడియో నాటిక, **'శిక్ష ఏమిటి?'** అనే వీధి నాటకాన్ని రచించారు.

**ఆశ**

ఈ నాటకం మొట్ట మొదటిసారిగా 1957 ఫిబ్రవరి 2 వ తేదీన ఇండియన్ నేషనల్ థియేటర్, హైదరాబాదు శాఖవారిచే ప్రదర్శింప బడింది. 1957 అక్టోబరునెలలో ఈ నాటకం ముద్రితం అయ్యింది. ఈ నాటకాన్ని కుందుర్తి తెలుగు సాహిత్యంలో ఫ్రీవర్స్‌లో వ్రాసిన మొట్టమొదటి నాటకంగా పేర్కొన్నారు. పద్యనాటకాలు, గేయ నాటకాలు ఉన్నప్పటికీ ఫ్రీవర్స్‌లో ఒక చక్కని నాటకంగా దీన్ని ప్రచారంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కుందుర్తి ఈ నాటకాన్ని రచించారు. ఈ ప్రయత్నంవల్ల వచన కవితా ప్రక్రియను అన్నిరకాలైన రచనలకు పరివ్యాప్తం చెయ్యాలనే కుందుర్తి దృఢ సంకల్పం వ్యక్తం అవుతుంది.

కుందుర్తి ఈ నాటకాన్ని నటి, సూత్రధారుడు, కవి, రామనాథం, సబ్ ఇన్స్పెక్టర్, ఇద్దరు గుమాస్తాలు, బంట్రోతు వంటి మానవ పాత్రలతోపాటు కాలం, చరిత్ర, ఆశ వంటి మానవేతర పాత్రలను కూడా ప్రవేశపెట్టి రచించారు. మానవులతో సంబంధం వున్న కాలం, చరిత్ర ఆశ వంటి అంశాల్ని పాత్రలుగా నాటకంలో ప్రవేశపెట్టటం ఒక విశేషం. **"ఆశ భవిషత్తు మీద విశ్వాసం. మానవజాతి భవిష్యత్తు స్వయంగా శ్రమించి నిర్మించుకోవలసిన మహాసౌధం. అందులో ఆశ ఉపాసనా దేవత. కాలం రాచబాట, చరిత్ర చరచరా పరుగెత్తి పోతున్న రథం, సామాన్య మానవుడు రథికుడు, కవి సారథి, జాతి జీవన పురోగమన నవచైతన్యం ప్రథమ సోపానం, సమస్త మానవాభ్యుదయ సాధన మన చరమగమ్యం"** అనే కవి మాటలు ఈ నాటక రచన ఉద్దేశాన్ని తెలుపుతాయి. కుందుర్తి ఈ నాటకాన్ని వచన కవిత్వంలో రాసినా నాటక రచనా సంప్రదాయాన్ని పూర్తిగా అనుసరించారు. సంప్రదాయబద్ధమైన నాటకాల్లోలాగే 'ఆశ' అనే ఈ వచన కవితానాటకంలో నాంది, ప్రస్తావనలున్నాయి. ఈ నాటకం నాలుగు రంగాలుగా విభజింపబడింది.

నాంది తర్వాత మొదటిరంగంలో నటి, సూత్రధారుడు రంగప్రవేశం చేసి నాటకాన్ని గురించి, అందులోని విషయాన్ని గురించి, ప్రయోజనాత్మకమైన ఈ వచనకవితా నాటక రచనను, కవిని గురించి ప్రస్తావిస్తారు. బ్రతుకును రగిల్చే ఆశ ఆసరాతోనే మానవుడు సులభంగా తన గమ్యాన్ని చేరుకొంటాడనే విశ్వాసాన్ని నాటకంలో కుందుర్తి ప్రదర్శించారు. స్వార్థపరులైన ఉద్యోగులు కొందరు సమ్మెలను ఎలా తప్పుదారి పట్టిస్తారో, సమ్మెను తమ స్వార్థానికి ఎలా ఉపయోగించుకుంటారో నాటకంలో చిత్రించారు. మానవ మనుగడకు, విశ్వ మానవ కళ్యాణానికి చేసే ఉద్యమాలు కాల ప్రభావంతో, స్వార్థశక్తుల కుటిలత్వంతో విఫలమవుతూ ఉన్నా అవి ఎప్పటికీ ఉద్యమాల్ని అణచివేయలేవని చాటిచెప్పటం కోసం ఈ నాటకాన్ని నిర్దేశించారు. 'ఆశ' నాటకంలో నిర్వహింపబడిన కథాంశం కంటే సందేశాత్మకమైన సంభాషణే ఎక్కువగా ఉంది. ఈ సంభాషణంతా మానవ ప్రపంచాన్ని గురించీ, అందులో జరుగుతూ ఉండే వివిధ విషయాల్ని గురించీ కనిపిస్తుంది. ఈ నాటకంలో మానవ జీవితాన్ని గురించిన ప్రస్తావనతో పాటు గెలీలియో, మార్క్స్, మహాత్ముడు, వీరేశలింగం, గురజాడ, గిడుగు వంటి ప్రముఖ వ్యక్తుల గురించి కూడా చర్చ ఉంది.

ఆశ నాటకంలో కవి కవిత్వం మానుకొని బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు నాయకత్వం వహించి విఫలుడై నిరాశాపూరితంగా ఉన్న దశలో ఆశ వచ్చి అతని కర్తవ్యం కవితా సృష్టి అని ప్రబోధిస్తుంది. సాహిత్యవేత్తలకు రాజకీయ అవగాహన తప్పని సరిగా వుండాలని, అయితే సాహితీవేత్త తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి రాజకీయ నాయకులకు లొంగిపోయేటంతగా అది ఉండకూడదని కుందుర్తి అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని బలపరుస్తూ కుందుర్తి ఆశ నాటకం రచించారు. కుందుర్తి కవుల రాజకీయ నిబద్ధత గురించి కేవీఆర్ గారికి రాసిన లేఖలో **"ఒకసారి శ్రీశ్రీ, శ్రీకాకుళం వెళ్లి ఉద్యమంలో పాల్గొంటానని ప్రకటించినట్టు గుర్తు. ఒకవేళ వెళ్లాడనుకొందాం. (అమంగళం ప్రతిహత మగుగాక) ఇది నిజానికి తెలుగు సాహిత్యానికి తీరని లోటుగా పరిణమించి వుండేది కదా. కాబట్టి కవులు రాజకీయ నాయకులకు దోహదకరంగా రచనలు చేస్తూ ప్రజలలో విప్లవ బీజాలను నాటుతూ ఉండవలె గాని తమ కవితా శక్తిని తక్కువగా అంచనా వేసుకొని దానివల్లా ప్రయోజనం లేదు అనుకొని రాజకీయం లోకి దిగి యాక్షన్లోకి దిగడం కన్నా విషయాన్ని మనసులో వుంచుకొని నేను రాజకీయ నిమగ్నత కూడదని నా ఇంటర్వ్యూలో చెప్పాను"** అని వివరించారు. కుందుర్తికి గల ఈ అభిప్రాయాన్నే ఆశ నాటకం ద్వారా ప్రతిపాదించారు.



వచన కవితా పితామహుడు-కుందుర్తి

**"కలం నీ ఉద్యోగం,**
**అదే మనందరి సమిష్టి బలం**
**కవిత నీ కర్తవ్యం,**
**బ్రతుకును వెలిగించటం దివ్యం"** అని కవులను ప్రబోధిస్తూ ఆశావాదాన్ని ప్రతిపాదిస్తుంది ఈ నాటకం.

**ఆచార్ల గారమ్మాయి**

కుందుర్తి దీన్ని రేడియో నాటికగా రచించారు. దీన్ని వచనకవితా రేడియో ఏకాంకికగా పేర్కొనవచ్చు. ఇందులో ప్రయోక్త, ఆచార్లగారమ్మాయి, ఆచార్లు, చైర్మన్, జవాను, శ్రోత, రచయిత, వ్యక్తి అనే పాత్రలున్నాయి.

ఇందులో ప్రధాన పాత్ర శశిరేఖ. ఆమె అందమైన అమ్మాయి. మంచి గాయని. ఆమె ఆచార్లు గారి కుమార్తె ఈమె చెట్టుపై వున్న కోకిల అదిరిపడి ఆలకించేట్లు పాట పాడగల సామర్థ్యం కలది. అయినా ఈ అమ్మాయి పరిస్థితుల ప్రభావానికి బలైపోయిన అనాథ. మానభంగానికి గురైన కారణంగా తండ్రి వున్నా ఆమె అనాథ అవుతుంది. ఆమె దుస్థితికి కారణం చైర్మన్ అని తెలిసినా గట్టిగా సంఘానికి చాటి చెప్పలేని ఆచార్లు ఆమె బావిలో దూకి ఆత్మహత్య చేసుకొందని తమ యింటి పరువు, మర్యాదలకోసం ప్రచారం చేస్తాడు. కానీ ఆమె అనాథ శరణాలయంలో బ్రతికే వుంటుంది.

పదేళ్ళ క్రిందట జరిగిన ఈ సంఘటనను కవి ఒక నాటికగా మలచి ఆయా వ్యక్తుల్నే పాత్రలుగా చేసి రేడియో ద్వారా ఈ నాటికను ప్రసారం చెయ్యాలనుకొన్నాడు. కానీ చైర్మన్, పంతులు, ఉన్నతాధికారి, ఆచార్లు సంఘం భయంతో ఈ కథను ప్రసారం కానీకుండా చేస్తారు.

ఈ నాటికలో సంఘం దృష్టిలో ఆత్మహత్య చేసుకుని చనిపోయిన ఆచార్లగారమ్మాయిని ప్రజల మధ్యకు తీసుకవచ్చి, ఆమె చేతనే నిజానిజాలు చెప్పిస్తారు. కుందుర్తి ఈ నాటికలో సమాజంలో జరిగే మానభంగాల వల్ల బలైపోతున్న స్త్రీల జీవితాన్ని చిత్రించారు. ఇలాంటి ఘోర కృత్యాల్ని చేసే పెత్తందార్లు పెద్దమనుషుల్లా చెలామణి కావటాన్ని వివరించటం కోసం ఈ కథను తన నాటికలో ఇతివృత్తంగా స్వీకరించారు.

**శిక్ష ఏమిటి?**

కుందుర్తి రచించిన 'శిక్ష ఏమిటి' ఒక వీధి నాటకం. ఈ వచన కవితా వీధి నాటకంలో నాలుగు రంగాలున్నాయి. ఈ నాటకాన్ని గురవయ్య (ఒక హరిజనుడు), రాంబాబు (గురవయ్య కొడుకు), గోపయ్య (కాంట్రాక్టర్), సూత్రధారుడు, ముసలివాడు, ధర్మన్న, పరంధామయ్య (ఇంజనీరు), రామయ్య (గుమాస్తా), కవి, ప్రేక్షకుడు, కార్మికులు (మగ్గురు), వ్యక్తులు (ముగ్గురు), వ్యవసాయ కూలీలు (ఇద్దరు) పాత్రలుగా ఈ నాటకం రచించారు. "శిక్ష ఏమిటి" నాటిక అవినీతిపరులైన కంట్రాక్టర్లు, ఇంజనీర్లు, లంచగొండి గుమాస్తాలకు బుద్ధి చెబుతుంది. ఈ నాటకంలో మధ్య తరగతి ప్రజలకు, ప్రభుత్వ అధికార్లకు మధ్య జరిగిన సంఘర్షణను చిత్రించారు.

హరిజనులకు ఇళ్ళు కట్టించే పనిని కాంట్రాక్టు తీసుకొన్న గోపయ్య ఇంజనీరు పరంధామయ్యను మంచి చేసుకొని డబ్బు తీసుకుని గుమాస్తాకు పది వేల రూపాయలు లంచంగా ఇస్తాడు. తన తప్పిదాన్ని కప్పి పుచ్చుకోవడం కోసం గుమాస్తా చేత ఆ ఫైలును మాయం చేయిస్తాడు. ఒకవేళ విచారణకోసం ఎవరైనా పై అధికారులు వస్తే బంట్రోతు గురవయ్యే దానికంతటికీ కారణం అని చెప్పి తప్పించుకోవటం కోసం ఒక ప్రణాళికను కూడా సిద్ధం చేశాడు. ఈలోగా ప్రజలలో చైతన్యం వచ్చి ఇళ్ల కోసం పోరాడతారు. కార్మికులు కాలనీ కోసం సమ్మె చేస్తారు. పరంధామయ్య స్థానంలో కొత్తగా వచ్చిన ఇంజనీర్ నిజాయితీపరుడు కావటంతో వీరి ప్రణాళిక అంతా తలక్రిందులౌతుంది. రాంబాబు గోపయ్య మోసాన్ని, అవినీతిని బహిర్గతం చేస్తాడు. గోపయ్య ఇచ్చిన పదివేల రూపాయలు దొంగనోట్లని తేలిపోయాక గుమాస్తా రామయ్య గోపయ్య మోసాన్ని బయటపెట్టాడు. చివరకు రాంబాబును చంపాలనుకున్న గోపయ్యను పోలీసులు అరెస్టు చేస్తారు. ప్రజాకోర్టులో విధించే శిక్ష నుంచి గోపయ్య తప్పించుకొంటాడు. ఇలాంటివాళ్ళు నిజమైన కఠిన శిక్షలకు గురికాకుండా ప్రభుత్వం వాళ్ళను అరెస్టు చేసి కాపాడుతూ వుందనే విషయాన్ని నాటకంలో చిత్రించారు. ప్రజల్లో చైతన్యం లేనంతవరకు ఇలాంటి సంఘటనలు జరుగుతూనే వుంటాయని, వాటి మూలంగా బలై పోతున్న వ్యక్తులు కళ్ళుతెరచి తమకు జరుగుతున్న అన్యాయాల్ని ఎదుర్కోవాలనే సందేశంతో ఈనాటిక ముగుస్తుంది.

**ముగింపు :**

కుందుర్తి వచన కవిత్వంలో రచించిన ఈ మూడు నాటకాల్లో సమాజ వాస్తవ స్థితిగతుల్ని వ్యక్తం చేస్తూ సమాజంలో పేరుకపోయిన అవినీతిని, దుర్మార్గాన్ని, క్రూరత్వాన్ని, మన కళ్ళముందుంచి వాటికి అన్యాయంగా బలైపోతున్న వ్యక్తుల జీవితాలను చిత్రించారు. 'ఆశ' నాటకంలో మానవ జీవితాన్ని, బలీయమైన ఆశ సాధించ గలిగే మహోన్నతమైన మానవ ఆశయాల్ని చిత్రించారు. 'ఆచార్లగారమ్మాయి', 'శిక్షఏమిటి?' అనే నాటకాల్లో సాంఘికపరమైన రెండు సంఘటనల్ని ప్రేక్షకుల ముందుంచి వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన నిర్ణయాన్ని ప్రేక్షకులకే వదిలివేస్తూ రచించారు.

కుందుర్తి వచనకవిత్వంలో ప్రయోగాత్మకంగా నాటకాల్ని రచించినా వచనకవితా ఖండికల్లో ప్రతిపాదించిన సిద్ధాంతాలకు, పేర్కొన్న విషయాలకు భిన్నంగా మాత్రం వాటిని రచించలేదు. వచనకవితా ఖండికలన్నింటిని ఏ దృక్పథంతో రచించారో అదే అభ్యుదయ దృక్పథంతోనే నాటకాలు రచించారు.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. కుందుర్తి కవిత్వం. vol. I, II హోరు ప్రచురణలు, 2002.

2. కుందుర్తి సంస్మరణ. హైదరాబాద్, కుందుర్తి సంస్మరణ సమితి, 1983.

3. కుందుర్తి. కుందుర్తి వ్యాసాలు. హైదరాబాద్, తెలుగు పరిశోధన ప్రచురణ, 1987.

4. కుందుర్తి. కుందుర్తి పీఠికలు. మచిలీపట్నం, స్పందన సాహితీ సమాఖ్య, 1977.

5. చంద్రశేఖర్, ఎస్వీడి. వచన కవిత్వం – కుందుర్తి పాత్ర. తిరుపతి, ఎస్వీడి పబ్లికేషన్స్, 1985.

6. మహేందర్, జి. విమర్శకునిగా కుందుర్తి (అముద్రిత పరిశోధన వ్యాసం). హైదరాబాద్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2006.

7. యువ స్వరాలు – సాహిత్య మాస పత్రిక – శ్రీ కుందుర్తి సంస్మరణ సంచిక, అక్టోబర్ –1985.

8. రామమోహనరావు, అద్దేపల్లి. కుందుర్తి కవితా వైభవం. హైదరాబాద్, యువభారతి, 1980.

9. సుందరయ్య, చీకోలు, (సంకలన కర్త). నివాళి – వచన కవితా పితామహుని సాహిత్యం – వ్యక్తిత్వం. హైదరాబాద్, రంజని – తెలుగు సాహితీ సమితి, 1998.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11 (31) హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గండ్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

ఇది ఒక తాళపత్ర గ్రంథము. కవి మిత్రుడు వేణుశ్రీ వారి బంధువు శ్రీ లొంకల జగన్నాథం గారి వద్దనుండి తెచ్చియిచ్చాడు. లొంకల జగన్నాథం గారు వెదిరె గ్రామంలోని వేంకటేశ్వరాలయంలో అర్చకులుగా ఉండేవారు. వారిది కరీంనగర్ జిల్లాలోని వెదిరె గ్రామము. సుప్రసిద్ధ బొమ్మలమ్మగుట్ట శాసనం గల కురిక్యాల గ్రామ సమీపంలో వెదిర ఉంది. ఈ గ్రంథకర్త పేరు ఎక్కడ రాయలేదు. ప్రతి ఆకుపైన నీతిశాస్త్రము అని రాసి ఉంది. పత్రసంఖ్య, శ్లోక సంఖ్య తెలుగు అంకెలలో రాశాడు.

సంస్కృత శ్లోకాలు తెలుగు లిపిలో రాయబడి ఉన్నాయి. వాటికి తాత్పర్యం తెలుగులో రాశాడు. ఈ శ్లోకాలు వివిధ గ్రంథాలనుండి సేకరించినట్లు తెలుస్తున్నది. చాణక్య నీతి, విదుర నీతి, హితోపదేశం, నీతిసారం మొదలైన వాటిలోవి కొన్ని కనబడుతున్నాయి. కొన్ని కొత్తవి ఉన్నాయి.

సకలనీతి సమ్మతము అనే పేరుతో మడికిసింగన తెలుగు పద్యాలు సంకలనం చేశాడు. అది ఈ ప్రాంతం లోనిదే. సంకలనం చేసే సంప్రదాయం ఇక్కడ ప్రాచీనకాలం నుండి ఉంది. గాథాసప్తశతి కూడా ఈ ప్రాంతంలోనిదే.

ఈ తాళపత్ర గ్రంథము ఇంతవరకు ముద్రింపబడలేదు. ఈ పేరుతో గతంలో ముద్రించబడినవి.

1. నీతిశాస్త్రము – 1919 లో లక్ష్మీ విలాస కంపెనీ పబ్లిషర్స్, ఏలూరు.

2. నీతిశాస్త్రము – తాత్పర్య సహితము, 1918, రామా అండ్ కో, ఏలూరు.

3. నీతిశాస్త్రము – మంగు వేంకట రంగనాథ రావు వలన ముద్రించి ప్రకటింపబడియె. 1918, కాకినాడ.

ఈ సంకలనాల ప్రచురణకర్తల పేర్లే కాని సంకలనకర్తల పేర్లు లేవు. అప్పటికి గల పండితులెవరితోనో సంకలనం చేయించి ఉంటారు. మూల గ్రంథాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ముద్రణా సౌకర్యాలు వచ్చిన తరువాత ఈ సంకలనాలు వెలువడినాయి. ఈ పేరుతో గాక చాణక్య నీతి, విదురనీతి అనే పేర్లతో ప్రచురింపబడినాయి.

దేవనాగరలిపిలో నీతిసారః పేరుతో ఉంది. మహామహోపాధ్యాయ డా.పుల్లెల శ్రీరామచంద్ర గారిచే సంకలనం చేయబడి సంస్కృత భాషాసమితి వారిచే సంస్కృత సూక్తి రత్నపదకోశః పేరుతో రెండు సంపుటాలు 1992లో వెలువడినాయి. పై గ్రంథాలలో ఉన్నట్లుగా అదే క్రమంలో శ్లోకాలు ఇందులో లేవు. అంతేకాక అన్నీ అవే శ్లోకాలు లేవు. కొన్ని అన్నింటిలోను ఉన్నాయి. కొన్ని కొత్తవి ఉన్నాయి.

ఇది పూర్తిగా స్వతంత్రంగా సేకరించి సంకలనం చేసిన తాళపత్ర గ్రంథం. అయితే సంకలనకర్త, లేఖకుడు ఒకరు కాకపోవచ్చు. అందుకే లిపి దోషాలు, భేదాలు కనబడుతున్నాయి. ఇంతవరకు ఇది యథాతథంగా ముద్రింపబడినట్లు నా దృష్టికి రాలేదు.

తాళపత్రాలలోని లిపి పురాతనము. స, శ లు ఒకటికొకటి రాయడం ఉంది. చేసేది–చేశేది; చేయ–శేయ; తపసి–తపశి; ణకు బదులు న; వర్ణం–వర్నం; వున్నారు, వొకరు, యెవరు, యెందు, మొదలైన వ కార, య కారాలు మొదట వాడటం, అల్ప ప్రాణాలు మహా ప్రాణాలు అటుఇటుగా వాడటం, గృహస్థకు గృహస్త, ద్విత్వాలకు, సంయుక్తాలకు ముందు పూర్ణ బిందువుల ప్రయోగాలు. విద్యాంస్ను, అంత్త, (అంత), దీర్ఘాలు లేని చోట రాయడం, చేసినను–చేశినాను, తిన్నను–తిన్నాను... వంటివి ..ఒత్తులు, ముఖ్యంగా రేఫము అక్షరానికి ముందు విడిగా రాయడం ..... అర్థ–అర్థ, ధర్మ–ధర్మ, కర్మ – కర్మ.. పెర్గు–పెరుగు, గన్క–గనుక, మరికొన్ని..... యిచ్చగింతురు–యిచ్చుయింతురు, సముచ్చయం ద్విత్వంగా రాయడం. ను–న్ను, చేయడమును–చేయడమున్ను – ఇట్లాంటివి శ్లోకాలలో కూడా ఉన్నాయి. ఇవి లిపి రూపాలు. ఇది ఒక సంకలనం. సంకలన కర్త తనకు నచ్చినవి, వచ్చినవి రాసుకున్నట్లుగా అనిపిస్తుంది. తాళ పత్రాలపై తానే వ్రాశాడా లేక ఎవరితోనైనా వ్రాయించాడా తెలియదు. లేఖకుని దోషాలుగానే భావించాలి.

శ్లోకాలు, శ్లోక పాదాలకు పాఠాంతరాలు కూడా కనబడుతున్నాయి. ఆయా శ్లోకాల వద్ద కొన్నింటికి పాఠాంతరాలు చూపించాను. తాత్పర్య రచన తేలికగా ఉన్నా వాక్య నిర్మాణాలు వ్యావహారికతకు దగ్గరగా ఉన్న గ్రాంథికం వలె ఉంటాయి. సంకలన కర్త చెపుతుంటే లేఖకుడు రాసి ఉంటాడు. మాట్లాడుకున్నట్లున్నా పదాలు గ్రాంథికాలు, వ్యావహారికతలు కలిసిపోయాయి.

సకల బ్రహ్మాండనాథుడైన దేవుణ్ని నిందవల్ల కుక్క జన్మం వచ్చును. ఈ వాక్యంలో ఈ దేవుడి నింద వల్ల లేదా నిందించడం వల్ల .. అని ఉండాలి. దేవుణ్ణి నింద వల్ల .... వంటి వాడుకలు ఇప్పుడు లేవు. వాక్య నిర్మాణాల కన్నా విషయం బోధపడిందా లేదా అన్నదే ప్రధానంగా వ్రాసినట్లు తెలుస్తున్నది.

కాగితమూ, కలమూ రాకముందు కాలానిది అని స్పష్టం. లేదా రెండు మూడు వందల యేండ్ల క్రిందటిది అని చెప్పవచ్చును.

ఇందులో 18 పత్రాలు వ్రాసినవి కాగా రెండు చివరల వ్రాయని పత్రాలున్నాయి. మనం నేడు పుస్తకంలో రెండువైపులా తెల్ల కాగితాలు వదలి పెట్టినట్లు. పత్రాల నిడివి 15 అంగుళాలు. వెడల్పు ఒకటిన్నర

అంగుళం. రెండు చివరల ఒక అంగుళం వదలిపెట్టి రాశారు. ఆరు పంక్తులు చిన్న అక్షరాలలో రాశారు. రెండువైపులా రాసి ఉన్నాయి.

మొదటిపత్రం మీద ఒక మూలకు..... శ్రీ లక్ష్మీ వేంకటరమణాయ నమః, శ్రీమదచ్యుత శఠగోప యతిరాజ వరపదనిజ గురుభ్యో నమః... నీతిశాస్త్రము..... అని వ్రాసి ఉండటాన్ని బట్టి ఈ సంపాదకుడు వైష్ణవుడు అని స్పష్టమవుతున్నది.

ఈ శ్లోకాలు నేటి పాఠకులకు తెలిసే విధంగా పరిష్కరించి రాశాను. తాత్పర్యం యథాతథంగా రాస్తూ అక్షర దోషాలు నేటి వాడుక ప్రకారం రాశాను. ఈ వచన శైలినిబట్టి భాషాశాస్త్ర వేత్తలు పరిశోధన చేయవచ్చు.

మిత్రుడు ఆచార్య అనుమాండ్ల భూమయ్య (తెలుగు విశ్వవిద్యా లయం పూర్వ ఉపకులపతి) సూచనతో తెలుగు పద్యానువాదం చేశాను. ఇవి పాఠకుల దృష్టికి తెస్తున్నాను.

---

నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము (మొదటి పత్రము)

శ్రీ లక్ష్మీవేంకటరమణాయ నమః శ్రీమదచ్యుత శఠగోపాయ నమః

**ప్రణమ్యాం శిరసాం దేవం త్రైలోక్యాధిపతిం ప్రభుం**
**నానా శాస్త్ర కృతం వక్షేన నీతి శాస్త్ర సమావృతం**

పద్యానువాదం -

**“శ్రీనివాసునకును భక్తి శిరసు వంచి**
**శ్రీమదచ్యుత శఠగోప స్వామి దలచి**
**నీతి శాస్త్రము జెప్పెద నిదియు చదివి**
**మంచి చెడులందు మానవుల్ మసలుకొనగ”**

అర్థం - శిరస్సాష్టాంగముగను గురుస్వామికి వందనం జేసి, మూడు లోకాలకు అధిపతియైనట్టి శ్రీమన్నారాయణునకు మ్రొక్కి సకల శాస్త్రములు గల మేలు నీతిని బుచ్చుకొని యీ నీతి శాస్త్రం చెప్పబడినదనిన రీతి.

**అధీత్యేయం విధం శాస్త్రం నానా జ్ఞానాది తత్పరః**
**ధర్మోపదేశ వినయా కార్యా కార్య శుభావహం**

పద్యానువాదం -

**నానావిధ శాస్త్రమ్ముల**
**జ్ఞానమ్మగు నిది చదివిన సద్ధర్మములన్**
**మానక మంచిని నీతిని**
**పూనిచరింతురు మనుజులు బుద్ధిగ నెపుడున్**

**అర్థం :** ఈ నీతి శాస్త్రం చదివిన మనుష్యుడు నానా జ్ఞానముల తత్త్వమున్ను, ధర్మమార్గమున్ను, వినయమున్ను అయ్యే కార్యమున్ను శుభాశుభములు తెలిసి తిరుగుదురనిన రీతి.

**తదహం సా ప్రవక్ష్యామి నరాణాం నీతి కారణం**
**లభతేపిరతిః కీర్తీ యశ్శస్సర్వం శ్రనక్తు**

పద్యానువాదం -

**“మానవులనీతికిని మూలమైనయవియు**
**కార్య నిర్వహణమునకుపకరణములును**
**శాస్త్ర సారములును కీర్తి సాధనములు**
**అట్టి సూక్తులు దెలిపెద నరయుడయ్య”**

అర్థం - మనుష్యునకు నీతి కారణంబైనటువంటి సకల కార్యాలకు ఉపకరించునటువంటి హంసజ్ఞానం కలవారికి కీర్తి లభించును. యీషణ త్రయములకు, ధర్మత్రయములకు, కాలత్రయములకు, కర్మత్రయములకు, కరుణ త్రయములకు యీ శాస్త్రం చదివి నడిచిన వారికి సర్వ కార్యాలు తెలిసి ప్రకాశానకు వచ్చు ననిన రీతి.

**మూర్ఖ శిష్యోపదేశేన దుష్టస్త్రీభరణేనచ**
**ద్వేషితాం సంప్రయోగేన పండితా వ్యవశీ వశీకృత్**

పద్యానువాదం -

**“మూర్ఖ శిష్యునకుపదేశ మొసగెనేని**
**దుష్ట వనితను గాంచియు నిష్ట పడిన**
**చేరి పగవారితోడను పోరు చేయ**
**పండితుండైన నేమితా భ్రష్టుడగును”**

అర్థం - మూర్ఖుండైన శిష్యునకుపదేశించినను, దుష్టయైన స్త్రీని భ్రమించినను, పగవారితో పోరాటం చేసినను, పండితుడైన చెడునన్న రీతి.

**సంబంధుర్యో హితాయుక్తా, సపితాయస్త పోషకః**
**తన్మిత్ర యత్ర విశ్వాసో, కుభార్యా నిష్ఫలం భవేత్**

పద్యానువాదం -

**“మేలు చేసిన వారె చుట్టాలు సుమ్ము**
**తనను పోషించినాతడే తండ్రి యగును**
**మిగుల నమ్మిన వారలే మిత్రులనగ**
**తప్పు లెరుగని యిల్లాలు ధర్మ పత్ని”**

అర్థం - సమస్త బంధువులలో తనకు హితవు చేసినవారే బంధువులు, తనను పోషించినవారే తండ్రి. తన వలన విశ్వాసము గలవారే మిత్రులు. కు భార్య గాక దోషమెరుగనిదే భార్య అన్న రీతి.

**భోజ్యం భోజన శక్తిశ్చ రతిశక్తిర్వర స్త్రియః**
**విభవో దానశక్తిశ్చ నాల్పస్య తపః ఫలం**

పద్యానువాదం -

**“ఘృతరసాన్నములున్నను కుడువలేదు**
**శీలవతి భార్యతో రతి సేయలేదు**

**దానమెరుగడు బోలెడు ధనములున్న**
**ఎన్ని తపములు జేసిన నివ్వి గలుగు"**

అర్థం – షడ్రసాన్నములు కలిగి కుడువనోపకుండును, గుణాలు గల మంచి స్త్రీ గలిగి రతిశక్తి లేకుండును. భాగ్యం గలిగి దానం చేయకుండును. యివి పూర్వ తపః ఫలమనినరీతి.

**స్త్రీషు, రాజసు, సర్పేషు, స్వాధ్యాయ సహితేషుచ**
**ఆయుధహస్తేషు విశ్వాసం నకర్తవ్యం రతాచరేత్**

పద్యానువాదం –

**"స్త్రీలయందును, రాజ్యపు పాలకులను**
**పాములందును వేదాల పండితులను**
**ఆయుధము చేతిలోన నున్నట్టివాని**
**తగదు నమ్మంగ నెప్పుడు తగదు తగదు"**

అర్థం – స్త్రీలను, రాజులను, పాములను, స్వాధ్యాయము (వేదాధ్యయనము) చేసిన వారిని, అయుధములు చేతిలో గలవారితో విశ్వాసం తగదన్న రీతి.

**స్వగృహే పూజ్యతే మూర్ఖః స్వగ్రామే పూజ్యతే ప్రభుః**
**స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే**

(విద్వత్వంచ నృపత్వంచ నైవ తుల్యం కదాచన – స్వదేశే.......అనే పాఠాంతరం కూడా ఉంది)

పద్యానువాదం –

**"మూర్ఖుడొక తనయింటనే పొందు విలువ**
**ప్రభువు తన గ్రామమున గౌరవమ్ము పొందు**
**రాజు తన దేశమందునే పూజలందు**
**పండితుండెందు నేగిన ప్రణతులందు"**

అర్థం – మూర్ఖుడైనవాడు తనయింటనే పూజ్యుడు, రాజు తన దేశమందే పూజ్యుడు, విద్వాంసుడెల్ల లోకాలలో యెల్ల తావులలో పూజ్యుడన్న రీతి.

(సశేషం)

❖ ❖ ❖ ❖ ❖

# సూర్యావధాని ప్రశంస

**డా. అయాచితం నటేశ్వర శర్మ**
**ఫోన్ : 94404 68557**



గ్రహములు పృచ్ఛక వర్యులు
బహు సంఖ్యా ప్రేక్షకులు విభాస్వత్ తారల్
మహనీయాధ్యక్షుడు శశి
మహదవధానమ్ము సాగు మార్తండునిచే.

బుధుడు నిషేధమున్ సలుపు పూనుచు శుక్రుణసంగు వర్ణనన్
మధుర సమస్యనిచ్చు శని మంజుల గీష్పతి పద్యభాషణన్
సుధియుల మెప్పునొందు వరశోధ పదాకళి శుక్రుడీయగా
మధువుల ధారలొప్పు కదు మంజుల భాషలు పల్కుభూజుడే
విధి సుమరాశి లెక్కిడగ స్వీయ కవిత్వముతో వధానుడై
కుధరము వంటి తూర్పు దస గోష్ఠిని సూర్యుడు సల్పుకేళులన్



తారలే మెచ్చి దిగి వచ్చి తీరుబడిగ
సూర్యదేవుని ఘనమగు శోభ దనర
సత్కరింతురు దిక్కుల శాలువల
గప్పి దివ్య సుమమ్ముల గారవించి!
(డా. అయాచితం వారి సూర్య స్తుతి, పద్యమాలిక నుండి)

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11 (34) హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

# ద్విభాషాశ్లేష (Bilingual Pun)

**చొప్పర శివకుమారి,** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వనపర్తి,ఫోన్ : 9000265222

రచనలో శ్లేషను సాధించడానికి రచయిత రెండు భాషా లక్షణాల్ని ఉపయోగించడాన్ని 'ద్విభాషాశ్లేష' అంటున్నాను. ఇక్కడ రెండు భాషాలక్షణాలు అంటే పదాలకున్న అర్థభేదాలు, సంధి, వ్యాకరణ సౌలభ్యాలు వంటివి రెండుభాషల్లో ఉన్న వేటినైనా ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుంది. అంటే ఒక భాషాలక్షణంతో చూస్తే ఒకఅర్థం, మరో భాషాలక్షణంతో చూస్తే మరోఅర్థం రచనలో రావాలి. ఇలా రెండర్థాలు రావడానికి ఆ రెండు భాషల్నీ సహాయకంగా రచయిత పట్టుకొస్తాడు. ఒకఅర్థం కోసం ఒక భాషాలక్షణాన్ని, మరోఅర్థం కోసం మరో భాషాలక్షణాన్ని వాడుకుంటాడు రచయిత. ఒకపదానికి ఒకభాషలో ఒకఅర్థం ఉంటే, అదే పదానికి మరోభాషలో మరోఅర్థం ఉండవచ్చు. అలాంటప్పుడు రచయిత ఈ రెండుభాషల్లోని అర్థాల్ని వాక్యంలో అన్వయించడానికి ఇమిడ్చి రాయడంవల్ల ద్విభాషాశ్లేష సాధ్యమౌతుంది. భాషలంటే –

**సంస్కృతప్రాకృతమాగధిపిశాచభాషాశ్చ శౌరసేనీ చ,**
**షష్ఠోఽత్ర భూరిభేదో దేశవిశేషాదపభ్రంశః**

అనే శ్లోకం కావ్యప్రకాశవ్యాఖ్యలో పుల్లెల శ్రీరామచంద్రుడు ఉదహరించాడు (కావ్యప్రకాశం, 9.84). దీన్నిబట్టి సంస్కృతం, ప్రాకృతం, మాగధి, పిశాచ, శౌరసేనీ, అపభ్రంశ అనేవే భాషలు. అవి అప్పటికి ఒకవ్యక్తి చెప్పిన భాషలుగా గుర్తించాలి. ఇప్పుడు ప్రచారంలో ఉన్నవి, లేనివి ఎన్ని భాషలైనా రచయిత ద్విభాషాశ్లేషలో ఉపయోగించవచ్చు.

భోజుడు శ్లేషను శబ్దాలంకారాల్లో చెప్తూ భాషాశ్లేష అనే ఉపభేదాన్ని ప్రతిపాదించాడు. ఈ శ్లేష సంస్కృత, పాకృత భాషల నేపథ్యంలో ఏర్పడింది (సరస్వతీ కంఠాభరణము, 2.69). ఈ గ్రంథానికి తెలుగు వ్యాఖ్య రాసిన స్ఫూర్తిశ్రీ **"భాషా శ్లేషయనగా ఒకే వాక్యము గానీ, వాక్య సముదాయము గానీ ఒక భాషలో నొక యర్థమును, మరొక భాషలో మరొక యర్థమునిచ్చుట యని యర్థము"** అని భాషాశ్లేషను వివరించాడు. మమ్మటుడు కూడా సంస్కృత, ప్రాకృత భాషలకు అన్వయించే భాషాశ్లేషనే పేర్కొన్నాడు. ఈ సందర్భంలో వాక్యరూపం ఒకేలా ఉండడం, పదవిభాగం ఆ రెండు భాషల్లో అర్థస్ఫూర్తికి అనువుగా చేయడంలో శబ్దం ప్రధానపాత్ర కాబట్టి భోజుడు దాన్ని శబ్దాలంకారంలో భాగం చేశాడు. భట్టికావ్యం 13వ సర్గకు మల్లినాథసూరి వ్యాఖ్యలోనూ, రామశర్మ రాసిన ప్రాకృత కల్పతురువులోనూ, భవభూతి మాలతీమాధవంలోనూ, జయదేవుడు రాసిన ప్రసన్నరాఘవ నాటకం మొదలైన రచనల్లో భాషాశ్లేష కన్పిస్తుంది.

ఒకే రచనని రెండుభాషల్లో చదివి, ఆయా భాషల్లో అర్థం చెప్పగలిగిన సౌకర్యం కేవలం తెలుగుకే పరిమితంకాదు. ప్రపంచ వ్యాప్తంగా ఇతర భాషల్లోనూ ఇది సాధ్యమనడానికి ఆధారాలున్నాయి. ఏ.బి. కీత్ విదేశీభాషల్లోని ద్విభాషాశ్లేషకు అవకాశమున్న సందర్భాన్ని తన పుస్తకంలో ఉదహరించాడు.

"L. H. Gray has noted a western parallel in the elegy of Leon of Medina on his teacher Moses Bassola, which can be read either as Italian or as Hebrew" (History of Sanskrit Literature, 139) పై విషయాన్నిబట్టి ఒకే విషయాన్ని ఇటాలియన్ భాషలోనూ, హిబ్రూ భాషలోనూ చదివి, ఆయాభాషల్లో అర్థాలు చెప్పవచ్చనే విషయం స్పష్టం అవుతోంది. ద్విభాషాశ్లేషను ఆంగ్లంలో 'Bilingual Pun' అనొచ్చు.

**సంస్కృతాంధ్రశ్లేష :** ప్రాచీన తెలుగు కవులు ద్విభాషాశ్లేషను వాడారు. ప్రాచీనకవులకు శ్లేషను ప్రయోగించే సమయంలో ఈ ద్విభాషాశ్లేష మంచి అవకాశాన్ని కల్పించింది. తెలుగులో ద్విభాషాశ్లేషను చాలామంది కవులు వాడుకున్నా, ఎవరూ సూత్రీకరణలు చెయ్యలేదు. ద్విభాషాశ్లేషను ప్రస్తావించిన తొలి తెలుగుకవి పింగళి సూరన. సూరన రాఘవపాండవీయం అనే ద్వర్థికావ్యం రాశాడు. ఆ కావ్యంలో రెండర్థాలు తీసుకురావడానికి అనేక రకాల శ్లేషల్ని ప్రయోగించాడు. అతడు ఏ రకమైన శ్లేషలు, ఎలా వాడాలనుకుంటున్నాడో ఒక పద్యంలో చెప్పాడు. అతడు చెప్పిన వివిధ రకాల శ్లేషల్లో మొదటిది **'ఆంధ్రభాషా సంస్కృతాభిభాషాశ్లేష'** (రాఘవ పాండవీయం,1.17). ఇక్కడ ఆంధ్రభాషా సంస్కృతాభి భాషాశ్లేష అంటే తెలుగు, సంస్కృత భాషా నేపథ్యాల్ని ఉపయోగించి శ్లేషను సాధించే విధానంగా గుర్తించాలి. అది తెలుగు, సంస్కృత భాషా సమ్మేళనాల వల్ల ఏర్పడ్డ **'ద్విభాషాశ్లేష'** అవుతుంది. దీన్ని సూక్ష్మంగా **'సంస్కృతాంధ్ర శ్లేష'** అని పిలుస్తున్నాను. సూరన చెప్పిన ఈ శ్లేషను ఆధారంగా చేసుకుని నేను ద్విభాషాశ్లేషను ప్రతిపాదిస్తున్నాను.

**"రైలెక్కేదాక చోటుకోసం పోరాడేవాడు. ఎక్కిన తర్వాత మిగతా వాళ్ళను రానివ్వని"** మనస్తత్వం ఆదినుంచి మనిషిలో ఉంది. రాజాశ్రయం నోచుకున్న పండితులు కొత్తవాళ్ళకు రాజదర్శనం అవనిచ్చేవారు కాదు. "నిజగౌరవశైథిల్య భయంబున నితరులగు విద్యాధికులకు రాజగృహంబున ప్రవేశంబు కలుగనియ్యని పురోహితుల గురించి పింగళి సూరపరాజుగారు కళాపూర్ణోదయంలో రాశారు (6.155). సకల విద్యావిశేషజ్ఞులైనా కాకపోయినా ప్రభువుల వద్ద తమ తెలివితేటలను ఘనంగా చాటుకొనడానికి కవులూ,

పండితులూ శ్లేషలూ, చిత్ర కవిత్వాలు ప్రదర్శించేవారు. తెలుగులో ఒక అర్థం సంస్కృతంలో మరొక అర్థం వచ్చే పద్యాలను రచించడం కూడా మొదలైంది. పింగళి సూరపరాజుగారే ఇటువంటిదొకటి కళాపూర్ణోదయంలో వ్రాశారు. పురోహితుని బెడదవల్ల రాజదర్శనం దొరకని నలుగురు అన్నదమ్ములు పామరులలాగ నటించి ఒక తెలుగుపద్యం చదివారు. ఈ పద్యానికి తెలుగులోనూ, సంస్కృతంలోనూ అర్థాన్ని మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు తమవ్యాఖ్యలో పొందుపరిచారు.

**మాయమ్మానసు నీవే / రాయలవై కావదేవరాజేజేజే**

**మాయాతుమ లానినయది / పాయక సంతోసమున్న పలమిలసామీ!** (కళాపూర్ణోదయం, 6.161)

**తాత్పర్యం :** ఓ ప్రభువా! ముమ్మాటికీ నీకు జయము. ఓ భూ నాయకా! నీవు రాజువై రక్షించడంవల్లే ఆనందం విడువకుండగా మా ఆత్మలనూ, మనస్సులనూ అంటిపెట్టుకున్నది. ఇది మాకు సిద్ధించిన ఫలం. మా తల్లి తోడు సుమా! ఈ కందాన్నే సంస్కృత పరంగా ఇలా చెప్పవచ్చు.

**ప్రతి పదార్థం :** హే సునీవే = శుభప్రదమైన మూలధనంగల ఓ రాజా!, ఆయమ్ = రాబడిని, మామాన = లెక్కచేయకండి (రాబడిని నమ్మ వద్దు. దానిని నమ్ముకొని మొత్తం ఖర్చు చేయవద్దు), అలవా = ఛిన్నాభిన్నము కానట్టి, రాః = ధనం, ఏకైవ = ఒక్కటే, అవత్ = కష్ట సమయంలో రక్షిస్తుంది, అజేజే = బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల్ని ఆరాధించే లేదా ఛాగ పశువుతో యజ్ఞం చేసే, రాజే = రాజుకోసం, మా = లక్ష్మీ, ఆయాతు = వస్తుంది, మలాని = పాపాలు, న = పొందవు, హే పాయక = ఓ రక్షకా!, సంతః = సత్పురుషులు, యది = దర్శింప వస్తే, అసముత్ = సంతోష రహితుడవై, నపల = దర్శనమివ్వకుండ పోకుము, మిల = వారితో కలువు, అమీ = కన వచ్చిన ఈ పండితులు, సా = ఆ లక్ష్మి అని నమ్ము.

**భావం :** శుభప్రదమైన మూలధనంగల ఓ రాజా! రాబడిని లెక్క చేయకు. రాబడిని నమ్ముకొని మొదలంటా ఖర్చు చేయకు. ఛిన్నాభిన్నం కాని ధనం ఒక్కటే కష్టకాలంలో రక్షిస్తుంది. (కాబట్టి మూలధనాన్ని సమూలంగా వెచ్చింపకు.) బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల్ని ఆరాధించే లేదా ఛాగ పశువుతో యజ్ఞం చేసే రాజు కోసం లక్ష్మీ వస్తుంది. (అలాంటి రాజును సిరి ఆశ్రయిస్తుందని భావం) పాపములు పొందవు. ఓ రక్షకా! సత్పురుషులు దర్శింప వస్తే, సంతోష రహితుడవై దర్శనమివ్వకుండ ఉండొద్దు. వారితో కలువు. వచ్చిన ఆ పండితులే ఆ లక్ష్మి. (కోవిదులైన సత్పురుషులకు వేదమే లక్ష్మి అని, వారి నోట లక్ష్మి నివసిస్తుందని వేదాలు చెప్తున్నాయి.) కాబట్టి వాళ్ళకి ఆశ్రయమిచ్చి యజ్ఞం చేసి ఇంకా లక్ష్మికి ఆశ్రయభూతుడవు కమ్ము అని భావం. ఈ తెలుగు పద్యాన్ని చదవగానే రాజు సంస్కృతంలోని అర్థాన్ని గ్రహించాడు. అది కథలో సంగతి. ఇలాంటిదే అనులోమ విలోమ పద్ధతిలో మరోపద్యముంది (కళాపూర్ణోదయం, 6.172) ఇటువంటి విచిత్ర కవిత్వాలు కవి అర్థం చెప్తేనేగాని బోధపడనివి ఈ కాలంనుంచే కోకొల్లలుగా కవులు సృష్టించసాగారు. విక్రాల శేషాచార్యులు 'సంస్కృతాంధ్ర శ్లిష్ట లక్ష్మీనారాయణ స్తవము' అనే కావ్యం సంస్కృతాంధ్రభాషాశ్లేషలో రాసిన కావ్యం. తెలుగు సంస్కృతం నుండి పుట్టింది అనేంతగా తెలుగు కావ్యాల్లో సంస్కృతభాష కలిసిపోయింది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో ద్విభాషాశ్లేష కేవలం తెలుగు, సంస్కృత భాషల్ని కలిపిచేసిన ప్రయోగాలకే పరిమితం.

**ఆంగ్లాంధ్రశ్లేష :** సరాసరి ఆంగ్లపదాల్ని నేరుగా అజంతాలుగా చేసి తెలుగులో వాడేంత విస్తృతంగా ఆంగ్లపదజాలం తెలుగులో వాడకంలోకి వచ్చేసింది. ఆధునికకాలంలో తెలుగు, ఆంగ్లభాషల కలయికవల్ల ఏర్పడే ద్విభాషాశ్లేషను ఆంగ్లాంధ్రశ్లేష అంటున్నాను. ఉదా: పోస్టల్ వారికీ, మంత్రసానులకూ డెలివరీ చేయడం విధి ('పన్'పరాగ్, 21). ఇందులో డెలివరీ అనే పదానికి ఆంగ్లంలోనే ప్రసవం అనే అర్థంతోపాటు బట్వాడా, అప్పగింత అనే అర్థాలున్నాయి. ఈ వాక్యంలో డెలివరీ అనే ఆంగ్లపదం కేంద్రంగా శ్లేష ప్రయోగం జరిగింది. ఆ పదం తీసి వేరేపదం పెడితే ఆ శ్లేష సాధ్యంకాదు. ఇదే వాక్యాన్ని తెలుగు పదాలతో రాయల్సివస్తే–

1. పోస్టల్ వారికి బట్వాడా చేయడం విధి.
2. మంత్రసానికి ప్రసవం చేయించడం విధి.

పై విధంగా వేరువేరు వాక్యాలతో చెప్పడంవల్ల శ్లేష చమత్కారం రాదు. డెలివరీ అనే పదం జనసామాన్యంలోకి బాగా వెళ్ళిపోయింది కాబట్టి వెంటనే దానర్థం పాఠకుడు/శ్రోత అందుకోగలడు. ఇలాంటిదే "నడి రోడ్ల మీద నెంతయు/జడియక 'కీప్' లెఫ్ట్ అటంచు సైన్ బోర్డుల పె/ట్టెడివారి నేమనవలెన్?/తడపడకయె చెప్పగలవ! ద్వానా శాస్త్రీ!" (ద్వానా శతCome, 51). ఈ పద్యంలో 'కీప్' (keep), లెఫ్ట్ (left) అనే మాటల్ని నామవాచకంగానూ, క్రియగానూ గ్రహించాలి). పై పద్యాన్ని వాక్యాల్లో రాస్తే, 1. ఎడమవైపు (left) ఉంచండి (Keep) 2. వేశ్య (Keep) ఎడమవైపు (left).

రోడ్డు ప్రయాణాల్లో సూచికా ఫలకాలు (Sign boards) సాధారణంగా ఉంటాయి. ఆ ఫలకాలు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తుంటారు. ప్రయాణ బడలిక తీర్చకోడానికి ఎవరైనా ఆగాలంటే ఎడమవైపు ఉండండి/ఉంచండి అనే సూచన చేయడానికి కీప్ లెఫ్ట్ అనే పదం సరిపోతుంది. ఆగాలనుకున్నవాళ్ళు ఎడమవైపు ఆగాలన్నది మనదేశంలో రహదారుల్లోని నియమం. కీప్ అనే పదానికి ఆంగ్లంలో వేశ్య అనే అర్థం ఉంది. అందుకే శతకకర్త నడిరోడ్డుపై ఏమాత్రం భయంలేకుండా (నడి రోడ్ల మీద నెంతయు జడియక) అంటున్నాడు. ఇది భాషాచమత్కారంకోసం చేసిన ప్రయోగం. ఈ

ద్విభాషాశ్లేషలు ఆంగ్లంలోని నానార్థాలతో ఉన్న పదాన్నే తెలుగుభాషలో అన్యదేశ్యంగా స్వీకరించి నేరుగా అవే అర్థాలతో వాడుకోవడంవల్ల ఉత్పన్నమైంది. ఇలాకాక తెలుగు, ఆంగ్ల భాషాలక్షణాల్ని ఒకేసారి వాడుతూ ఆంగ్లాంధ్రశ్లేష ఉన్న ప్రయోగాలూ ఉన్నాయి. ఉదా: 'అప్పు' అయితే 'డౌను' కాక తప్పదు ('పన్'పరాగ్, 22). పై వాక్యానికి మూడు రకాల అర్థభేదాల్ని ప్రతిపాదించవచ్చు.

1. ఎగుడు (అప్పు-Up) అయితే దిగుడు (డౌను-Down) కాక తప్పదు. లేదా పైకి (Up) వెళ్ళాక దిగడం (Down) తప్పదు.

2. అప్పు (రుణం) తీసుకుంటే దిగజారడం (Down) తప్పదు.

వీటితోపాటు పెరుగుట విరుగుట కొరకే అనే సామెతను సమానార్థకంగానూ ఈ ప్రయోగాన్ని తీసుకోవచ్చు. మొదటివాక్యం లోని 'అప్పు' (Up) పదానికి ఆంగ్లంలోని అర్థాన్ని, రెండోవాక్యంలో అప్పు అనే పదానికి రుణం అనే తెలుగు అర్థాన్ని అన్వయించాల్సి ఉంటుంది. అప్పుడు ఒకశబ్దానికి ఈ వాక్యంలో రెండు భాషల్లోని అర్థాల్నీ తీసుకున్నట్టు అవుతుంది. పైగా వాక్య ప్రయోగంలో ప్రత్యేక గుర్తు (')తో శ్లేషార్థాల్ని ఇస్తాయన్న సూచన చేశాడు రచయిత. మరో రకం ప్రయోగం -

**'నీ రిస్టువాచి యుందా?'**
**ఈ రీతిని అడుగ నర్థ మీరు తెలుగు లగున్**
**'నీ రిస్టుకు వాచుండిన**
**దా?"రిస్టది వాచె' ననగ - ద్వానా శాస్త్రీ!**
(ద్వానా శతCome, 50)

ఈ పద్యంలో శ్లేషార్థాలకోసం పాఠకుడు ప్రయత్నం చేయకుండానే శతకకర్తే వివరణ కూడా ఇచ్చేశాడు. నీ రిస్టు వాచి ఉందా అనే వాక్యాన్ని రెండు రకాలుగా రాయవచ్చు.

1. నీ చేతి (Wrist-రిస్టు) గడియారం (వాచి) ఉందా?
2. నీ మణికట్టు (wrist-రిస్టు) వాచి (వాపువచ్చి) ఉందా?

రిస్టు అనే పదానికి ఆంగ్లంలోని అర్థాలు అలాగే తీసుకోవచ్చు. వాచి అనే పదానికి రెండర్థాలు. ఒకటి-వాచ్ అనే ఆంగ్లపదాన్ని అన్యదేశంగా స్వీకరించిన వాచి (Watch-గడియారం) అనే పదం. రెండు- వాచి అంటే తెలుగులో వాపువచ్చి అనే అర్థం. ఈ ద్విభాషాశ్లేష ప్రయోగంలో ఒకసారి ఆంగ్లభాషలో ఉన్న అర్థం (గడియారం), మరోసారి తెలుగు భాషలో ఉన్న అర్థం (వాపు) తీసుకోబడింది. అలా తీసుకుంటేనే ద్విభాషాశ్లేష సాధ్యం అవుతుంది. శతకకర్త వివరణలోని ఉద్దేశ్యం కూడా అదే. వాచి అనేపదం ద్విభాషాశ్లేషకు కారణమైంది. ఈ ఆంగ్లాంధ్రశ్లేషలోని శ్లేషకు ఆస్కారమున్న శబ్దాన్ని నేరుగా ఆంగ్లలిపిలో చూపడం మరోరకం. **"సింహాలకుZooలుండును/ సంహారమె సృష్టియగును సామాన్యంగా"** అని శ్రీశ్రీ ప్రయోగం. ఈ వాక్యంలో 'Zooలు' అనే శబ్దం ద్వారా ఆంగ్లాంధ్రశ్లేష సాధ్యమైంది. బహుశా దీని స్ఫూర్తితోనే హాస్యావధాని శంకరనారాయణ "ఎప్పుడూ 'జూ'లు దులిపేది సింహాలూ, జూ సిబ్బంది" ('పన్'పరాగ్, 33) అనే ప్రయోగం చేశాడు. శ్రీశ్రీ ప్రయోగంలో రెండర్థాలిచ్చే 'జూలు' పదాన్ని పాఠకుడు వెంటనే పట్టుకోవడానికి 'Zoo' అని ఆంగ్లలిపిలో చూపాడు. శ్లేషార్థం ఇచ్చే ప్రయోగాన్ని రెండుభాషాల్లో చూపడం ఓ కొత్తరకం ప్రయోగం. శ్రీRumగం (శ్రీరంగం) శ్రీనివాసరావు (కదంబ ప్రస్థానం, IV-28) అని తన పేరుతోనే ద్విభాషాశ్లేష స్ఫురించే ప్రయోగం చేశాడు శ్రీశ్రీ. ద్విభాషాశ్లేషను లిపిలో వెంటనే చూపకపోవడంవల్ల శ్లేష వెంటనే స్ఫురించని ప్రయోగాలు కూడా ఉన్నాయి. దానికి మరో ఉదాహరణ ఈ కింది సంభాషణ.

శ్రీశ్రీ - నాకో పావురం కావాలి
ఒకరు - అర్ధరాత్రి కాడ పావురం ఎలా తేవడం?
శ్రీశ్రీ - పావురం అంటే Quarter Bottle Rum
(కదంబ ప్రస్థానం, IV-31)

నిజానికి పై ప్రయోగంలో ద్విభాషాశ్లేషకు కారణమైన పావురం అనే పదాన్ని 'పావుRum' అని రాస్తే వెంటనే స్ఫురిస్తుంది. అప్పుడది దృశ్యశ్లేషగానూ కుదురుతుంది. కానీ ఇక్కడ అలాలేదు. మౌఖికభాషలో దాన్ని వెంటనే శ్రోత గ్రహించడం కష్టం అవుతుంది. కాస్త గందరగోళపడతాడు. అప్పుడు ప్రయోక్త ఇచ్చే వివరణతో శ్రోతకూడా మరో అర్థాన్ని గ్రహించడంతో చమత్కారం పండుతుంది.

ఆంగ్లాంధ్రశ్లేష సాధ్యమైన అవసరాల రామకృష్ణారావు జీవితానుభవం ఇది - "ఆ రోజు పోస్టులో నాకు ఒకే పుస్తకం రెండు కాపీలు అందాయి. ఒకటి బౌండుతో ఉన్న, ఎక్కువ ఖరీదున్న, లైబ్రరీ ఎడిషను. రెండోది కూడా అదే పుస్తకం మరో కాపీ సామాన్యులకి అందుబాటు ధరలో చవగ్గా వేశారు. అవి విప్పి చూసుకుంటూంటే మా మరదలు మాణిక్యం వచ్చింది. దానికీ నాకూ క్షణం పడదు. మా వాళ్ళ అదృష్టం బాగుండి మాకిద్దరికీ పెళ్లవలేదు. మొదటి పుస్తకాన్ని తిరగేస్తూ **'ఇదేమిటి 'మేలుప్రతి' అని ఉందీ!'** అని అడిగింది. నేన్చెప్పేది వినే సహనం దానికేదీ! అది వినకుండా చవకబారుది అదో చోట చూపిస్తూ **'ఇక్కడేం లేదే, మరి దీన్ని ఏమంటారు?'** అనడిగింది. **'ప్రింటు మరిచిపోయి ఉంటారు, ఇది 'ఫిమేలు' ప్రతి!'** అన్నాను. అంతే చేత్తో బుక్కు చర్రున విసిరింది. (అంగ్రేజీ మేడీజీ, 37). మేలుప్రతి అంటే మంచిప్రతి (Hord bound) అనే అర్థం ఉంది. ఆ పదం ద్విభాషాశ్లేషకు అవకాశమిస్తోంది. కాబట్టి రామకృష్ణారావు మేలుప్రతిని - Maleప్రతి (పురుషుడికోసం వేసిన పుస్తకం) అనేదాన్ని సమన్వయించి, ఫిమేలుప్రతి (స్త్రీలకోసం వేసిన పుస్తకం) అని చమత్కరించాడు. నిజానికి ఆ పుస్తకం స్త్రీ, పురుషులకు వేరువేరుగా వేసిందికాదు. అట్ట నాణ్యతనుబట్టి ధరలో వ్యత్యాసంతో

వేసిన పుస్తకాలు. ఈ విషయం ఈ సంఘటనలోని మాణిక్యం అనే అమ్మాయికి తెలీదు కాబట్టే ఈ శ్లేష సాధ్యమయ్యింది. ఇదే సంభాషణ ఇద్దరి పురుషులమధ్య జరిగితే నవ్వి ఊరుకునేవాళ్ళు కాబోలు. అదే తక్కువధర ఉన్నప్రతిని ఫిమేలుప్రతి అనడంతో గ్రహీత స్త్రీ కాబట్టి వెంటనే తన కోపాన్ని వ్యక్తీకరించింది. ఇలా సరస సంభాషణలకు కూడా ఆంగ్లాంధ్రశ్లేష పనికొస్తుంది. గ్రహీత ఆ శ్లేషను తీసుకునే సహనం లేకపోతే అదే ప్రయోగం విరసాన్ని కల్గిస్తుంది. ఆంధ్ర, ఆంగ్ల భాషల్ని కలిపిన ద్విభాషాశ్లేష ప్రయోగాల్ని పరిశీలిస్తే కొన్ని సూత్రీకరణలు చేసే అవకాశం ఉంది.

1. నేరుగా ఆంగ్లంలోనే నానార్థాలతో ఉన్న ఆంగ్లపదాన్ని తెలుగుభాషానిర్మితిలో వాడి శ్లేషించడం.

2. తెలుగు వ్యవహర్తతో తెలుగుభాషలో మాట్లాడి, శ్రోతను అయోమయంలో పడేసి ఆంగ్ల భాషాలక్షణం చూపి శ్లేషించడం.

3. ప్రయోగించిన శబ్దానికి తెలుగులో ఒకఅర్థం, ఆంగ్లంలో మరోఅర్థం ఇచ్చే సమాన శబ్దాన్ని వాడి శ్లేషించడం.

4. తెలుగుభాషా ప్రయోగంలో ఆంగ్లార్థాన్ని స్ఫురించే శబ్ద భాగాన్ని ఆంగ్లలిపిలోనూ లేదా ప్రత్యేక చిహ్నాలతో సూచించి శ్లేషించడం.

ఆంగ్ల పదజాలం తెలుగు భాషావ్యవహర్తల్లో పెరుగుతున్నకొద్దీ ఆ ఆంగ్లాంధ్రశ్లేష ప్రయోగాలకు అవకాశం మరింత పెరుగుతుంది.

**తెలుగన్నడశ్లేష :** తెలుగు, కన్నడభాషా లక్షణాలతో ఏర్పడ్డశ్లేషని తెలుగన్నడశ్లేష అంటున్నాను. ద్విభాషాశ్లేషలో మరోరకమూ ఉంది. ఒకే శబ్దం రెండు భాషల్లోనూ ఒకే అర్థాన్ని ఇవ్వడం లేదా వేరువేరు అర్థాల్ని ఇవ్వడం కూడా ద్విభాషాశ్లేషే. అంటే ఒకే శబ్దానికి రెండు భాషల్లోనూ ఒకే అర్థశక్తి ఉండడాన్ని కూడా ద్విభాషాశ్లేషగా గుర్తించాలి. ఇది ఒకే శబ్దంపై ఆధారపడ్డంవల్ల విభిన్న భాషల్లో అర్థసామర్థ్యం ఉండడం వల్ల ఏర్పడుతుంది. నవీన బేబెల్ గోపురము అని సర్దేశాయి తిరుమలరావు రాసిన వ్యాసంలో తెలుగు, కన్నడ భాషల గురించి ప్రస్తావిస్తూ **"అక్కచెల్లెంద్రుగా లిపిలో కనిపిస్తాయి. ధ్వనిలో వినిపిస్తాయి. "స్నానమాడి" అనేది తెలుగూ, కన్నడమూనూ అని మా అమ్మాయి చమత్కారము."** (విమర్శ – ప్రతివిమర్శ, 103) అని తన జీవితంలోని చమత్కార సన్నివేశాన్ని గుర్తు చేసుకున్నారు. పై దానికి ఎలాంటి వివరణా ఇవ్వలేదు. బహుశా పాఠకులు అర్థం చేసుకుంటారని ఊహించారు కాబోలు.

కానీ, తెలుగు, కన్నడం తెలిసినవాళ్ళకే ఆ శబ్దం ఇచ్చే శ్లేషార్థాన్ని అర్థం చేసుకుని ఆనందిస్తారు. అప్పుడే అది ద్విభాషాశ్లేష అవుతుంది. అలాకాక, కన్నడంరాని తెలుగువాళ్ళకు, తెలుగురాని కన్నడంవాళ్ళకీ అందులోని చమత్కారం ఏంటో అర్థం కాదు. దాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ శబ్దానికి తెలుగువాళ్ళు కన్నడ అర్థాన్నీ, కన్నడవాళ్ళు తెలుగు అర్థాన్నీ తెలుసుకోవాలి. ముందుగా 'స్నానమాడి' తెలుగులో అర్థం చూద్దాం. స్నానము+ఆడి = స్నానమాడి అంటే 'స్నానంచేసి' అని అర్థం. కన్నడంలో స్నాన+మాడి అనే రెండు శబ్దాల కలయిక 'స్నానమాడి'. కన్నడంలో దీనర్థం – స్నాన = స్నానము, మాడి = చేసి, స్నానమాడి = 'స్నానంచేసి' అనేదే. తెలుగులో 'స్నానమాడి' అని అన్నా, కన్నడంలో 'స్నానమాడి' అని అన్నా రెండు భాషల్లోనూ 'స్నానంచేసి' అనే ఒకే అర్థాన్ని ఇస్తోంది. కాబట్టి తెలుగు, కన్నడ భాషల్లో 'స్నానంచేసి' అనే అర్థాన్ని సాధించాలంటే 'స్నానమాడి' అనే ఒకేపదం సరిపోతుంది. ఇలా అవుతుంది కాబట్టే **"స్నానమాడి అనేది తెలుగూ, కన్నడమూనూ అని మా అమ్మాయి చమత్కారము."** అనే వాక్యానికి సార్థకత. అంటే ఇక్కడ ఒకశబ్దం, ఒకే అర్థం, రెండు భాషల్లో సమానార్థ సమన్వయం అనే సూత్రీకరణ కుదిరింది.

అయితే ఇందులో ఒక చిన్న భేదాన్ని గుర్తించాలి. 'స్నానమాడి' అనే పదబంధాన్ని కన్నడంలో అలాగే ఉపయోగిస్తారు. కానీ, తెలుగులో గ్రాంథికంలోనే ఈ శబ్దప్రయోగం సాధ్యం. ఆధునిక వ్యావహారికంలో స్నానమాడి అని ఎవరూ వాడరు. దాని బదులు 'స్నానంచేసి' అనే పదబంధమే విస్తృతంగా వాడకంలో ఉంది. అయితే చమత్కారం చేసేటప్పుడు ఇంతటి వివేచన చేస్తూ కూర్చోరు. ఇలా వివేచన చేస్తూ కూర్చుంటే చమత్కారం పుట్టదు.

**తెలుగు, హిందీ ద్విభాషాశ్లేష :** తెలుగు, హిందీ భాషా లక్షణాలతో ఏర్పడే ద్విభాషాశ్లేషను తెలుగుహిందీద్విభాషాశ్లేష అంటున్నాను. ద్వితీయభాషగా హిందీవాళ్ళకు తెలుగు బోధిస్తున్న సందర్భంలో 'మీరు రండి' అని అంటే హిందీవాళ్ళు వెంటనే నవ్వుతారు. వాళ్ళు తిడుతున్నారని అర్థం చేసుకుంటే బూతుప్రయోగం చేస్తున్నామని మనల్ని కొట్టే ప్రయత్నం చేయవచ్చు. రండి అనే పదానికి తెలుగు రమ్ము+అండి, రా+అండి, రండి అని గౌరవార్థంలోనే ప్రయోగం ఉంది. కానీ హిందీలో రండి అంటే 'వేశ్య' అని అర్థం. తెలుగులో 'extra' అనే చలనచిత్రం వచ్చింది (2023). అందులో ఈ కింది సంభాషణలు ఉన్నాయి.

1. మొహంతీ – మొహం (ముఖం) తీ (తీసేయ్–జరుపు) (కాలం 26:26 – 30:31)

2. అభినయ్ – అభి (ఇప్పుడు) నయ్ (కాదు) (కాలం 30:38 – 30:42)

పై వాక్యాల్లో మొహంతీ, అభినయ్ (ఈ పేరు ఇప్పుడు తెలుగుప్రాంతాల్లోనూ పెరిగింది) అనేవి హిందీ ప్రాంతాల్లో ఎక్కువగా పెట్టుకునే పేర్లు. వాటిని మనం నామవాచకాలుగా అదే పేర్లతో తెలుగులోనూ వ్యవహరించవచ్చు. నాయకుడు, నాయకి మధ్యలో మొహంతీ అనే వ్యక్తి రావడంతో నాయకుడు, నాయకిని చూడాలన్న ఉద్దేశ్యంతో మొహంతీని విరిచి తెలుగులో 'మొహం తీ' అని ఉ

చ్చరించినప్పుడు ముఖం (మొహం) పక్కకు తియ్యి (తీ) అనే అర్థం వస్తుంది. అభినయ్ అనేది పేరుతోపాటూ, ఇప్పుడు (అభి), కాదు (నయ్) అని హిందీ అర్థాన్ని ఆ సందర్భంలో సాధించడం ఈ ప్రయోగానికి ప్రయోజనం. అభినయ్ అనేది వ్యక్తినామంతోపాటు ఇప్పుడుకాదు అనే అర్థాన్ని కూడా సాధించడంవల్ల అది తెలుగు, హిందీ ద్విభాషాశ్లేష అవుతుంది. పత్రికల్లో ఈ శ్లేష ఇటీవలికాలంలో పెరుగుతోంది.

ఈ ద్విభాషాశ్లేష వక్తకున్న భాషల సామర్థ్యం, ప్రయోగం మీద ఆధారపడి ఉంటుంది. ఈ ద్విభాషాశ్లేషను రచయిత/వక్త వాడినా పాఠకుడు/ శ్రోత దాన్ని అందుకోవాలంటే ప్రయోగంలోని రెండుభాషల్లో వచ్చే అర్థభేదాలు పాఠకుడు / శ్రోతకు తెలిసుండాలి. ఒక్కోసారి ప్రయోక్త ఉద్దేశ్యంలో రెండోఅర్థం లేకపోయినా గ్రహీత రెండోఅర్థాన్ని గ్రహించవచ్చు. అందుక్కారణం ప్రయోక్త ద్విభాషాశ్లేషకు అవకాశమున్న ప్రయోగం చేయడమే. ద్విభాషాశ్లేష సందర్భంలో ఒక సన్నివేశాన్ని చెప్పుకోవాలి. తిరుమల రామచంద్ర తన జీవితంలో ఎదురైన అనుభవాన్ని ఇలా నిక్షిప్తం చేశారు. "'ఆంధ్రప్రభ' శీర్షికలకు మురిసిపోతున్న సమయంలో మా అమ్మ జానకమ్మగారు ఒక చక్కని ఛలోక్తి విసిరారు. **"ఏమిటిరా, నీవూ మీ పత్రికా? గ్రామీణ మహిళలకు పరపతి సౌకర్యాలు – ప్రభుత్వ సాహాయ్యం.. ఏమిటిరా నా మొహం? పరపతి సౌకర్యం. వాళ్ళే కలిగించుకుంటారు, దానికి ప్రభుత్వ సహాయం కూడానా?"** అని గద్దించారు. నేను తెల్లబోయాను. నా కెప్పుడూ దీనిలో అపార్థం తోచలేదు. ఈమెకు తోచింది. బూతు, అపార్థం లేని శీర్షికలు వుండాలనే సంగతి ఆమె ఆక్షేపణవల్ల గ్రహించాను. 'పరపతి' అనే పదం 'పారుపత్తెం' నుంచి వచ్చిందమ్మా!" అన్నాను. దేని నుంచి వచ్చినా అపార్థం కలిగించేది ఏదైనా నిజమైన అర్థాన్ని పాడుచేస్తుందని ఆమె వాదం. (సింహావలోకనం, 15). పరపతి అనే పదానికి సాధారణంగా అప్పు లేదా గౌరవం అనే అర్థాల్లో వాడుతుంటారు. ఆంగ్లంలో కూడా 'Credit' అనే పదానికి అప్పు, గౌరవం అనే అర్థాలున్నాయి. తెలుగు, సంస్కృతం, ప్రాకృతం, కన్నడం, తమిళం, హిందీ మొదలైన భాషలు తెలిసిన తిరుమల రామచంద్రవంటి పండితునికి ఆ ప్రయోగంలోని రెండోఅర్థం స్వయంగా తట్టలేదు. అమ్మ జానకమ్మ పరపతి అనే పదానికి ఇతరులభర్త (పర=ఇతరుల, పతి=మొగుడు) అని సంస్కృతంలోని అర్థం తీసుకుంది. తెలుగులోకూడా పర, పతి అనే శబ్దాలు సంస్కృతార్థంలో విస్తృతంగానే వాడుతారు. కానీ ఇతరులభర్త అనే అర్థంలో ప్రయోగం తక్కువ. పరసతి అనే పదానికే ప్రయోగాలెక్కువ. జానకమ్మ దృష్టితో చూస్తే **'గ్రామీణ మహిళలకు పరపతి సౌకర్యాలు – ప్రభుత్వ సాహాయ్యం'** అనే వాక్యానికి రెండర్థాలు వస్తాయి.

1. గ్రామీణ మహిళలకు రుణ సౌకర్యాలు – ప్రభుత్వ సాహాయ్యం
2. గ్రామీణ మహిళలకు అన్యులభర్త సౌకర్యాలు – ప్రభుత్వ సాహాయ్యం

మొదటి అర్థంలోనే తిరుమల రామచంద్ర ఆ శీర్షిక పెట్టాడు. కానీ, ఆ వాక్యానికి గ్రామీణ మహిళలకు ఇతరుల భర్తల్ని పొందే సౌకర్యం ఉంది. దానికి ప్రభుత్వమే సహాయం చేస్తుంది అనే అనిష్టార్థం, నిందార్థం, అశ్లీలార్థం వస్తోంది. భాషాప్రయోగం చేసేటప్పుడు వ్యవహర్తలు సరైన అర్థజ్ఞానం ఉండాలని దీన్నిబట్టి అర్థమౌతోంది. ఇలాంటి ద్విభాషాశ్లేషలు వచ్చే భాషాప్రయోగాల్లో జాగరూకత మరింత అవసరం. ఈ ద్విభాషాశ్లేషలు ఫలాని భాషల్లోనే కుదుతుందనే నియంత్రణలేదు. భాషావ్యవహర్త లేదా గ్రహీత ద్విభాషాశ్లేషకోసం ఏ రెండు భాషానిర్మాణాల్నైనా ఉపయోగించుకోవచ్చు. ఈ ద్విభాషాశ్లేషలాగే భాషాలక్షణాలు అనుమతిస్తే త్రిభాషాశ్లేష, చతుర్భాషాశ్లేష, పంచభాషాశ్లేష.. ఇలా ఎన్నిభాషలకైనా అన్వయించి, బహుభాషాశ్లేషను కూడా ప్రతిపాదించి, సమన్వయం చేసి, బహుభాషాశ్లేషల్ని ఏకకాలంలో సాధించే అవకాశం ఉంది. ఇది ఆ భాషాప్రయోగం ఎన్ని భాషల్లో విభిన్నార్థాల్ని ఇవ్వగలదో అనే దాన్నిబట్టి ఆధారపడి ఉంటుంది. తెలుగులో సంస్కృతం–తెలుగు నేపథ్యంతో మొదలైన ద్విభాషాశ్లేష అనేక భాషలకు విస్తరించింది. ఆంగ్లాంధ్ర ద్విభాషాశ్లేషలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ద్విభాషాశ్లేషపై ప్రత్యేకంగా పరిశోధిస్తే గణాంక వివరాలతో సహా మరిన్ని అంశాలు తెలుసుకునే వీలుంది.

**ఆకర రచనలు (Bibliography):**

1. అంగ్రేజీ మేడీజీ, అవసరాల రామకృష్ణారావు, ఎమెస్కో, విజయవాడ, 2005.
2. కళాపూర్ణోదయము, పింగళి సూరన, టీక: మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, అద్దేపల్లి అండ్ కో, రాజమహేంద్రవరము, 1963 (1938).
3. కావ్యప్రకాశము, మమ్మటుడు, వ్యాఖ్య: పుల్లెలశ్రీరామచంద్రుడు, సంస్కృత భాషా ప్రచారసమితి, హైదరాబాద్, 2009.
4. ద్వానా శతcome, పరిమి రామనరసింహం, కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, 2007.
5. 'పన్' పరాగ్, శంకర నారాయణ, మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2002.
6. విమర్శ–ప్రతివిమర్శ, సర్దేశాయి తిరుమలరావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2002.
7. శ్రీశ్రీ ప్రస్థానత్రయం, శ్రీశ్రీ, సంపా: చలసాని ప్రసాద్, ఎం.వి.రాయుడు, మనసు ఫౌండేషన్, బెంగళూరు, 2010.
8. సింహావలోకనం, తిరుమల రామచంద్ర, అభిరుచి తెలుగు సాంస్కృతిక వేదిక, బెంగళూరు, 1986.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11 
UGC CARE List Approved Journal
హైదరాబాద్ సెప్టెంబర్ : 2024


# 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక – లేఖాసాహిత్య ప్రతిఫలనం

**ఆదాల రాజయ్య**, పరిశోధక విద్యార్థి, ప్రాచ్యపరిశోధనా సంస్థ, తిరుపతి. 9492332494

తెలుగులో లేఖాసాహిత్యం ఒక విలక్షణమైన ప్రక్రియ. మూడు దశాబ్దాల ముందు కూడా లేఖలు సమాచార ప్రసారానికి ప్రధానమైన భూమికను పోషించాయి. ఆధునిక సాంకేతిక యుగం భౌతికంగా లేఖలను దూరంచేసింది. ఆ లేఖలే రూపం మార్చుకొని మెసేజస్, ఇ–మెయిల్స్ రూపంలో మనమధ్య తిరుగుతూ ఉన్నాయి. కానీ లేఖలు అందించిన అనుభూతులు, ఆనందాలు అనుపమానమైనవి. వ్యక్తుల మధ్య కలయిక జరగలేని, జరగడానికి వీలుకాని ప్రదేశాలలో లేఖలు మనుషుల మనసులను దగ్గర చేస్తూ బంధాలను కలిపి ఉంచాయి. అందుకే హిందీలో లేఖను **ఖత్ ఆదీ ములాఖత్** అంటారు. అంటే ఉత్తరాలు సగం మనుష్యుల కలయిక అని అర్థం. ఉత్తరాలు ప్రేమను, ఆత్మీయతను పంచుతూ ఒకప్పుడు లోకమంతా విహరిస్తూ ఉండేవి. ఉత్తరాలు రాయడం కూడా ఒక కళగా గుర్తింపబడింది. 'కలం స్నేహం' లాంటి శీర్షికలను పత్రికలు నిర్వహిస్తూ లేఖా రచనను ప్రోత్సహించాయి. అలా లేఖా రచన బహుముఖాలుగా విస్తరించి నేడు దాదాపుగా కనుమరుగైపోయే స్థితి.

లేఖలు వాగ్రూప లేఖలని, లిఖిత రూప లేఖలని రెండు రకాలు. విద్యలేని సామాన్య జనులు వాగ్రూప లేఖలనే తమ దైనందిన జీవితంలో ఉపయోగించేవారు. చెప్పదలచుకొన్న విషయాన్ని మనుషుల ద్వారా చెప్పి పంపడాన్ని వాగ్రూప లేఖ అంటారు. లేఖన సాధనాలు పరిమితంగా ఉన్న రోజుల్లో ఈ పద్ధతినే ఎక్కువగా ఉపయోగించేవారు. తాళపత్రాలు, భూర్జ బోదెలు తయారు చేయడం, ఉపయోగించడం శ్రమతో కూడుకొన్న పని కావడంవల్ల విద్యావంతులు సైతం వాగ్రూపలేఖలకే ప్రాధాన్యమిచ్చేవారు. లేఖన సాధనాలు విరివిగా వాడుకలోకి వచ్చిన తరువాత లిఖిత రూప లేఖలకు ప్రాధాన్యత పెరిగింది.

తెలుగు భాషలో లేఖలు తెలుగు లిపితో పాటుగా ప్రారంభమై ఉంటాయి. తెలుగు భాష క్రీ.పూ 1 వ శతాబ్దంనుండి జనవ్యవహారంలో ఉన్నట్లుగా ఆధారాలున్నాయి. తెలుగు లిపి క్రీ.శ 5 వ శతాబ్ది నుండి అమలులో ఉన్నట్లు గుణగ విజయాదిత్యుని శాసనాల ద్వారా తెలుస్తుంది. ప్రపంచంలో మొదటి లేఖ మెసపటోమియా నాగరికతలో భాగంగా సెమటిక్ భాషలో ఎండు మట్టిపలకపై రాయబడింది. ఇది క్రీ.పూ 1000 సంవత్సరాల నాటిది. రాజులు వేయించిన శిలా శాసనాలు, తామ్రశాసనాలు కూడా ఈ కోవకే చెందుతాయి. కవులు కావ్యాలలో వర్ణించిన సందేశాలు, రాయబారాలు కూడా లేఖలే. మేఘసందేశం వంటి సందేశ కావ్యాలు కూడా లేఖల కోవకే చెందుతాయి. భారతీయ సాహిత్యం ప్రకారం మొదటి పోస్టుమేన్‌గా నారదమహర్షిని మనం పేర్కొనవచ్చు. అక్బర్ కాలంలో భారత దేశంలో


Registered No. M. 147.

శ్రీ

అముద్రితగ్రంథచింతామణి.

మాసపత్రిక.

ఇది

పూండ్ల రామకృష్ణయ్యచేఁ బ్రకటింపఁబడుచున్నది.

సంపుటము. 16) నెల్లూరు - జూన్ - 1903 (సంచిక 6.

తపాలా వ్యవస్థ ప్రారంభమైంది. కాగితం వాడుకలోకి వచ్చిన తర్వాత, బ్రిటీష్‌వారి పాలనా కాలంలో తపాలా వ్యవస్థ భారత దేశంలో విస్తృతంగా ఉపయోగించబడింది. లేఖలు సాధారణ, లౌకిక విషయాల చేరవేతకు ఉపయోగించబడినా వాటిలోని సాహితీ విషయాలు, విలువలనుబట్టి లేఖలను కూడా సాహిత్యంగా గుర్తించడం జరుగుతుంది. తెలుగుభాషలో ఆధునిక లేఖాసాహిత్యం సి.పి.బ్రౌన్ గారితో మొదలైందని చెప్పవచ్చు. వీరు ఆనాటి కవులు, సాహితీ దిగ్గజాలతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఎన్నో సాహిత్య విషయాలను నేటితరానికి అందిస్తున్నాయి. సి.పి.బ్రౌన్ తర్వాత కందుకూరి, గురజాడ, త్రిపురనేని రామస్వామి చౌదరి, కట్టమంచి రామలింగారెడ్డి, దువ్వూరి రామిరెడ్డి, చలం, శ్రీశ్రీ లేఖలను అధ్యయనం చేస్తే సమకాలీన దేశ పరిస్థితులు, తెలుగు భాషాస్వరూపం, సాహిత్యాంశాలు మనకెన్నో తెలుస్తాయి.

1885వ సంవత్సరం జూన్ నెలలో భర్తృహరి సుభాషితాలలోని "విద్యనిగూఢ గుప్తమగు విత్తము" అనే పద్యంతో ప్రారంభమైన సాహిత్య పత్రిక అముద్రిత గ్రంథ చింతామణి. ఇది మాసపత్రికగా ప్రారంభమై 1904వరకు నిర్విఘ్నంగా సాగింది. పూండ్ల రామకృష్ణయ్య 19 సంవత్సరాలు ఈ పత్రికను నడిపారు. మొదట ఒడయరు వీరనాగయ్యకవి, తరువాత కొప్పిశెట్టి రామానుజరావు నాయుడుల సహకారంతో ఆయన ఈ పత్రికను నడిపారు. అముద్రితగ్రంథ చింతామణి ప్రాచీన కావ్యాలను పరిష్కరించి ముద్రించడమే కాకుండా, ఆనాటి మహాపండితుల వాదోపవాదాలకు వేదికగా నిలిచింది. ఎన్నో సాహిత్య సమస్యలకు పరిష్కారాన్ని చూపింది. ఈ పత్రికలో వేదం

వేంకటరాయశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, ధర్మవరం కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, మండపాక పార్వతీశ్వరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం పంతులు, నేలటూరి పార్థసారథి అయ్యంగార్ లాంటి రచయితలు తమ లేఖల ద్వారా వాదోపవాదాలు చేసేవారు. అముద్రిత గ్రంథ చింతామణి సాహిత్య పత్రికగా కంటే వాగ్వాదాల వేదికగా ఎక్కువగా పేరు పొందింది.

ఇది కేవలం సాహిత్య విషయాలకు మాత్రమే పరిమితమైన పత్రిక. ముద్రణా సౌకర్యాలు అత్యంత ఖరీదుగా ఉన్న రోజుల్లో ఈ పత్రికను 19 సంవత్సరాలు నడపడం అసాధ్యమైనా పూండ్ల రామకృష్ణయ్య పట్టుదల వల్ల సుసాధ్యమైనది. తాళపత్ర గ్రంథాలను పరిష్కరించి శుద్ధ ప్రతిని తయారుచేయడం చాలా శ్రమతో కూడుకున్న పని. నాలుగైదు ప్రతులు లభిస్తే తప్ప శుద్ధ ప్రతిని తయారుచేయడం సాధ్యం కాదు. ప్రతి ప్రతిలోనూ కొంత భాగం శిథిలమై ఉండడం అందుకు కారణం. అముద్రిత గ్రంథ చింతామణిలో 20 ప్రాచీన గ్రంథాలను పరిష్కరించి ప్రచురించడం జరిగింది.

ఈ పత్రిక ద్వారా ప్రకటించబడిన గ్రంథాలు ఆనాటి విద్యార్థులకు పాఠ్యగ్రంథాలుగా కూడా ఉండేవి. ఆంగ్ల విద్యా విధానం ప్రారంభించబడడం వల్ల తెలుగు అప్రధానమై పోయింది. అందువల్ల ఆంగ్లసాహిత్యం నుండి గ్రహింపబడిన ప్రక్రియలలో తెలుగు సాహిత్య రచన ప్రారంభమైంది. గ్రాంథిక భాష ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో రచనలు చేయడానికి ఆటంకంగా మారింది. ఈ క్రమంలో ఎన్నో సందేహాలు, వివరణలు, పరిష్కారాలు చోటు చేసుకోవడం సర్వసాధారణం. ఆ పరిస్థితులలో పత్రికగా అముద్రిత గ్రంథ చింతామణి తన బాధ్యతను చక్కగా నిర్వర్తించింది. పండితుల మధ్య చర్చలకు వేదికగా నిలిచింది. సాధు, అసాధు రూప నిరూపణకు అవకాశం కలిగించింది.

పత్రిక అనగానే వార్తలను ప్రచురించే సాధనంగానే భావించడం జరుగుతుంది. కాని అముద్రిత గ్రంథ చింతామణి ప్రాచీన సాహిత్య పరిరక్షణకు, భాషా, సాహిత్యసేవకు తోడ్పడి తరువాతి తరం పత్రికలకు మార్గదర్శకంగా నిలిచింది. పాఠ్యగ్రంథాల కోసం అముద్రిత గ్రంథ చింతామణి ప్రతులను ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం వెతకటం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ఈ పత్రికలోని సమీక్షలను చదవడం ద్వారా గ్రంథాలపై అవగాహన పెంచుకోవడం మంచి పాఠ్య పుస్తకాలను నిర్మించుకోవడం ఈ పత్రిక వల్లే సాధ్యమయ్యింది.

బందరు నుండి కృష్ణా పత్రిక, చెన్నపట్టణం నుండి ఆంధ్రపత్రిక, తెలంగాణా నుండి గోల్కొండ పత్రిక లాంటి పత్రికలకు వేలలో చందాదారులు ఉండడం వల్ల వీటి నిర్వహణ చాలా సులువుగా సాగిపోయేది. కానీ అముద్రిత గ్రంథచింతామణి లాంటి సాహిత్య పత్రికలు సాహిత్య పోషకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి మనుగడ సాగించాల్సి వచ్చేది. అందువల్ల చాలా పత్రికలు రెండు, మూడు సంవత్సరాలకే కనుమరుగైపోయేవి. ఆంధ్రభాషా సంజీవని, సౌందర్యలోకం పత్రికలు ఈ కోవకు చెందినవే. కాని 19 సంవత్సరాల పాటు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఈ పత్రికను నిర్వహించడం కత్తిమీద సాము లాంటిదే.

సాహిత్యం కోసం అముద్రిత గ్రంథ చింతామణి పత్రిక తోడ్పడిన విధానం తరువాతి పత్రికలకు మార్గదర్శకం అయ్యింది. అనేక సాహిత్య పత్రికలు తెలుగు భాషను సుసంపన్నం చేయడానికి ప్రయత్నాలు చేశాయి. గట్టుపల్లి శేషాచార్యులు మద్రాసు నుండి నడిపిన 'శశిరేఖ' పత్రిక, వనప్పాకం శ్రీనివాసాచార్యులు నడిపిన వైజయంతీ పత్రిక, ఏలూరు నుండి భుజంగరావు నడిపిన 'మంజువాణి' పత్రిక, పేర్రాజు సారథ్యంలో నడిపిన 'రాజహంస' పత్రికలు పూర్తి సాహిత్య పత్రికలుగా నెలకొల్పబడడానికి అముద్రిత గ్రంథ చింతామణి పత్రిక దోహదం చేసింది. 19వ శతాబ్దం రెండవ దశకంలో కోకొల్లలుగా సాహిత్య పత్రికలు తెలుగు భాషను సుసంపన్నం చేశాయి. కాని అముద్రిత గ్రంథ చింతామణి చేసినంత సాహిత్య సేవ మరే ఇతర పత్రిక చేయలేకపోయింది. ఈ పత్రిక ప్రభావం వల్లనే ప్రఖ్యాత కృష్ణా పత్రికలోనూ సాహిత్య సమాచారం పొందుపరచడం జరిగింది.

అముద్రిత గ్రంథచింతామణి పత్రికలో లేఖారూప వాదోపవాదాలు సూటిగానూ, నిష్పక్షపాతంగానూ జరిగేవి. నెల్లూరు జిల్లా వేంకటగిరి సంస్థానంలో కవి అయిన బిరుదురాజు శేషాద్రిరాజుగారు నాటి సంస్థానాధీశుడు ముద్దుకృష్ణ యాచేంద్రకు కుమారసంభవం కావ్యాన్ని అంకితమిచ్చాడు. అందులోని ప్రార్థనా శ్లోకంలో గుణదోష విచారణలో శ్రీ పూండ్ల రామకృష్ణయ్యకు, తిరుమలశెట్టి జగన్నాథరావుకు, మండపాక పార్వతీశ్వరశాస్త్రికి నడుమ జరిగిన సంవాదాలను గమనిస్తే వారు లేఖలను ఎంత సమర్థవంతంగా, సాహిత్య ఉపకరణంగా వాడారో తెలుస్తుంది. వేదం వేంకటరాయశాస్త్రి గారు రచించిన 'ప్రతాపరుద్రీయం'లో "సరదంగాలుకాద", "పుత్ర్", "వెయ్యాఋ"లాంటి పద ప్రయోగాల విషయంలో వేదం వారికి, పూండ్ల రామకృష్ణయ్యకు, రాయదుర్గం నరసయ్య శాస్త్రికి, ధర్మవరం కృష్ణమాచార్యులుకు పదవిభజన విషయంలోనూ, వ్యాకరణ విషయంలోనూ జరిగిన చర్చ, వారు లేఖలను ఉపయోగించుకున్న తీరును తెలియజేస్తుంది. దీనినిబట్టి సాహిత్య కాంక్ష పెంపొందించడంలోనూ, లేఖా సాహిత్యానికి ప్రాచుర్యం కలిగించడంలోనూ అముద్రిత గ్రంథ చింతామణికి ఉన్న స్థానం అర్థమవుతుంది.

అముద్రిత గ్రంథ చింతామణి నిర్వాహకులైన పూండ్ల రామకృష్ణయ్యకు ఆకాలంనాటి ప్రముఖ కవులు, రచయితలు నిరంతరం ఎన్నో లేఖలను రాసేవారు. దానిపై వారి సమాధానాలు కూడా లేఖల్లో దొరుకుతున్నాయి. వారు ఏ విషయాన్ని అయినా సూటిగా స్పష్టంగా వ్యక్తం చేసే వారన్న విషయం లేఖలలో తెలుస్తుంది.

**'శశిలేఖ'** అనే వ్యాసాలను చదివి వాటిపై స్పందిస్తూ **"వ్యాసంలో నేను గనిన విషయము సున్నా"** అని రాశారు. దీనినిబట్టి వారు ఎంత నిక్కచ్చిగా సమాధానం రాశారో అర్థమవుతుంది. మరో సందర్భంలో పద్యాలు రాసిన వారిని మెచ్చుకుంటూ **"పద్యములు రసభరితములయి యున్నవి"** అని సమాధానం ఇచ్చారు. దీనిని బట్టి ఆయన మెచ్చుకోవడానికి గాని లేదా విమర్శించడానికి కానీ వెనుకాడని స్వభావం కలవారిగా కనిపిస్తారు.

ఆయన అముద్రిత గ్రంథ చింతామణి కోసం ఎంతగానో పాటుపడ్డారు. ఆయన కుమారుడు ముందురోజు మరణిస్తే తరువాత రోజే ఆయన ప్రూఫ్ చూసి పంపించడం జరిగింది. దాని గురించి ఆయన వేదం వెంకటరాయశాస్త్రికి రాసిన లేఖలో **"చచ్చిన మరునాటి మధ్యాహ్నమే ఇప్పుడు మీకు పంపి యుండే విక్రమార్క ప్రూఫ్ చూచి ముద్రాక్షరశాలకు పంపినాను"** అని రాశారు. ఆయన తన కుమారుడు మరణించినా, పనిని మాత్రం పక్కన పెట్టకుండా నిర్వహించిన రాక్షసుడిగా తెలుస్తుంది.

అముద్రత గ్రంథ చింతామణి అనేక రకాలైన సాహిత్య సమస్యలకు పరిష్కారం సూచించినట్లుగా తెలుస్తుంది. శమంతకము, స్యమంతకము పదాలలో ఏది సరైంది అనే దానిని గురించి లేఖలలో ప్రముఖంగా చర్చ జరిగింది. తిక్కన మౌసలపర్వంలో శమంతకము అని రాశారని వీరు పేర్కొన్నారు. మరో సందర్భంలో పుత్ర, మిత్ర శబ్దముల ద్విత్వం గురించి కూడా చర్చ జరిగింది. పుత్ర, మిత్ర శబ్దాలకు ద్విత్వం ఉండ వలెనా? లేదా? అనే విషయంపై వీరు చర్చ చేసి అవసరం లేదని చివరకు తేల్చడం జరిగింది. వ్యాకరణం ముఖ్యమా? ధర్మశాస్త్రం ముఖ్యమా? అనే విషయంలో వ్యాకర్తలు, ధర్మశాస్త్రాన్ని కాకుండా వ్యాకరణాన్ని మాత్రమే ప్రధానంగా తీసుకోవాలని, కవులు, రచయితలు శాస్త్రాన్ని ప్రామాణికంగా అనుసరించాలని చెప్పడం కనిపిస్తుంది. మరో సందర్భంలో ఒక కావ్యానికి ఎప్పుడు ఖ్యాతి లభిస్తుందనే అంశంపై చర్చ జరిగింది. దానిని గురించి ఒకరు కావ్యరచన చేసి మరణిస్తే, ఎక్కువ ఖ్యాతి లభిస్తుందని వీరికి లేఖ రాయగా, ఆ సమయంలో **"చచ్చినచో గ్రంథమునకు ప్రాశస్త్యము వచ్చునట. ఈ మాటలు విని యిప్పటి వారు హేళనము చేయుచున్నారు"** అని లేఖలో రాశారు. ఇది ఒక దుర్మార్గమైన ఆలోచనని, ఎవరూ ఇలాంటి ఆలోచన చేయకూడదనేది వీరి మనస్తత్వంగా కనిపిస్తుంది.

పత్రికలలో లేఖల ద్వారా సమస్యకు పరిష్కారాన్ని కనిపెట్టడాన్ని వీరే ప్రారంభించారు. **"భూసురుండవు సేతుపతి సుతుండ"** అనే ఒక వాక్యాన్ని ఇచ్చి పద్యంలో దానిని పూరించమని పత్రికా ముఖంగా లేఖను ప్రచురించారు. దానికి ఆ రోజుల్లోనే కోకొల్లలుగా సమాధానాలు వచ్చాయి. ఈ విధంగా పత్రికల పట్ల ప్రజలకు సానుకూల దృక్పథాన్ని కలిగించడానికి ఎంతగానో కృషి చేసినట్లు, లేఖలు రచించడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించినట్లు తెలుస్తుంది. రాను రాను ప్రజలలో వేగవంతమైన ఆలోచనలు పెరుగుతున్నాయని వీరు భావించారు. లేఖలలో చర్చలు జరుగుతున్న సందర్భంలో కొందరు మూడంకాల నాటకాలు రచిస్తే బాగుంటుందని సమాధానం ఇవ్వడం జరిగింది. దాని గురించి వీరు స్పందిస్తూ **"మూడంకముల నాటకములు ఉండవచ్చునా, అన్యాయముగా నున్నది"** అని రాశారు. దీనిని బట్టి నాటక లక్షణాలను మార్చడానికి వీరు వ్యతిరేఖిగా కనిపిస్తారు.

వీరు రాసిన లేఖలలో ఆ కాలంనాటి అనేక విషయాలు మనకు లభిస్తున్నాయి. ముఖ్యంగా ఆ కాలపు స్త్రీలు ఉపయోగించే బంగారు ఆభరణాలను గురించి కూడా లేఖలలో కనిపిస్తుంది. కుచ్చులు, చామంతిబిళ్ళ, పగడాల తాళము, నానుపతకము లాంటి ఆభరణాలను గురించి వీరు అముద్రిత గ్రంథా చింతామణి లేఖలలో ప్రస్తావించారు. అలాగే వీరి లేఖలలో సామెతలు, జాతీయాలు కోకొల్లలుగా లభిస్తున్నాయి. **'గుండ్రాయి దాచిన పెళ్ళి నిలుచునా', 'గంతకు తగిన బొంత', 'అడిగిన దోషమయ్యెను అడగకున్న మోసమయ్యను', 'చెట్టు చెడు కాలమునకు కుక్క మూతి పిందెలు పుట్టినట్లు', 'ఈత చెట్టు కింద ముసలివాని'** వలె లాంటి సామెతలు **'తాటాకు చప్పుళ్ళు'** లాంటి జాతీయాలు వీరి లేఖలలో కనిపిస్తున్నాయి. అలాగే లేఖలను పద్య రూపంలో రాసిన సందర్భం కూడా కనిపిస్తుంది. గోపాలకృష్ణ యాచేంద్రకు, పూండ్ల రామకృష్ణయ్య పద్యలేఖను రాసినట్లు కనిపిస్తుంది. లేఖలలో కూడా పద్యరూపంలో రాయడం వీరి ప్రత్యేకత.

సాహిత్యంలో లేఖల వినియోగాన్ని పెంచి, సాహిత్యసేవకు లేఖారచనను సాధనంగా చేసిన అముద్రిత గ్రంథచింతామణి 1904వ సంవత్సరంలో తన ప్రస్థానాన్ని ముగించింది. లేఖా సాహిత్యం కొనసాగడానికి తరువాత కాలంలో వేగంగా విస్తరించడానికి ఈ పత్రిక పునాది వేసింది. లేఖా సాహిత్యం ఆ తరువాత శాఖోపశాఖలుగా విస్తరించి కథలు, నవలల రూపంలో కూడా రచించడం జరిగింది. మరింత ఎక్కువ మంది సాహిత్య రచనకు లేఖా ప్రక్రియను ఎంచుకోవడం జరిగింది. గోపీచంద్ రచించిన పోస్టు చేయని ఉత్తరాలు, శారద లేఖలు లాంటి సాహిత్య సృజనకు అముద్రిత గ్రంథ చింతామణి పునాది వేసింది. అముద్రిత గ్రంథ చింతామణి వెలువడిన శతాబ్దం తరువాత అది నిర్వర్తించిన సాహిత్య సేవ నేటికీ వెలుగులు విరజిమ్ముతూ ఉంది. నేడు దినపత్రికలలో సాహిత్యంపై ఒక ప్రత్యేకమైన పేజీని సంపాదకులు రూపొందించడానికి, ఆదివారం అనుబంధాలలో సాహిత్య విషయాలు పొందుపరచడానికి, లేఖలను పత్రికలలో ప్రచురించడానికి అముద్రిత గ్రంథ చింతామణి వేసిన పునాది ప్రధాన కారణం. ఆ ఖ్యాతి ఆ పత్రికకు, దానిని నడిపిన పూండ్ల రామకృష్ణయ్య గారికి చెందుతుంది.

**ఆధార గ్రంథాలు**

1. పూండ్ల రామకృష్ణయ్య – సాహిత్య లేఖలు
2. మలయశ్రీ – లేఖా సాహిత్యం

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11 (42) హైదరాబాద్ సెప్టెంబర్ : 2024

# బెల్లి యాదయ్య కవిత్వంలో ప్రపంచీకరణ వ్యతిరేకత

**ఎం. విప్లవ్ కుమార్,** పరిశోధకుడు. ఫోన్: 9515225658

ప్రపంచవ్యాప్తంగా సామాజికార్థిక, రాజకీయ పరిణామాలు నిరంతరం మారుతుంటాయి. ఆ మార్పులు అమెరికాలాంటి సామ్రాజ్యవాద దేశాలకు అనుకూలంగా ఉంటాయి. ప్రపంచ దేశాల ఆర్థిక విధానాలన్నీ కొన్ని కార్పొరేటు వ్యవస్థల కోసం నిర్మాణమవుతాయి. పేదరికం కారణంగా నలిగిపోతున్న దేశాలకు, విదేశీ ప్రత్యక్ష సహాయం పేరుతో కార్పొరేటు వ్యవస్థలు, ప్రపంచ బ్యాంకు రూపంలో రుణాలు ఇస్తాయి. ఈ సహాయానికి ప్రతిగా ఆ దేశం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తూ తీర్మానాలు, చట్టాలు చేస్తాయి. ఇదే అదనుగా కార్పొరేట్ పరిశ్రమలు అన్నీ ఆ దేశాల్లో వాలిపోయి, అక్కడి మానవ వనరులను, సహజ వనరులను కారు చౌకగా పొంది, అక్కడే అధిక ధరలకు వస్తువులను అమ్ముకొని, డబ్బును తమ దేశాలకు తరలించుకుంటాయి. ఇటువంటి కుట్రలకు పెద్దన్న అమెరికా. ఈ అమెరికా కార్పొరేటు వ్యవస్థలు పుట్టించినదే ఈ ప్రపంచీకరణ. దేశ సరిహద్దులు అనే అడ్డంకి లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేయడం ప్రపంచీకరణ కిందికి వస్తుంది. దీన్నే ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యంపై పరిశోధన చేసిన సి. కాశీం రాజకీయార్థిక పరిభాషలో **"ఎల్లలు లేని వ్యాపారం పేరుతో ప్రపంచ ప్రజలను మార్కెట్ మాయాజాలం లోకి లాగటమే ప్రపంచీకరణ"** అంటాడు. (తెలంగాణ సాహిత్యం. 2015: 52) ప్రపంచీకరణలో ఆధిపత్య దేశాలకు అనుకూలంగా విధాన నిర్ణయాలు జరుగుతాయి. ఈ పరిస్థితి పేద దేశాలకు తప్పనిసరి పరిస్థితి అయిపోతుంది. కార్పొరేటు శక్తులే యూరప్ దేశాల అభివృద్ధి నమూనానే, ప్రపంచ దేశాల అభివృద్ధి నమూనాగా ప్రచారం చేస్తారు. ఇటువంటి నూతన పరిణామాలు భారతదేశంలో 1980ల లోనే ప్రచారంలోకి వచ్చినా, అవి 1990లలో విధాన నిర్ణయాల్లోకి వచ్చాయి.

భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచీకరణ విధానాలకు ఇక్కడి ప్రభుత్వాలు ఎర్ర తివాచీ పరిచాయి. పెట్టుబడి దారులకు లబ్ధి చేకూరే విధంగా ఆర్థిక విధానాలను నెలకొల్పుతున్న క్రమంలో వ్యవస్థలన్నింటినీ ప్రయివేట్ చేయడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఇవ్వడం వంటి పరిణామాలు జరిగాయి. ఈ క్రమంలో కవులు, కళాకారులు ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ సాహిత్యాన్ని సృష్టించారు. గ్రామీణ జీవన నేపథ్యంలో నుంచి వచ్చిన కవులు గ్రామాల్లోని విలువలు పతనమవ్వడం, వృత్తులు నశించడం వంటి వాటిని చిత్రిస్తూ వచ్చారు. కులవృత్తుల నేపథ్యంలో నుంచి వచ్చిన కవిగా బెల్లి యాదయ్య ప్రపంచీకరణ వ్యతిరేక భావాలను తన కవిత్వంలో పొందుపర్చారు. కవిగా, అందునా బీసీ కవిగా ప్రపంచీకరణ ను అర్థం చేసుకున్న విధానాన్ని ఈ కవిత్వంలో గమనించవచ్చు.

**బెల్లి యాదయ్య కవిత్వం - ప్రపంచీకరణ వ్యతిరేకత**

సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థల మీద పట్టు సాధించడానికి, మూడో ప్రపంచ దేశాలను దోచుకోవడానికి అమెరికా చేసిన ప్రయత్నమే ప్రపంచీకరణ. ఈ ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ, దేశీయ పద్ధతిలో ఇక్కడి నేలపైన అనురాగంతో ప్రకటించిన ఆగ్రహ ప్రకటన యాదయ్య కవిత్వంలో ప్రధాన వస్తువైంది. సరళీకరణ, ఆర్థిక విధానాల ప్రభావంలో మనుషుల అవసరాలకోసం వస్తువులు కాకుండా, సరుకులు కొనడానికే మనుషులు పుట్టారు అనేంతలా మార్కెటీకరణ జరగడాన్ని కవి బెల్లి యాదయ్య జీర్ణించుకోలేక పోయాడు. ధ్వంసమవుతున్న మానవ విలువలు, మానవీయ స్పందనలను కాపాడ్డానికి ఆరాటపడుతున్నాడు. అమెరికన్ సామ్రాజ్యవాదం చిదిమేస్తున్న అమాయకపు పిల్లల నవ్వులను నిలబెట్టడం కోసం బెల్లి యాదయ్య తపిస్తున్నాడనే విషయం ఆయన రాసిన ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వాన్ని పరిశీలిస్తే మనకు స్పష్టంగా అర్థమవుతుంది.

**"రోజులు మారాయని మీకు తెలుసు**
**మార్కెట్ ఊళ్ళో ఓ మూలాన ఉండడం మాని**
**సరాసరి ఇంట్లో కొచ్చి / వికారాలు సృష్టించడం మీకు తెలుసు"**
(తర్జుమా. 2014: 29)

ఇక్కడ కవి రోజులు మారాయంటే అర్థం మార్కెట్ శక్తులు, మల్టీనేషనల్ కంపెనీలు రోజులను తమకు అనుకూలంగా మార్చుకున్నాయని అర్థం. పెట్టుబడిదారులు పుట్టిన రోజులు, పెళ్లిరోజులు, మదర్స్ డే, ఫాదర్స్ డే, ఫ్రెండ్ షిప్ డే, లవర్స్ డే ఇలా ప్రతి దానికి ఓ రోజును, పండుగను క్రియేట్ చేశారు. మనకు వినిమయ తత్వాన్ని అలవాటు చేశారు. ఎంతగా అంటే మనుషుల అవసరాలకోసం వస్తువులు కాకుండా, సరుకులు కొనడానికే మనుషులు పుట్టారనేంతగా వినిమయ సంస్కృతిని అభివృద్ధి చేశారు. దానివల్ల మార్కెట్ అనేది ఊళ్ళో ఒకచోట ఉండడానికి బదులుగా టీవీ, వార్తాపత్రిక తదితర మీడియా ద్వారా సరాసరి ఇంట్లోకి వచ్చిందంటాడు బెల్లి యాదయ్య. కనుకనే ఇవాళ సెల్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు బెడ్ రూములో కూర్చొనే కరివేపాకు నుంచి కారు వరకు అన్ని కొనిపించే వ్యాపారి తంత్రంలో చిక్కుకున్నాం. సంఘజీవి, సమూహ జీవి అయిన మనిషి ఇలా ఏకాంతమయితే వికారాలు పుట్టుకొస్తాయంటాడు బెల్లి యాదయ్య.

**"ఎవరన్నారు?**
**నేను ఆఫీసు చెత్త ఏ.సీ. నడుమ ఆరు రోజులు చెమటోడ్చి**
**ప్యాకేజి దిరిసెన పువ్వును డెబిట్ కార్డుగా పట్టుకుని**
**రిసార్ట్ కాలువల్లో వారాంతపు సుఖంగా**
**మురికి పడడానికే పుట్టానని"**
**(శీర్షిక: నుడికారం, మా ఊరు అట్లా లేదు, పూత. 2015:78)**

ఈ కవితతో నాణ్యమైన జీవితం అనుభవిస్తూ, సుఖంగా బతుకుతున్నామని నకరాలు పోయేవారి మత్తు వదిలించాడు. ఏసీ లైఫ్ కోసం దుక్కిటెద్దులా చెమటోడ్చే వారి, ఆరాటపడేవారి చెంప చెళ్లు మనిపించాడు. స్వచ్ఛమైన గాలిని మించినదేది కాదని, ఏసీ ని లగ్జరిగా కంటే చెత్తగా, అనారోగ్యంగా భావిస్తున్నాడు కవి. పచ్చని చెట్ల పైరగాలి ఆస్వాదిస్తూ ఆనందంగా పనిచేసిన కవి బెల్లి యాదయ్య. కాబట్టి ఆయనకు ప్రాణవాయువు స్వచ్ఛదనం విలువ తెలుసు. దిరిసెన పూవు రెక్కు ఒక్కొకటిగా గాలికి రాలిపోయినట్లే వీకెండ్‌లో డెబిట్ కార్డులోని డబ్బులు రాలిపోతాయి. అలాంటి పైకి సల్లగా కనిపించే సాఫ్ట్‌వేర్ వృత్తి రెండు రోజుల ఆనందంకోసం ఆరు రోజులు కష్టపడి, శారీరకంగా, మానసికంగా మురికి పడడం యాదయ్య సుతారం మంచిది కాదంటున్నాడు. ఎందుకంటే ఇక్కడ కంపెనీలో పెట్టుబడిదారుడు ఇచ్చిన శాలరీని, మనకు తెలియ కుండానే రిసార్ట్‌లో లాగేసుకుంటున్నాడు. అక్కడ శ్రమించి వాడికి లాభం, అదనపు లాభం ఇవ్వడంతో పాటు, ఎంతో కొంత జీతం రాళ్లలో నుంచి కూడా వీకెండ్ ఆనందంలో వాడికే వాటా ఇస్తున్న బతుకు ఎవరికోసం బతుకుతున్నట్టు? అని తనకు తానే ఎవరన్నారు అని ప్రశ్నవేస్తూ, ఆ ప్రశ్నల ముడి విప్పుతాడు.

**"ఎప్పుడు మనం మనుషులం కాకుండా**
**మార్కెట్ కేంద్రకాలమైనామో**
**ఎప్పుడు మనం సౌందర్యాన్ని**
**సంపాదనా క్షేత్రంగా ఎంచుకున్నామో**
**ఎప్పుడు మనం ఆకర్షణను అదనపు పెట్టుబడిగా స్వీకరించామో**
**ఎప్పుడు మనం ఆడతనానికి హారతిస్తూ వచ్చామో**
**అప్పుడే పెనుఘాతుకాలకి బీజం పడి బ్రహ్మరాక్షసత్వం రెక్కవిచ్చి**
**స్నేహితులే శకారులయ్యే దురంకాలకి మేలితెర లేచింది**
**విషం గుడ్లను పొదిగి విశ్వరూపం దాల్చనున్నాయి**
**కేబుల్ డైనోసార్లు**
**వెర్రి కోరలు సాచి వెక్కిరించనున్నాయి ఫ్యాషన్ కార్నర్లు**
**అయినా మనం ఏ మాత్రం తగ్గేదిలేదు**
**సాఫ్ట్ పోర్నో ధమ్ రిథమ్ ఆపేదిలేదు"**
**(శీర్షిక: ఎపిసోడ్, నేను గొర్రెల్ని కాస్తుంటాను, పుట.9, 2011)**

బెల్లి యాదయ్య రాసిన ఈ కవిత ముందుగా ఎపిసోడ్ శీర్షికన జూలై 5, 2004 న ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. ఇది రాసిన ముందు



పదేళ్ల కాలమే కాదూ, దాదాపు రాసిన కాలం కూడా అమెరికా కనుసన్నల్లో నడిచే ప్రపంచ బ్యాంక్ సిఇవోను అని చెప్పుకు తిరిగిన చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలిస్తున్న కాలం. పత్రికలో అచ్చు అయ్యే రెండు నెలల ముందు మే 13 వరకు చంద్రబాబు అమెరికా, ఫ్యాషన్, వెస్ట్ రన్, టూరిజం, కాస్మోటిక్ క్లబ్, ఇంటర్నెట్ హబ్, సాఫ్ట్‌వేర్ కల్చర్ నూరిపోస్తున్న కాలం. బిల్ క్లింటన్ ఆగమనాలు, సైబర్ బిల్డింగ్ నిర్మాణాలు అంటూ విద్యార్థులను, యువతను రంగుల ప్రపంచం మోజులోకి దింపుతున్న వాతావరణం. **"దాదాపు జీవితంలోని అన్ని పార్శ్వాలను స్పృశించే అత్యంత సంక్లిష్టమైన క్రమాన్నే ప్రపంచీకరణ"** అంటాడు డా. మురళి. (ప్రపంచీకరణ – పదేళ్ల అనుభవాలు, పుట.48, 2001) అందుకే కాబోలు 1994, 1997, 1999, 2000 సంవత్సరాల్లో మిస్ వరల్డ్‌గా భారతీయులనే ప్రకటించారు. అందం పేరు మీద, అందం పెరగడానికి అవసరమైన వస్తువుల వ్యాపారం కోసం ఇండియాకు అక్కడే గాలం వేసి ఉచ్చు బిగించాయి కాస్మోటిక్ కంపెనీలు. వారికి మనం మనుషులం కాదు. మార్కెట్ కేంద్రకాలం. ఆ ప్రపంచీకరణ సంస్కృతి వలనే మనం సౌందర్యం, ఆకర్షణ, ఆడతనం అందమైన వ్యాపారం అయ్యాయి. ఎంతగా అంటే ఆ కృత్రిమ అందాలకు బానిసలమై సహజత్వాన్ని కోల్పోయే సున్నిత అగాథంలో పడ్డాం. వ్యాపార వ్యామోహ వలలో చిక్కుకుపోయాం. టీవీ, సినిమా, వ్యాపార ప్రకటనల మాయాజాలం మనకు తెలియకుండానే మనల్ని ఆవరించాయి. అందం ఆస్వాదించడానికేననే ఆలోచనల్ని మన మెదళ్లలో కుక్కారు. అందుకే స్నేహానికి, ప్రేమకు, కామానికి తేడా తెలియనితనం కమ్ముకున్నది. ఇంటర్నెట్లు ఇష్టారీతిన పోర్న్ వీడియోలను సప్లై చేస్తున్నాయి. వాటి భ్రమల్లో జనరేషన్లను కోల్పోయే దుస్థితి తలెత్తనుందని యాదయ్య హెచ్చరించాడు.

**"కాస్మోటిక్ కొమ్మల్లోంచి**
**వలస కోకిల అప్పుగా కూస్తుంది**
**సహజత్వం హరించుకుపోయి బోన్‌సాయ్ మొక్కలా**
**నెక్లెస్ రోడ్డుమీద బతుకు వెర్రిగా పరవశిస్తుంది**
**ఈ రాత్రేకాదు**
**ఇక ఏ రాత్రి మన పంటకాలువల్లో వెన్నెల ప్రవహించదు**

ఈ పగలేకాదు
ఇక ఏ పగలూ మన చేలల్లో
పిట్టలు వాలుతున్న దృశ్యాలు కనిపించవు"
(శీర్షిక: లేబుల్ ముఖాలు, నేను గొ(రెల్ని కాస్తుంటాను, పుట. 43, 2011)

పై పై మెరుగులు, కృత్రిమ అందాలు, కృత్రిమ అభివృద్ధి. ఇది అటు వరల్డ్ బ్యాంక్‌కు, ఇటు అమెరికాకు ఉపయోగమేమో కాని మనకు కాదు. నెక్లెస్ రోడ్డులో స్వచ్ఛతకు, సహజత్వానికి విలువ ఆకర్షణ లేకపోవచ్చు కానీ అవి కోల్పోతే బతుకు బోన్సాయ్ మరుగుజ్జు మొక్కలా అవుతుంది. అది గుర్తించలేని అమెరికా వ్యామోహం, పై పై తాత్కాలిక అభివృద్ధి కోసం వెంపర్లాడుతున్నాం. దానికి నిదర్శనమే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 32 వేల కోట్లు అప్పు తెచ్చి ఆకలి తీర్చడానికీ బదులుగా, నెక్లెస్ రోడ్డు అందాలకు, రోడ్లకు, ఫ్లైఓవర్లకు ఖర్చుపెట్టాడు. సాగు, తాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. కాల్వల్లో కంప చెట్లు మొలిచాయి. పొలాలు బీళ్లుగా మారాయి. కరువు తాండవించింది. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

"ఒక కాలు కంప్యూటర్ మీద
మరో కాలు సెల్ ఫోన్ మీద వేసి నడుస్తున్న కాలానికి
నేను కరువుదొక్కతో ఎదురవ్వడం అపరాధమే కావచ్చు
సైబరాబాద్ సిలికాన్ వ్యాలీకి
డాలర్ కాంక్రీట్‌తో కట్టిన ఓవర్ బ్రిడ్జిపై
నేను గడ్డిబండి తోలుకురావడం ఘోరతప్పిదమే కావచ్చు"
(శీర్షిక: వధశాల, నేను గొ(రెల్ని కాస్తుంటాను. 2011: 81)

1994 – 2004 వరకు ఆంధ్రప్రదేశ్‌ను హైటెక్ ముఖ్యమంత్రి నని, ప్రపంచపటంలో సైబరాబాద్‌ను సృష్టించానని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఏలుతున్న కాలం. ఇప్పుడిక ఏ ఇజం లేదు టూరిజం మాత్రమేనని పబ్లిసిటీ ఇస్తూ అన్నపూర్ణ అని పిలిచే ఆంధ్ర రాష్ట్ర వ్యవసాయాన్ని వధ్యశిల మీదకు నెట్టిన దుస్థితికి ఈ కవితా పాదాలు దృశ్యమానంగా నిలుస్తాయి. వ్యవసాయం చేస్తే కాదు, కంప్యూటర్‌లే అన్నం పెడతాయి అనేంతగా పాలకులు మాట్లాడిన సందర్భాలూ ఉన్నాయి. పంట కాల్వలకు, పచ్చని వ్యవసాయానికి కేటాయించాల్సిన నిధులను హైటెక్ సిటీ నిర్మాణానికి, అక్కడికి వేగంగా వెళ్ళడానికి ఫ్లైఓవర్ల నిర్మాణానికి మళ్లించిన దుస్థితి. తత్కారణంగా కరువు వచ్చి, పొలాలు బీళ్లుగా మారి రైతులు వలసలు పోయారు. ఎన్నో కుటుంబాలు ఆకలి దూపకు ఎడబాసిన రోజులవి. మనుషుల పోషణే కష్టమైన ఆ కాలంలో ఏంతో మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వేలాది పశువులు వధశాలకు, కబేళాకు తరాలాయి. ఆ సమయంలో వలస వెళ్తున్న ఒక ఎద్దుల బండికి ఫ్లయ్ ఓవర్ మీద యాక్సిడెంట్ అయింది. ఆ ఘటనను చిత్రిక పడుతూ మార్చి 31, 1999 లో రాసిందే ఈ వధశాల కవిత.

"వలస పక్షులమై
ఫైబర్ గూళ్ళు కట్టుకొని కాంక్రీట్ కీకారణ్యంలో
ఎంతకాలం తిరుగుదాం
అభావుకులమై
డాలర్ బిస్కట్లను రసాయనాల్లో తుంచుకుని ట్విట్టర్ పార్కుల్లో
ఎంతకాలం తిందాం
అగ్రరాజ్యపు కుట్రకు వ్యతిరేకంగా
కాపీ కాపీ మెదడు డప్పును వాయిద్దాం"
(శీర్షిక: రేపటితరం, నేను గొ(రెల్ని కాస్తుంటాను. 2011 పుట: 93)

ఇరవై అయిదు కవితలున్న ఈ సంపుటిలో పది కవితలు ప్రపంచీకరణకు, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నవి. అందులో రేపటి తరం శీర్షికన రాసిన ఈ కవిత చివరిది. ప్రపంచీకరణ (అమెరికా) పాము గుడ్లను తిన్నట్టు జీవ రసాయనిక ఆయుధాల పేరుతో, టెర్రరిజం పేరుతో మూడో ప్రపంచ దేశాలను తింటుంది. డాలర్ల సంపాదనలో ఏ భావాలను వ్యక్తపరచలేని తనం, అభావం, ముభావం మనల్ని చుట్టుకున్నది. నిజానికి సాటి వారి గురించి పట్టించుకోని, సానుభూతి, సహానుభూతులను పొందలేని, కాంక్రీట్ కీకారణ్యంలో చిక్కుకుపోయి వెలుగుల్ని చూడలేని ఒక డాట్‌కామ్ సంతతి ఆవిర్భవించింది. ఇలాంటి పరీక్షా సమయంలో మన మాట్లాడలేనితనం ఉన్నది. ఇది స్వార్థపు మనోవ్యాధో, ఫ్యాషన్ సుఖవ్యాధో కానీ ఇలాంటి అభావతకు ప్రకృతి వైద్యం చేద్దాం. మనో వైకల్యాన్ని తొలగించుకుందాం. ఏసీల సౌకర్యాల్లో మెత్తబడిన మెదడు డప్పును ఎర్రని మంటల్లో కాపీ అగ్రరాజ్య కుట్రకు వ్యతిరేకంగా వాయిద్దాం అంటున్నాడు. భయపడడానికి ఇక్కడకు రాలేదు మనం. పోరాడి భళ్ళున తెల్లారే సూర్యున్ని చీకటి నుదుట దిద్ది రేపటితరం దోసిట్లో పెడతాం అని ఒక నిండైన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు.

**ముగింపు**

నూతన ఆర్థిక సంస్కరణల పేరుతో తెలుగు ప్రాంతంలో ప్రపంచీకరణ వెల్లువెత్తింది. ఇక్కడి ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీసింది. సామాజికార్థిక, జీవనంలో అనేక మార్పులకు ప్రపంచీకరణ విధానాలు కారణమయ్యాయి. దెబ్బతింటున్న సామాజిక వైవిధ్యాన్ని సూక్ష్మంగా తెలుగు సమాజం పదేళ్ల తరువాత అర్థం చేసుకున్నది. ఈ నేపథ్యం నుంచి బెల్లి యాదయ్య తొంబయ్యవ దశకం నుంచి ప్రపంచీకరణ దుర్మార్గాన్ని ఎండగడుతున్నాడు. అమెరికా మార్కెట్ వ్యతిరేక కవిత్వం, ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం ఇంత గాఢతగా, సాంద్రతగా రాసిన అగ్రగణ్యుల జాబితాలో యాదయ్య కవిత్వం నిలబడతుంది. ఆయన చైతన్యం, నిబద్ధత, నిమగ్నత సదా వర్ధిల్లాలని కోరుకుందాం.

# చారిత్రక వైభవం కలిగిన జైనథ్ ఆలయం

**చంద్రకాంత్ మునేశ్వర్,** చరిత్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎల్లారెడ్డి. ఫోన్ : 998 953 8243

ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్రానికి మకుటాయమైనది. భారతదేశంలోనే ఆదిమానవుల చరిత్రకు నెలవు. అతిప్రాచీన నాగరికతకు ఆటపట్టు. భారతదేశంలోకి తొలి మానవులు అడుగుపెట్టిన ప్రదేశాలలో ఆదిలాబాద్ ప్రముఖమైంది. ఇక్కడ దట్టమైన అడవులు, పర్వతశ్రేణులు, నదులు, జలపాతాలు వుండడం మూలాన ఎంతో అందమైంది ఆదిలాబాద్ లేదా ఏదులాపురం. ఆదిలాబాద్‌లో ఎన్నెన్నో ఆదిమానవుల ఆవాసాలు, అంతకన్నా పురాతనమైన జంతు, వృక్ష శిలాజాలు దొరికిన ప్రదేశాలున్నాయి.

ఆదిలాబాద్‌లో ప్రసిద్ధమైన తీర్థాలు, క్షేత్రాలెన్నో వున్నా జైనథ్ లక్ష్మీనారాయణ దేవాలయానిది ప్రత్యేకస్థానం. జిల్లా కేంద్రానికి 21 కి.మీ.ల దూరంలోనే వున్న ఈ గ్రామం ఇపుడు మండల కేంద్రం. జైనథ్‌లో ఎన్నో గుళ్ళున్నవి. కానీ, లక్ష్మీనారాయణ దేవాలయం ప్రత్యేకం. ఆదిలాబాద్ జిల్లాలో దొరికిన శిలాశాసనాలు తక్కువే. ఈ గుడిలో వున్న శాసనం 28 పంక్తుల్లో, 20 శ్లోకాల్లో రాయబడి వుంది. భాష సంస్కృతం. లిపి దేవనాగరి. సూర్యుని ప్రార్థనతో, శివుని ప్రశంసతో మొదలై, పారమార వంశంలోని ఉదయాదిత్యుని కొడుకు జగద్దేవుని విజయాల వర్ణన వుంది ఈ శాసనంలో. అతని కాలం వాడైన లోలార్కుని భార్య పద్మావతి అగ్రహారమైన జైనథ్‌లో **'నిమ్మాదిత్య'** దేవాలయాన్ని ప్రతిష్ఠించింది. ప్రాచ్యాభిముఖంగా ఎత్తైన జగతి మీద కట్టిన ఈ గుడిలో ముఖమంటపం, అంతరాళం, గర్భగుడి వరుసగా తూర్పునుండి పడమరకు ఒకే అక్షం మీద నిర్మించబడ్డాయి. చెక్కిన భారీ శిలలతో కట్టబడ్డ గోడలతో ఈ దేవాలయం **'హేమద్ పంతి'** శైలిలో నిర్మితమైంది.

దేవాలయంలోని శాసనాన్ని ఎవరు చదువలేదని, అందులో ఏముందో తెలియదని చెప్పినవారే ఎక్కువ. కాని ఈ దేవాలయం గురించి పరిశోధించి, శాసనపాఠాన్ని సాధించిపెట్టారు మన ఆర్కియాలజీ డిపార్టుమెంటువారు. నాకీ దేవాలయ శాసన విషయాలను చెప్పి సహకరించిన వారు ఆర్కియాలజీ శాఖ మాజీ డిప్యూటి డైరెక్టర్ శ్రీరంగాచార్యులుగారు మరియు ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాదు ఆర్కియాలజీ సర్కిల్ పర్యవేక్షకులు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ సాగర్ మరియు వై.యస్. రాజశేఖరరెడ్డి స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీమతి గంగాదేవి గారి ద్వారా శాసన విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేసాను.

ఈ శాసనంలో పేర్కొనబడ్డ పారమార జగద్దేవుడు కళ్యాణీచాళుక్య చక్రవర్తి త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుడు క్రీ.శ.1100లో



చేసిన ఉత్తరాది దండయాత్రలలో ఎన్నో విజయాలకు కారణభూతుడైనందువల్ల, తనను పుత్ర సమానంగా ప్రేమించి తన వెంట తెచ్చుకుని కొలనుపాక-7000ల నాడుకు కుమార మహామండలేశ్వరుణ్ణి చేసినట్లు కొలనుపాక శాసనాలలో ఒకటైన క్రీ.శ.1104నాటి శాసనం వల్ల తెలుస్తున్నది. ఈ శాసనంలో కూడా జగద్దేవుని విజయ దండయాత్రల గురించి చెప్పబడ్డది. ఆంధ్రాధీశుణ్ణి, గూర్జరరాజుని జయించిన ఉదంతాలే రాయబడ్డాయి. జగద్దేవుడు కొలనుపాకకు క్రీ.శ.1104 నుండి 1108వ సం.వరకు పరిపాలకుడుగా వున్నాడు. అతడే జైనథ్ దేవాలయ శాసనంలో పేర్కొనబడ్డ జగద్దేవుడని, అతడు చేసినట్లు చెప్పబడిన యుద్ధాల ఆధారంగా నిర్ణయించవచ్చు. జైనథ్ అగ్రహారంలో లోలార్కుడనే రాజు భార్య పద్మావతి 'నిమ్మాదిత్య' దేవాలయాన్ని కట్టించినట్లు తేదీలేని, రాజు పేరులేని జైనథ్ శాసనంలో తెలియజేయబడ్డది. నిజానికి ఈ గుడి సూర్యదేవాలయం కావాలి. మరి సూర్యనారాయణునికి బదులు లక్ష్మీనారాయణుడెట్లా వెలిసాడో తెలియదు. దేవాలయ నిర్మాణం ఇదే మౌలికమైనదనిపించడం లేదు. కొలనుపాకను జగద్దేవుడు పాలించిన కాలంలో అతని పేరిట జగద్దేవ వీరనారాయణాలయం కట్టించబడింది. అక్కడ గుడిలో ఇక్కడిలాగానే దేవనాగరిలిపిలో సంస్కృతశాసనం వేయించబడి వుంది. కొలనుపాకలో అంతకు ముందు అక్కడ వుండే జైనబసదిని కూల్చి (గుడికప్పులో, గోడల్లో జైన స్థంబాలు, శిల్పాలెన్నో కనిపిస్తుంటాయి) వైష్ణవ మతాభిమానియైన జగద్దేవుని పేరన వీరనారాయణాలయం కట్టినట్లుగానే జైనథ్ లో జైనబసదిని పడగొట్టి క్రీ.శ.12వ శతాబ్ద ప్రారంభంలో 'లక్ష్మీనారాయణ' దేవాలయం కట్టించి వుంటారు. దేవాలయం గోడల్లో కలశ స్తంభాలు, జైనమునుల శిల్పాలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఊరి పేరే జైనథ్ కావడం దాన్నే బలపరుస్తున్నది. శాతవాహనుల కాలం నాడే ఇక్కడ జైనబసదులు వుండి వుండాలి. తర్వాత కాలంలో మార్పులు సంభవించి వుండవచ్చు. శాసనంలో సూర్యుణ్ణి, శివుణ్ణి ప్రార్థించినట్లుంది కాని



వైష్ణవ ప్రసక్తే లేదు. గుడికి, శాసనానికి సంబంధం, సందర్భం కుదరడం లేదు. గుడిముందు పడివున్న విరిగిన శివుని శిల్పం ప్రత్యేకం. శివుని చేతుల్లో త్రిశూలంతో పాటు ఖట్వాంగం వుండడం విశేషం. శాసనంలో శివున్ని త్రిపురదహకునిగా వర్ణించబడి వుంది. ఈ శిల్పం దానికి రుజువుగా వుంది. అంతేగాక దేవాలయపు స్తంభంపై ఒకచోట ఇట్లాంటి శివుని శిల్పమే కనిపిస్తుంది. అక్కడక్కడ సూర్యశిల్పాలు కూడా వున్నాయి. ఒకచోట క్షీరసాగర మథన దృశ్యం సగమే చెక్కబడి వుంది. శృంగార శిల్పాలున్నాయి. ఇక్కడి దేవతా శిల్పాల శిల్పరీతి ఉత్తరాదిశిల్పంతో పోలి వుంటుంది. దేవాలయమే అష్ట భుజాకారంలో నిర్మించబడి వుంది. దేవాలయ గోడల్లో అలంకృతమైన శిల్పాల్లో ఎక్కువగా మాతృదేవతల శిల్పాలున్నవి.

దేవాలయం గురించి పురావస్తుశాఖ పెట్టిన నోటీసు

(Vaishnavite temple, Lakshminarayana Temple), Jinad/Jainath village and mandal, Adilabad

The village Jinad/Jainath is situated almost at the northern tip of Telangana State. It is 21kms.from Adilabad town and 341kms. from Hyderabad. There is a stone inscription in the temple written in Sanskrit language in Devanagari script. It begins with an obeisance to the sun god- namah Suryaya. It records the military achievements of king Jagaddeva son of Udayaditya of Paramara family. It also records foundation of an agrahara and erection of a temple of Nimvaditya by Padmavathi wife of Lolarka. According to Kolanupaka inscriptions Jagaddeva ruled Kollipaka province for a short period (1104 - 1108 A.D) as a subordinate of Chalukya king Tribhuvanamalla of Kalyana.

Though there are number of temples in the village the main temple is dedicated to Sri Laxminarayana. The temple faces east. It is erected on a high Jagati, which elevates the temple structure from its surrounding area. The jagati serves as an open promenade and pradakshanapatha around the temple. The compartments of the temple namely mukhamandapa, antarala and garbhagriha connected internally and externally. They are planned on one single axis, which runs east west. The walls of the temple constructed with large blocks of dressed stones. The temple seems to have been constructed in 12th CAD in Hemadpanthi style.

తెలుగు నేలను ఆంధ్రదేశాన్ని అనేకమంది రాజవంశాలవారు పాలించారు. ఈ రాజవంశాల వారు వివిధ రంగాలలో తెలుగు నేలను అభివృద్ధి పరిచారు. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, శాస్త్ర, సాంకేతిక రంగాలలో, మత, సాహిత్య రంగంలో వాస్తు, శిల్ప, చిత్ర కళ పోషించి తమ అభిరుచికి అనుగుణంగా అమోఘంగా అభివృద్ధి పరచడమే కాకుండా ఆంధ్రదేశాన్ని అనేక రంగాలలో అభివృద్ధి పరిచి జనరంజక పాలనను అందించారు. అద్భుతమైన, ప్రజాపాలనను అందివ్వడమే కాకుండా వాస్తు, శిల్ప కళలను పోషించి భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిపోయారు. ఇదే కోవలోకి వస్తుంది ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ ఆలయ నిర్మాణం. సూర్య దేవాలయం అనగానే మనకు జాతీయ స్థాయిలో ఒరిస్సా భువనేశ్వర్ కోణార్క్ దేవాలయం, గుజరాత్‌లోని మోడేరా సూర్య దేవాలయం, జమ్మూలోని మార్థండా సూర్య దేవాలయం, ఆంధ్రలో పేరెన్నికగన్న శ్రీకాకుళం జిల్లాలోని అరసవిల్లి ఆలయాలు గుర్తుకు వస్తాయి. కానీ, తెలంగాణలో ఎంతో చారిత్రక ప్రాధాన్యం గల 'ఆదిత్యుని ఆలయం' ఒకటి ఆదిలాబాద్ దగ్గర ఉందన్న సంగతి చాలామందికి తెలియదు. అది జైనథ్ మండల కేంద్రం. ఆదిలాబాద్ పట్టణం నుండి తూర్పు వైపున చంద్రాపూర్ వెళ్లే మార్గంలో సుమారు 21 కి.మీ.దూరంలో ఈ పట్టణం ఉంటది. పూర్వకాలంలో ఈ ఊరును **'ఝంఝు'** అని పిలిచేవారని, తర్వాత కాలక్రమేణా అది 'జైనథ్'గా మారిందని చరిత్రకారుడు బి.యన్.శాస్త్రి గారు తన గ్రంథమైన **'ఆదిలాబాద్ జిల్లా సర్వస్వం'** లో క్లుప్తంగా తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోనే దీనిని అతి ప్రాచీనమైన దేవాలయంగా చెబుతున్నారు. ఈ ఆలయ నిర్మాణశైలి అంతా మహారాష్ట్ర నాసిక్ త్రయంబకంలలోని దేవాలయాల రీతి అయినా **'హేమపంతి'** ని పోలి ఉంటది. అంతేకాదు ఈ రకమైన అన్ని ఆలయాలకు ఉపయోగించిన **'శిలా స్వరూపం'** ఒక్కటే కావడం


గమనార్హం. దేశంలోనే అతి ప్రాచీన ఆలయాల్లో ఒకటైన శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండల కేంద్రంలో ఉంది. ఈ ఆలయాన్ని 11,13వ శతాబ్దంలో జైనులు నిర్మించారని ప్రతీతి. ఉన్నతమైన శిఖరం కలిగి, గొప్ప శిల్పకళతో అలరారుతోంది. ఆలయ మూలవిరాట్టు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం. ఈ ఆలయం జైన సంప్రదాయంతో నిర్మితమైందని ఆలయ శిల్పకళను వాస్తును ఆధారంగా చేసుకొని నిర్ధారించవచ్చు. అందుకే ఆ గ్రామానికి ఝంజ / జైనథ్ అని పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. ప్రకృతిసిద్ధంగా లభించే నల్లరాతితో ఈ ఆలయం నిర్మితమైంది. ఈ ఆలయం హైదరాబాదు నుండి కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ మీదుగా 321 కిలోమీటర్ల దూరంలో ఉంది. నాటి వాస్తు కళానైపుణ్యం గొప్పదే కాకుండా హస్తకళలలో, శిల్పకళలలోను వారు సిద్ధహస్తులు.

### స్థలం – పురాణం

స్థలంపురాణం ప్రకారం ఒకప్పుడు దండకారణ్యంలో భాగమైన ఈ ప్రాంతంలో రాక్షసులు నివసించేవారట. తమ శక్తి సామర్థ్యాలు పెంచుకోవడానికి నారాయణున్ని భక్తితో పూజించేవారట. స్వామికి ఆ పూజలు నిత్యం జరగాలనే ఆలోచనతో ఆలయాన్ని కట్టాలని సంకల్పించారట. అనుకున్నదే తడవుగా రాక్షసులు రాత్రికి రాత్రే ఈ కోవెలను కట్టారని స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. ఈ నిర్మాణం అత్భుత వాస్తు కళాఖండం. లక్ష్మీనరసింహస్వామి వారి చుట్టూ దశావతారాల బొమ్మలు, పాదాల వద్ద వింజామరలతో స్వామిని సేవ చేస్తున్న స్త్రీ మూర్తుల బొమ్మలతో దేదీప్యమానంగా 23 అంగుళాల ఎత్తుతో ప్రకాశిస్తున్న ఆ విగ్రహాన్ని వేద మంత్రఘోషతో, భక్తజన సందేహాల మధ్య అక్కడే ప్రతిష్ఠించి పూజాదికము నిర్వహించడం ప్రారంభించారు గ్రామస్థులు. రాతితో నిర్మించిన గర్భాలయం నందు సూర్యనారాయణస్వామి వారి విగ్రహానికి ఇరువైపుల పన్నెండు మంది యోగసనాసీనులైన మహర్షుల విగ్రహాలు ఉన్నాయి. మహా భక్తుడైన పోతాజీ స్వామిని సేవిస్తూ కొన్ని సంవత్సరాల పిదప ఆ స్వామిలో ఐక్యం చెందాడు. ఈ మహాభక్తుడి సమాధి నేటికీ దేవాలయానికి ముందు భాగాన ఉన్నది. కాలక్రమంలో ఈ దేవాలయము నందు గోవిందరాజస్వామి, శివ పంచాయతనము, ఆంజనేయ, గరుడ విగ్రహాలు ప్రతిష్ఠించారు. 11, 13 శతాబ్దకాలంలో మహారాష్ట్రలోని యావత్మాల్ సాత్మాలా కొండలలోని రాతితో ఈ ఆలయం నిర్మించ బడింది. జైనథ్ పరిసరాల చుట్టూ ఈ ఆలయానికి వాడిన శిలలు ఎక్కడా లభించవు. ఈ శిలను మహారాష్ట్ర నుంచి తెప్పించారు. ఉన్నత శిఖరం కలిగి అడుగడుగునా శిల్పకళతో శోభితమైంది. 60 గజాల ఎత్తు, 40 గజాల వైశాల్యంలో, అష్టకోణాకార మండపం పైనున్న గర్భగుడిలో సూర్యనారాయణస్వామి వారు తన అపార కరుణ కిరణాలను భక్తులపై ప్రసరింపచేస్తుంటారు. మూలవిరాట్లు లక్ష్మీనారాయణ స్వామి విగ్రహానికి దక్షిణదిశలో లక్ష్మీదేవి, ఆళ్వారులు, అన్యదేవతామూర్తులు ఉన్నాయి.

### రవి కిరణాలు తాకే పాదాలు

ప్రతి ఏడాది అక్టోబర్ మాసంలో దసరా అనంతరం ఆశ్వయుజ పౌర్ణమి నాడు ఉదయం లేలేత సూర్యకిరణాలు లక్ష్మీనారాయణ స్వామి పాదాలను తాకుతాయి. అందుకే ఈ ఆలయాన్ని సూర్యదేవాలయంగా కూడా పిలుస్తారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించటానికి జిల్లా ప్రజలే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు అదేవిదంగా పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర నుండి కూడా ప్రజలు తండప తండాలుగా వచ్చి దర్శించుకుంటారు.




### జైనమత కేంద్రం

శాతవాహనుల కాలం నాటి జైన 'బసది' 'కాలక్రమంగా ఝంజ/జైనథ్ గా జైనమత కేంద్రంగా వర్ధిల్లినది. కాలంతో పాటు రాజులు తమ మతాన్ని మార్చుకున్న సందర్భంగా తమ ప్రాంతంలోని ఆలయాలు ఆలయంలోని దేవి, దేవత విగ్రహాలు కూడా మార్చేవారు ఈ క్రమంలో జైన బసది కాస్త శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంగా మారిపోయినది. ఇలాంటి అంశాలు చరిత్రలో అనేకం ఉన్నాయి.

### ముగింపు

ఎంతో అత్భుతమైన చారిత్రక ప్రాముఖ్యత కల్గిన ఈ ఆలయం వాస్తు కళాఖండం రాష్ట్ర పురావాస్తు శాఖ వారి రక్షితం ప్రదేశం. నేడు నిర్వహణ లోపం మూలంగా ఈ ఆలయం నిర్వహణ నిర్లక్ష్యం పర్యావేక్షణా లోపంతో సరైన నిర్వహణ లేక స్వామివారి రథం మండపం అంతర్భాగంలో స్తంభాలు, స్తంభాలపై ఉన్న కళారూపాలు హనుమంతుడు, రంభాది అప్సరసల శిల్పాలు, ఆలయం ముందు భాగాన గరుడ స్తంభం ఉంది. ఆలయానికి ఇరువైపులా శృంగార భంగిమలతో కూడిన శిల్పఖండాలు దర్శనమిస్తాయి. ఆలయం ముందున్న కోనేరు

20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో డోలాహరణ మండపం నిర్మించారు. కాలక్రమేణా అది శిథిలమైంది. శిథిలమౌతున్నా ఈ ఆలయాన్ని చారిత్రక ప్రాముఖ్యత ఉన్న ప్రతి కళాఖండాన్ని కాపాడవలసిన అవసరం, భావి తరాలకు భద్రంగా అందివ్వవలసిన బాధ్యత ప్రభుత్వం పైన, స్థానిక ప్రజలపైన ఎంతో ఉంది కావున ఈ చారిత్రక వారసత్వ సంపదను పునర్నిర్మించి భద్రపరస్తారని నా మనవి.

**ఆధార గ్రంథాలు**

1) Nageshwara Rao, K. Raju, Ch. : the role of pilgrimage Tourism in Adilabad Disctrict A Study of Gnana Saraswathi Temple, Kakatiya University, Warangal.

2) Nageshwara Rao, K. Raju, Ch. : Pilgrimage Tourism in Adilabad Disctrict of Andhra Pradesh, South Indian History Congress, Thirtieth Annual Session Proceedings 6th - 8th February 2010 Kanur.

3) Parthasarathy, R. : Places of Interest in Andhra Pradesh (A Monograph ) Published by the Government of Andhra Pradesh, Printed by the Nagambika Press, Kothagudem, VOL-I (1984).

4) Vijay Kumar, D. : Pracheena Devalayala Charitra, Adilabad -Karimnagar Zillalu (T). Vipanchi Offsets Printers, Asifabad, Adilabad. (2006)

5) Andhra Pradesh District Gazetteers, Adilabad (1976) Painted by The Government of Telangana at the Government Central Press, Telangana Hyderabad.

6) Kamalakara Sharma : alokanam Telugu Zillala Sahitya Charitra Samshkrithi Samaharam, Prapancha Telugu Mahasabhalu, Musi Patrika Hyderabad (2019).

7) Shivanagi Reddy, E. : Andhra Pradesh Tourism, Vanarulu - Avakaashalu (1998).

8) Narayana Udari. : Adilabad Zilla Sahitya Charitra, Savera Graphics Hyderabad (2019).

9) Bhadraiah Madipalli : Mana Adilabad Suhrudbhava Yatra - Anubhavalu - Anubhutulu, Kala Printers Gandhi Nagar, Hyderabad (2008).

10) Ravindar Durgam. :Adilabad Darshini, Varalaxmi Printers Hyderabad (1987)

11) Shatri B. N. : Adilabad Zilla Sarvaswam, Kakati Publications (1990)

12) ఈనాడు – రాక్షసులు కట్టిన ఆలయం. తేది 29 మే 2022



## గురువు – జాతికి సదా పరువు

'పద్య ప్రవీణ' కట్ట రంజిత్ కుమార్,
సిద్ధిపేట, ఫోన్ : 6300474467




భువినుపాధ్యాయుడనగాను పుణ్యశీలి
జ్ఞానమందించి శిష్యుల మానితముగ
తీర్చిదిద్దుచు సతతంబు దీటుగాను
వేత్తయై యలరారును ప్రీతితోడ

భువినుపాధ్యాయుడనగాను బుద్ధిశాలి
భవ్య క్రమశిక్షణను నేర్పి దివ్యముగను
హృదయలోతుల చదువును పదిలపరచి
భావితరమును నిర్మించు బాధ్యతగను

భువినుపాధ్యాయుడనగాను ప్రోద్బలంబు
ఛాత్రులకు నిచ్చి సద్విద్య సంపదలను
అనుదినంబును నందించి యాదరమును
పంచుచుండును మెండుగా వరమువోలె

భువినుపాధ్యాయుడనగాను ప్రోత్సహించి
నీతి విలువలు బోధించి నియమముగను
జాతి నిర్మాతలుగ తీర్చి సత్యపథము
నందు విద్యార్థులను పోవునటుల జేయు

భువినుపాధ్యాయుడనగా ప్రమోదముగను
మంచి చెడ్డల భేదమ్ము నెంచి చూపి
సత్ప్రవర్తన తోడను సాగునటుల
శిష్యులను మార్చుచుండును శ్రేష్ఠముగను

# తొలితరం తెలంగాణ చరిత్ర పరిశోధకుడు తేరాల సత్యనారాయణ శర్మ

నివాళి


**శ్రీరామోజు హరగోపాల్,** కన్వీనర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఫోన్ : 9949498698

తెలంగాణ చరిత్రను సాధికారికంగా చెప్పగలిగిన వారిలో బిఎన్ శాస్త్రిగారి తర్వాత తేరాల సత్యనారాయణశర్మగారి పేరు చెప్పుకోవాలి. సూక్ష్మ పరిశీలన, సత్యశోధన వారి పద్ధతి. ఊహాపోహలతో కాకుండా ఆధారసహితంగా చరిత్ర చెప్పాలనేవారు.




నల్గొండ జిల్లా మేళ్ళచెరువు మండలంలోని తమ్మారం గ్రామంలో 1932వ సం.జూలై 25న జన్మించారు తేరాల సత్యనారాయణ శర్మగారు. తండ్రి తేరాల అప్పయ్యశర్మ, తల్లి భద్రమ్మ. భార్యపేరు వేంకటశేషమ్మగారు. తనకు 1947లో వివాహమైంది. 4గురు సంతానం. ఇద్దరబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు. సూర్యాపేట, ఉస్మానియా యూనివర్సిటీలలో చదువుకున్నారు. వారి విద్యార్హతలు ఎం.ఏ., ఎం.ఓఎల్. నల్గొండలో తెలుగు అధ్యాపకుడిగా 30సం.లు పనిచేసి, 1977నుంచి గెజిటెడ్ హోదాలో 1990లో రిటైరైనారు. 92యేండ్లు గడిచి, 93వ సం.రంలో 2024 ఆగష్టు 17వ తేదీన ప్రస్థానం చేసారు.

తెలంగాణ సాయుధపోరాటకాలంలో 'రేపాల' నుండి ఉద్యమంలో పాల్గొని సూర్యాపేటలో జైల్లో నిర్బంధించబడ్డాడు. తనకు  కోదాటి నారాయణరావు రాజకీయగురువు. 1980లో తనను భారతప్రభుత్వం స్వాతంత్ర్యసమరయోధునిగా గుర్తించింది.




చరిత్రకారుడుగా నేలటూరి వేంకటరమణయ్య, బి.ఎన్. శాస్త్రి, పి.వి. పరబ్రహ్మశాస్త్రి వంటి ఉద్దండులైన చరిత్రకారులతో కలిసి పనిచేసాడు. తెలంగాణ చరిత్రపై మక్కువగా పరిశోధనలు చేసాడు. సాహిత్యపరంగా కె.ఎల్. నరసింహారావుతో సాహచర్యం చేసారు. ప్రముఖ పత్రికల్లో వందలాది వ్యాసాలు ప్రచురితమైనాయి. గెలుపు నీదే, కొత్తగుడి, చింతామణి మొదలైన నాటకాలను రచించారు. అంతేకాదు స్థానం నరసింహారావుగారితో నాటకప్రదర్శన చేశారు. బూర్గుల రామకృష్ణారావు, కాసు బ్రహ్మానందరెడ్డి, జమలాపురం కేశవరావు, పి.వి.నరసింహారావు వంటి ఉద్దండులు వీరి చరిత్ర రచనలను, సాహిత్యకృషిని ప్రశంసించారు.

విజయనగర రాజ్యాన్ని పరాయిపాలకుల నుంచి విముక్తి సాధించిన దక్షిణాది విజయంగా భావించి రచించిన **'విజయనగర చరిత్రము'** అనే గ్రంథంలోని తన 'ప్రస్తావన'లో **"చరిత్ర లక్ష్యము పురాతనమైన దేశ వారసత్వ లక్షణములను తెలుసుకొని దానిలోని గొప్పతనము కాపాడుకొనుటయని చెప్పుకొనవచ్చును. కాని పూర్వచరిత్రలే అక్కర లేనప్పుడు భవిష్యత్తు నిలుపుకొనుట సహితము కష్టతరము కావచ్చును. కాని వాస్తవిక చరిత్ర యన్నది జిజ్ఞాసువులను ఆకర్షించినట్లుగా కొన్నిచరిత్రలు రావలసియున్నది. చరిత్ర, సాహిత్యం, సంస్కృతి మేలు బంతులవంటివి"** అని అభిప్రాయపడ్డారు తేరాల సత్యనారాయణశర్మ గారు.




**'ఓరుగంటి చరిత్రము'** రచనలో మల్లంపల్లివారి అభిప్రాయాలను కూడా విభేదించిన సందర్భాలున్నాయి. సత్యశోధన తన అభిమతంగా తేరాల రచనలు సాగినవి. ఓరుగంటి చరిత్రములో కాకతీయ పాలకుల నాయంకర వ్యవస్థ గురించి సమగ్రంగా చర్చించారు. నాయంకరుల పేర్లను వివిధ శాసనాల ఆధారంగా వివరించారు. ఓరుగంటి మీద తురుష్కపాలకుల దాడులు 5సార్లు జరిగాయని, 8సార్లు జరిగాయని భిన్నమైన అభిప్రాయాలున్నాయి. తురుష్కదాడులకు ముందే 1294 నుంచే కాకతీయ ప్రభుత్వం మీద తిరుగుబాట్లు మొదలైనాయని వివిధ సంఘటనలను వివరించారు తేరాల.

కాని, బందీయైన ప్రతాపరుద్రుని విడిపించడానికై బొబ్బారెడ్డి వంటి వీరులు తురుష్కులతో పోరాడి, ప్రాణాలర్పించారని సిద్ధేశ్వర చరిత్రవల్ల తెలుస్తున్నది. అప్పటి నుంచి ఓరుగల్లును ముస్లిం పాలకుల

నుంచి విముక్తి చేయడానికి నాయంకరవీరుల ప్రయత్నాలను సవివరంగా రాసారు తేరాల. వృద్ధ కాకతీయనాయకులు ఇందులూరి అన్నమమంత్రి, కొలని రుద్రదేవుడు విముక్తిపోరాటం కొరకు ప్రోలయ, కాపయ నాయకులను ఎంపిక చేసారని చెప్పారు. ఓరుగంటి చరిత్రము కాకతీయానంతరం నూతనంగా స్వతంత్రం పొందిన ఓరుగంటి రాజ్యం గురించి జరిగిన పోరాటాలు, నాయకత్వాలు, వారి మధ్య సయోధ్యలు, విరోధాలు ఫలితంగా పూర్వ కాకతీయ సామ్రాజ్య విచ్ఛిన్న స్వరూపావిష్కరణను తేరాల ఆధారాలతో చెప్పే ప్రయత్నం చేసారు.

తేరాల సత్యనారాయణశర్మగారు కొన్ని సంవత్సరాలపాటు శ్రమించి, పరిశోధించి రచించిన **'కాకతీయ చరిత్రము'** కాకతీయ చరిత్రకు సంబంధించిన గొప్ప పరిశోధనా గ్రంథంగా నిలిచి వుంటుందని అప్పటి పురావస్తుశాఖ డైరెక్టర్ వి.వి.కృష్ణశాస్త్రిగారన్నారు. నిజంగా కాకతీయ చరిత్రము భిన్నమైన తీరులో రచించిన కొత్తచరిత్ర.

1970లోనే రచించిన **'రాచకొండ చరిత్రము'** కూడా అద్భుత చారిత్రకగ్రంథం. ఈ గ్రంథంలో 32పేజీల అనుబంధాలను చేర్చారు. అందులో సాహిత్య, శాసనాధారాలను, సనదులను సమకూర్చారు. ఇదొక నవ్య పరిశోధన. ఆనాటికి లభించిన అన్ని చారిత్రక విషయాలను గుదిగుచ్చి, రాచకొండ చరిత్ర నిర్మాణం చేసారు తేరాల.

1973లో రాసిన **'రెడ్డిరాజ్య చరిత్రము'** ముందుమాటలో తేరాల గారు తురుష్కుల దండయాత్రల నుంచి తెలుగుదేశాన్ని కాపాడు కోవాలనే ఆశయం అందరి రాజులకు ఉన్నా, ఒకే అధికారం కిందకు తేవడంలో కాకతీయానంతర పాలకులు సఫలం కాలేదు. స్వతంత్రరాజ్య నిర్మాణాలలో రాజకీయ సుస్థిరత్వం అంతగా కనిపించలేదంటారు. సమిష్టికన్నా వ్యష్టి అధికారాల పోటీ కొనసాగిందని వారిభావన. ఈ గ్రంథ రచనలో మార్గదర్శనం చేసిన మల్లంపల్లి సోమశేఖరశర్మవంటి చరిత్రకారుల పట్ల ఎంతో గౌరవభావాన్ని కనబరిచారు తేరాల.

వ్యాసభారతి 2వ సంపుటిలో రేచెర్ల రెడ్డి వంశాన్వయం, పినవీరభద్రకవి, కొఱవిగోపరాజు, భైరవకవి, నాగనాథకవి, గౌరనార్యుడు, సింగభూపాలుడు, విశ్వేశ్వరకవి, అప్పయాచార్యులు, అయ్యలార్యుడు, రావుమాదానీడు, శ్రీనాథుఁడు, గౌరన, మల్లినాథసూరి, బాలసరస్వతి, హరిభట్టు, కొందరు శాసనకవుల గురించి వ్యాసాలు రాసారు. చాలా వివరంగా, పరిశోధనాత్మకంగా వున్న వ్యాసాలవి.


**'అవతారికలు–చరిత్ర'** అనే గ్రంథంలో ఎనమండుగురు కవుల రచనలలోని అవతారికల చరిత్రలను రాసారు శర్మగారు. పాల్కురికి సోమనాథుని బసవపురాణం, పండితారాధ్య చరిత్రము, భాస్కర రామాయణము, రంగనాథ రామాయణము, మార్కండేయ పురాణము, మడికి సింగన సకలనీతి సమ్మతము, జ్ఞానవాసిష్ట రామాయణము, గౌరనార్యుడు, భైరవకవి కవి గజాంకుశము, శ్రీరంగ మాహాత్మ్యము, సిద్ధేశ్వర చరిత్రలలోని అవతారికల గురించి విపులంగా చర్చించారు. ఈ సందర్భంగా తేరాల సత్యనారాయణశర్మగారు తెలంగాణాలో అజ్ఞాతము, అపరిష్కృతము, అపరిశోధితము, విస్మృతములైన సంస్కృతీ చరిత్రలు అధికంగా వున్నాయని, వాటిని గుర్తించాల్సిన అవసరముందని భావించారు.

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2023 ఆగష్టు 30వ తేదీన 2021 ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం సందర్భంగా పరిశోధన విభాగంలో పురస్కారమిచ్చి సత్కరించింది.

**తేరాల సత్యనారాయణ శర్మగారి రచనలు :**

1. వ్యాసభారతి1,2 (1970)
2. అవతారికలు–చరిత్ర (1971)
3. కవితాపట్టాభిషిక్తులు
4. కాకతీయ చరిత్రము (2001)
5. రాచకొండ చరిత్రము (1970)
6. రెడ్డిరాజ్య చరిత్రము (1973)
7. కావ్యావతారికలు
8. తెలుగుదేశ సాంఘిక చరిత్ర
9. చారిత్రక బాంధవ్యాలు
10. విజయనగర చరిత్రము (2003)
11. తెలుగు పట్టాభిషేకము
12. గెలుపునీదే (నాటకం)
13. కొత్తగుడి (నాటకం)
14. చింతామణి (నాటకం)

తేరాల సత్యనారాయణశర్మగారి చారిత్రక గ్రంథాలమీదా, సాహిత్యరచనల మీదా సమగ్రమైన పరిశోధన జరగాలి. వారి పేరు మీద కూడా బి.ఎన్.శాస్త్రి వలె చరిత్రపరిశోధకులకు అవార్డులిచ్చే సంప్రదాయం రావాలి. ఎవరినీ ఏమడుగని, ఎవరితోను చేరి, ప్రమోట్ చేయించుకోని సత్యవాది సత్యనారాయణశర్మగారు. వారిని నాలుగైదుసార్లు కలిసే అవకాశం కలిగింది. తానే నన్ను రమ్మని పిలిపించుకునేవాడు. మొన్న ఆగష్టు 10వ తేదీననే నేను, నాకు చరిత్రమార్గదర్శి విరువంటి గోపాలకృష్ణగారితో కలిసి, వెళ్ళి, కొంతసేపు మాట్లాడి వచ్చాను. అంతలోనే కనుమరుగైపోయారు చరిత్రకారుడు, ప్రేమాస్పదుడైన శర్మగారు. వారికి నా నివాళి.




# నాటితరం మేటి చరిత్రకారులు తేరాల సత్యనారాయణ శర్మ

నివాళి


డా. డి. సూర్యకుమార్, శాసన, చరిత్ర పరిశోధకులు, ఫోన్ : 799 576 4613

తెలంగాణాకు చెందిన నాటి పాతతరం చరిత్రకారుల్లో పేరెన్నిక గలవారు, పేర్కొనదగినవారు తేరాల సత్యనారాయణగారు.





శర్మగారు 1932 జులై 25వ తారీఖున శ్రీ తేరాల అప్పయ్యశర్మ, భద్రమ్మ పుణ్య దంపతులకు ఏకైక సంతానంగా యిప్పటి సూర్యాపేట జిల్లా మేళ్ళచెరువు మండలంలోని తమ్మారం గ్రామంలో జన్మించారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యానంతరం ఉన్నత విద్యని సూర్యాపేట కేంద్రంలో అభ్యసించారు. యం.ఓ.యల్. విద్యానంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ. పట్టా పొందారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ పాఠశాలలలో తెలుగు అధ్యాపకులుగా ముప్పై సంవత్సరాలు పనిచేశారు. 1977లో గెజిటడ్ అధ్యాపకులుగా పదోన్నతి పొందిన శర్మగారు 1990లో పదవీ విరమణ చేశారు.

1947లో వీరికి వెంకట శేషమ్మగారితో వివాహమైంది. వీరికి ఇద్దరు అబ్బాయిలు, యిద్దరు అమ్మాయిలు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణా విముక్తి సాయుధ పోరాటంలో వీరు తమవంతు పాత్రను పోషించి స్వాతంత్ర్య సమరయోధులుగా ప్రసిద్ధికెక్కారు. వీరి పోరాట ప్రస్థానం నేటి సూర్యాపేట జిల్లా రేపాల నుండి ఆరంభమైంది. కోదాటి నారాయణరావుగారు వీరికి రాజకీయ గురువు. సూర్యాపేట జైలులో వీరు కొంతకాలం శిక్షను కూడా అనుభవించారు. 1980లో భారత ప్రభుత్వం వీరిని స్వతంత్ర పోరాట యోధులుగా గుర్తించింది.





చరిత్ర రచనలోను, శాసన పరిష్కరణ పరిశోధనలోనూ, వీరికి అభిరుచి, అభినివేశము ఎక్కువ. తెలుగు అధ్యాపకులుగా విద్యార్థులకు తెలుగు భాషా బోధన చేయడమే గాక, విద్యార్థులకు తెలుగు సాహిత్యంతో పాటు చరిత్ర, సంస్కృతిపైన, శాసనాల అధ్యయనంమీద ఆసక్తి కలిగించేవారు. శాసనాలకోసం వీరు చేసిన క్షేత్ర పర్యటనల్లో విద్యార్థులను కూడా భాగస్వాములను చేసేవారట. ఉత్తమ అధ్యాపకుల లక్షణమిదే కదా!

తెలుగు అధ్యాపకులుగా వృత్తిరీత్యా విద్యార్థులకు తెలుగు భాషా బోధన చేయడమే గాక, తెలుగు సాహిత్యము, తెలుగువారి చరిత్ర రచన, తెలుగువారి చారిత్రక శాసనాల అన్వేషణ, అధ్యయనము, విశ్లేషణలపై తేరాలవారికి మక్కువ ఎక్కువ. ఈ అంశాలపై వీరు భారతి వంటి ప్రముఖ సాహిత్య పత్రికలలో అనేక వ్యాసాలు ప్రకటించారు. 1970 జనవరి నెల భారతి మాసపత్రికలో 'కలగూరగంప'లో నూతన శాసనాలు – కొన్ని విశేషాలు' పేర రాసిన వ్యాసంలో నల్లగొండ జిల్లాలోని రామడుగు, పానుగల్లు, చిట్యాల, వల్లాల, ముషంపల్లి, కొప్పోలు, దోమలపల్లి, నాగారం, రాజుపేట (తిప్పర్తి) దేవరకొండ ప్రాంతాలలో లభించిన శాసనాలలోని విశేషాలను సవివరంగా రాశారు. అట్లాగే నేటి సూర్యాపేట జిల్లాలోని సిరికొండ, మామిళ్ళగూడెం శాసనాల గురించి వివరించారు. శాసనాలలో పేర్కొనబడ్డ వివిధ గ్రామనామాలను వెలుగులోకి తెచ్చారు. అట్లే 1973 మే నెల భారతిలో నల్లగొండ 'ఎఱువ సింహాసన'మని విశ్లేషణాత్మకంగా వివరించారు. దీనికి వీరు కందూరిచోడుల శాసనాలను ఆధారంగా చూపారు. ఈ కందూరిచోడుల శాసనాలను వీరి సమకాలీనులు, ప్రముఖ శాసన పరిశోధకులు, 'శాసనాల శాస్త్రి'గా పేరు గాంచిన బి.ఎన్. శాస్త్రిగారు పరిష్కరించి ప్రకటించారు. 1529 నాటి రాజుపేట శాసనంలో నల్లగొండ ఎఱువ సింహాసనంగా చెప్పబడ్డది.




శ్రీ వి.యం. మనోహర ప్రసాద్‌గారు నల్లగొండ జిల్లా కలెక్టరుగా 2001 ఏప్రియల్ 27,28,29 తారీఖులలో పానుగల్లులో 'పానుగల్లు ఉత్సవాల'ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ ఉత్సవాలలో తేరాలవారు ముఖ్యభూమిక పోషించారు. ఈ ఉత్సవాల సందర్భంగానే 'ఉదయని', 'పానుగల్లు పచ్చల తోరణం' అన్న ప్రత్యేక సంచికలను వెలువరించారు. ఉదయినిలో **'కాకతీయులు – తెలుగుదేశము'** అన్న చక్కని వ్యాసాన్ని ప్రచురించిన తేరాల సత్యనారాయణ శర్మగారు 'పానుగల్లు పచ్చల తోరణము' సంచికకు సంపాదక మండలి సభ్యులుగా ఉన్నారు. దానికై **'ఉత్తేజం కలిగించిన ద్విపద సాహిత్యం'** అన్న చక్కని వ్యాసం రాశారు.







1970లోనే తేరాలవారు **రాచకొండ చరిత్రము** (1326–1482) అనే గొప్ప చారిత్రక గ్రంథాన్ని వెలువరించారు. బహుశ రాచకొండ చరిత్రపై తెలుగులో ప్రత్యేకంగా వచ్చిన తొలి గ్రంథమిదేనేమో! శాసనాధారాలు పరిమితంగా వున్న కాలంలో సాహిత్యాధారాలను వాటితో సమన్వయ పరుస్తూ రచించిన గ్రంథమిది. తర్వాత ఈ గ్రంథాన్ని మరికొందరు విస్తృతపరిచి పునర్ముద్రించారు.

రాచకొండ చరిత్రముతో కలిపి తేరాలవారు మొత్తం 14 గ్రంథాలను తెలుగులో వెలువరించారు. చరిత్ర రచనలోను, శాసన పరిశోధనలోను వీరు డా. నేలటూరు వెంకటరమణయ్య, శ్రీ బి.ఎన్.శాస్త్రి, డా.పి.వి. పరబ్రహ్మశాస్త్రిగార్ల సమకాలీనులుగా కృషి చేశారు.

వీరి రచనలలో **కవితా పట్టాభిషిక్తులు, వ్యాసభారతి –1, 2 సంపుటాలు, అవతారికలు – చరిత్ర, రెడ్డిరాజ్య చరిత్రము, ఓరుగంటి చరిత్రము, కాకతీయ చరిత్రము, విజయనగర చరిత్రము, తెలుగుదేశ సాంఘిక చరిత్ర, చారిత్రక బాంధవ్యములు, గెలుపు నీదే, కొత్త గుడి, చింతామణి** వంటి నాటకాలను రచించారు. శ్రీ కె.యల్. నరసింహారావుగారు వీరి సాహిత్య సహచరులు. వీటన్నిటినీ శర్మగారు సొంతంగా 'విజయభారతి' ప్రచురణల ద్వారా ముద్రించారు.


వీరి కృషిని పలువురు ప్రముఖులు పలు సందర్భాలలో ప్రశంసించారు. వారిలో బూర్గుల రామకృష్ణారావు, కాసు బ్రహ్మానంద రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, పి.వి. నరసింహారావులు ముఖ్యులు. అలాగే వీరిని **'బి.ఎన్.శాస్త్రి జీవన సాఫల్య పురస్కారం', 'తెలుగు విశ్వ విద్యాలయం వారి ప్రతిభా పురస్కారాలు'** వరించాయి.

తేరాల సత్యనారాయణశర్మగారు తెలంగాణాకు చెందిన నాటితరం చరిత్రకారుల్లో పేర్కొనదగ్గవారు, పేరెన్నిక గలవారు.

# గురువే సమస్త వెలుగు కిరణం

**డాక్టర అంజనాద్రి ఖమ్మం భువనగిరి కోట**

**ఫోన్ : 770 253 7453**



గురువే చీకటిని పారద్రోలి జ్ఞానాన్ని అందించు

అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు
పయనింపజేసేది గురు బోధనలే

గురువు జగతిని నడిపించే పరమ దైవం


గురువు ప్రవచించిన ప్రతి వాక్యం
నిత్య చైతన్యదాయకం

గురువు ఎల్లప్పుడూ చీకట్లో నుంచి
వెలుగును ప్రసరించే సూర్యుడు

సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపం గురువు

గురువును ఆరాధించు
గురువును సేవించు సంస్కార బద్ధంగా

జ్ఞాన సరోవరం అందులోని కొద్ది నీటిని
సేవించిన జ్ఞానం సమృద్ధిగా లభిస్తుంది.




కొలనులో విరిసే పద్మాలలోని సొగసే
గురువు యొక్క జ్ఞాన సుగంధం...

అందుకే గురువుల సేవించు
విజ్ఞానాన్ని పొందు, అజ్ఞానాన్ని తొలగించు

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11 (53) హైదరాబాద్ సెప్టెంబర్ : 2024


ఉస్మానియా విశ్వవిద్యాలయం ముద్దుబిడ్డ ... తెలుగు సాహితీ మందారం


నివాళి

# డాక్టర్ కె. ముత్యం

**తుల రాజేందర్ కుమార్,** ఫోన్ : 99662 30472











ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పేరు వినగానే చాలామందికి ఒక ప్రత్యేక అనుభూతి కలుగుతుంది. విద్యార్థి దశకు ముగింపు, జీవితంలోకి ప్రవేశం ఇక్కడి నుండే మొదలవుతుంది. ఉద్యమాలకు పురిటి గడ్డ అయిన ఉస్మానియా క్యాంపస్, తెలంగాణ మట్టి స్వభావమైన పోరాటాలకు సంకేతం. **"వందభావాలు ఘర్షించని, వేయి పూలు వికసించనీ"** అన్నట్లుగా అనేక భావజాలాలతో, సంఘర్షణలతో, నిత్యం నేర్చుకునే పాఠ్యాంశాలతో పాటు ఉద్యమ పాఠాలను అనివార్యంగా నేర్చుకోవడం జరుగుతుంది. రాజకీయాలకు ప్రయోగశాలగా ఉన్న ఇక్కడి నుండే అనేకమంది నాయకత్వ లక్షణాల్ని పునికిపుచ్చుకొని సమాజంలో అడుగు పెడుతున్నారు. విప్లవ యోధుల్ని కని సమాజానికి అందించిన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సలాం చేయకుండా ఉండలేము. ఈ కోవలోనే డాక్టర్ కె.ముత్యం నిలుస్తాడు. తెలంగాణ మట్టి మనుషుల స్వభావాన్ని, ఉస్మానియా యూనివర్సిటీ పోరాట పటిమను జీవిత సమరంతో పాటు సిద్ధాంతపరమైన విశ్వాసాలకు ఆచరణలో, తాను ఎన్నుకున్న రంగంలో చివరి వరకు తన కృషిని కొనసాగించాడు. ఇది భావితరాలకు ప్రేరణగా నిలుస్తుంది. 1970 దశకం చరిత్రలోనే ఒక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ దశాబ్ద కాలంలో ప్రపంచంలో ప్రజా పోరాటాల వెల్లువ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగి ప్రజాస్వామిక ఉద్యమాలు వాటి ప్రభావంతో ఉస్మానియాలో 1972లో ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం ప్రారంభమై, ఈ విద్యార్థి ఉద్యమం సైతం ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో అనేక ప్రజాస్వామిక జాతి విముక్తి ఉద్యమాలు విజయపథంలో సాగాయి. 1975లో ఎమర్జెన్సీని విధించడం దీనికి వ్యతిరేకంగా పౌర హక్కుల సాధన ఉద్యమాలు పెల్లుబికాయి. లోక్ నాయక్ జయప్రకాష్ సంపూర్ణ విప్లవం నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రజా పోరాటాలకు బీజాలు ఈ దశకంలోనే పడ్డాయి. ఈ ఉద్యమాలకు సంఘీభావంగా విద్యార్థి ఉద్యమం జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్ అమరత్వంతో మరింత సంఘటితమైంది. ఈ క్రమంలో ఎంతోమంది ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు ఉద్యమ కార్యచరణకు అంకితమయ్యారు అందులో కొంతమంది అమరులయ్యారు.


ప్రజాస్వామిక, లౌకిక శక్తులు సంఘటితమై లెఫ్ట్ ఫ్రంట్ గా ఏర్పడి అనేక విశ్వవిద్యాలయాలలో విద్యార్థి సంఘ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందారు.

1977-78 కె.మల్లారెడ్డి, 1978-79 తుల రాజేందర్ కుమార్, 1979-80 ఏ. శ్రీధర్, 1980-81 కె. యాదవ రెడ్డి, 1981-82 కె.ముత్యం, 1982-83 ఎస్.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షులుగా ఉన్న ప్యానల్స్ ఘన విజయాన్ని సాధించారు. తరువాత యాదవ రెడ్డి, శశిధర్ రెడ్డి తదితరులు వరుసగా కూడా గెలుపొందారు. ఇంజనీరింగ్ లా కాలేజ్, సైన్స్ కాలేజీతో పాటు హాస్టల్ ఎన్నికల్లో కూడా ఈ ఫ్రంట్ విజయ పరంపర కొనసాగించింది.


వివిధ విద్యార్థి సంఘాలకు ఎన్నికైన విద్యార్థి సంఘాల ప్రతినిధులు కలిసి అనేక ఆర్థిక సామాజిక సమస్యలపై స్పందించి ఉద్యమాలు కొనసాగించారు. అధిక ధరలకు వ్యతిరేకంగా సాంఘిక సంక్షేమ హాస్టల్స్ స్కాలర్ షిప్ పెంపుదల కోసం, ఎస్సీ బీసీ స్కాలర్షిప్‌ల కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి విజయం సాధించడం జరిగింది. అప్పటి నుండే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్షిప్ రావడం మొదలైంది.












భూమయ్య, కిష్టగౌడ్ ఉరితీతకు వ్యతిరేకంగా సిరిసిల్ల, జగిత్యాల కల్లోల ప్రాంతాల ప్రకటన ఎత్తివేయాలని రమీజాబీ పైన అత్యాచారం చేసి తన భర్తను లాకప్లో వేసి కొట్టి చంపిన ఘటనకు వ్యతిరేకంగా, గల్ఫ్ దేశాలకు అమ్మాయిలను విక్రయించే దురాచారానికి వ్యతిరేకంగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల అనుమతికి వ్యతిరేకిస్తూ 1980 వరకు రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించడం జరిగింది.

డాక్టర్ కె. ముత్యం నిజాంబాద్ జిల్లా బాచనపల్లి గ్రామంలో జన్మించి భీంగల్ లో ప్రాథమిక విద్యను అభ్యసించి నిజామాబాదులో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. 1979లో ముత్యం ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు విభాగంలో అడ్మిషన్ తీసుకున్నాడు. ముత్యం 'ఫోకస్' రాయడం ద్వారా, క్లాస్ రిప్రెజెంటేటివ్ గా మొదలుపెట్టి 1980లో ఆర్ట్స్ కళాశాల ఎన్నికల్లో అధ్యక్షునిగా ఘనవిజయం సాధించాడు. విద్యార్థి సమస్యలతో పాటుగా సంస్థ బాధ్యతల్ని కూడా నిర్వహించే స్థాయికి ఎదిగాడు.

ఒకేసారి బాధ్యతలు పెరిగేసరికి తను కొంత ఇబ్బందికి లోను కావడం జరిగింది. 1980లో నేను పార్లమెంటు ఎన్నికల తర్వాత కరీంనగర్లో ఉండవలసి వచ్చింది. ఈ విషయం తెల్సిన ముత్యం 1981 లో జరిగిన వరంగల్ మహా సభలు జరిగిన సందర్భంగా కలిసినప్పుడు 'మమ్మల్ని వదిలేసి ఎలా వెళ్తావు' అని అడగడం బాగా గుర్తుంది.

దాదాపు 15 సంవత్సరాల తర్వాత మళ్లీ ముత్యంను హైదరాబాదులో కలుసుకోవడం జరిగింది. 1996లో భారత మహిళా కళాశాలలో ముత్యం నేను పని చేశాము. ముత్యం శాతవాహన విశ్వవిద్యాలయం వెళ్ళకముందు నేను తెలుగు అకాడమీలో ఉన్నప్పుడు తరచుగా కలిసి పరస్పరం చర్చించుకునేది. ఎప్పుడూ పుస్తకాలు రాయడం, అచ్చు వేయడం అవలోకగా చెప్తుండేవాడు. నెలల తరబడి వ్యయప్రయాసలకు ఓర్చి శ్రీకాకుళం వెళ్లి సమాచారాన్ని సేకరించాడు. ముత్యం అప్పటికి కానూరు వెంకటేశ్వరరావు గారి పైన డాక్యుమెంటరీని రూపొందించాడు. పుస్తక ప్రచురణ సమయంలో నాతో అనేకసార్లు చర్చించేది. తెలంగాణ ఉద్యమ ప్రారంభంలో ఉత్తర తెలంగాణ నిజామాబాద్ జానపద సాహిత్యం పైన చాలాసార్లు మాట్లాడుకోవడం జరిగింది. శాతవాహన విశ్వవిద్యాలయంలో 'భాషా సంస్కృతి' పైన సెమినార్ ఏర్పాటు చేసి పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది. ప్రతిపనిలో నిబద్ధత అంకితభావం ప్రస్ఫుటంగా కనిపించేది. నన్ను ఉద్యమ అనుభవాలు రాయమని కలిసినప్పుడల్లా గుర్తు చేసేది. తన రిటైర్మెంట్ ఫంక్షన్ వెళ్ళినప్పుడు కరీంనగర్లో విద్యార్థులు, బోధనా సిబ్బంది ముత్యం పట్ల ప్రేమాభిమానాలు చూసి ఆశ్చర్యం కలిగింది. ముత్యం వాళ్ల అమ్మతో నాకు మొదటి నుండి అనుబంధం ఉంది. అమ్మ ద్వారా నాకు పుస్తకాన్ని ఇవ్వడం మర్చిపోలేని మధుర జ్ఞాపకం ఇంటర్వ్యూలో నేను ఇన్స్పిరేషన్ అని చెప్పినప్పటికీ ముత్యం నుండి నేను కూడా ఎంతో నేర్చుకున్నాను. ముత్యం జీవిత భాగస్వామి అపర్ణ ముత్యం రచనలలో కూడా భాగస్వామి అయింది. అన్ని విధాల ప్రోత్సాహాన్ని ఆర్థిక అండదండలు ఉండడం వల్లనే ఈ పుస్తకాలు వచ్చాయి. ఇది కేవలం పుస్తకాలు మాత్రమే కావు. సాహిత్య పరిశోధనకు చరిత్ర పరిశోధనకు భావితరాల తరగని నిధి, ముత్యం కృషి అజరామరం.







ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 11  UGC CARE List Approved Journal
హైదరాబాద్ సెప్టెంబర్ : 2024


# అంపశయ్య నవీన్ కన్నీటి ధారలే అనురాగ దీపం నవల

**డా. ఆగపాటి రాజ్ కుమార్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (పి), తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం.



**ఉపోద్ఘాతం:** కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ గ్రహీత, తెలుగు వాఙ్మయ ప్రపంచంలో ప్రఖ్యాత నవలా రచయిత డా॥అంపశయ్య నవీన్ పేరు తెలియనివారుండరు. నవీన్ తన అర్ధాంగి అనసూయతో గడిపిన అరవైయేండ్ల దాంపత్య జీవితాన్ని చిత్రిస్తూ ఆయన రచించిన నవలా అనురాగ దీపం. తన అర్ధాంగి అనసూయ అరవై యేండ్లు తన జీవిత సహచరిగా ఉండి 21.5.2023న మరణించడం జరిగింది. ఈ అరవై ఏండ్ల కాలంలో తమ దాంపత్య జీవితంలో ఎదురైన కష్టాలను, కన్నీళ్లను, కలలను, ఆమెతో గడిపిన మధుర క్షణాలను కలగలపి తన కలంలో ఇంకుగా మార్చి రాసిన నవలే అనురాగ దీపం. ఇప్పటి వరకు నవీన్ రచించిన 34 నవలలు ఒక ఎత్తు అయితే తన జీవితాన్ని అనురాగం అనే దీపంతో తేజోమయం చేసిన తన అర్ధాంగి అనసూయ ఎడబాటును తట్టుకోలేక మథనపడుతూ, ఆవేదన చెందుతూ నవీన్ హృదయాన్ని చీల్చుకుని వచ్చిన ఈ రచన ఒక ఎత్తు అని చెప్పక తప్పదు. ఎందుకంటే ఈ నవలలో తన భార్య అనసూయతో గడిపిన ప్రతి క్షణాన్ని వేదనాభరితంగా అక్షరబద్ధం చేశాడు రచయిత. 21.05.2024న ఆవిష్కరణ జరిగిన ఈ నవలను ఎలాంటి ప్రణాళిక లేకుండానే స్పాంటినియస్‌గా వాస్తవిక సంఘటనలతో మూడు నెలల్లో రాశానని రచయిత ఈ నవల ముందుమాటలో చెప్పుకున్నాడు. అయితే వాస్తవిక సంఘటనలకు కల్పన జోడిస్తేనే నవల అంటారు. కానీ ఈ నవలలో ఇసుమంత కూడా కల్పన లేదు కనుక దీనిని విమర్శకులు నవలగా అంగీకరించకపోతే అంపశయ్య నవీన్ గారి స్వీయ చరిత్ర అని అనవచ్చు.

**ముఖ్యమైన పదాలు :** తెలంగాణ సంస్కృతి, అనసూయ, నవీన్, ఉమ్మడి కుటుంబం, అనురాగం, స్నేహం, ప్రేమ, కన్నీళ్లు, బంధువులు, సాహిత్యం, వావిలాల, మద్దిరాల, ఉద్యోగం.




**విషయం :** అనసూయ పుట్టగానే నీకు పెళ్ళాం పుట్టిందని పార్వతమ్మ పెద్దమ్మ అనడంతో ప్రారంభమైన ఈ నవలలో రచయిత నవీన్ స్వగ్రామం వావిలాలలో తన మధ్యతరగతి వ్యవసాయ కుటుంబ నేపథ్యం. తన సతీమణి అనసూయ పుట్టిన ఊరు సూర్యాపేట తాలుక మద్దిరాల గ్రామ వాతవరణం. వాళ్ళ భూస్వామ్య కుటుంబ నేపథ్యంతో పాటు బంధువులు, బాంధవ్యాలు ఉమ్మడి కుటుంబంలో ఉండే సంతోషాలు అవి విచ్ఛిన్నం అయిన తరువాత ఏర్పడే కలహాలు, బాధలతో పాటు అనేక సామాజిక, రాజకీయ అంశాలను ఈ నవలలో నవీన్ అద్భుతంగా చిత్రించారు. అనసూయ తాతగారు వడ్డాణం ముత్తి లింగయ్యగారు మద్దిరాల గ్రామ పోలీస్ పటేల్. ఈయనకు ముగ్గురు కొడుకులు, ఐదుగురు బిడ్డలు. పెద్ద కొడుకు లక్ష్మీనరసయ్య, రెండో కొడుకు శంకరయ్య, చిన్న కొడుకు రామలింగయ్య. ఐదుగురు బిడ్డల్లో రెండో బిడ్డను వావిలాల గ్రామానికి చెందిన దొంగరి నారాయణకిచ్చి పెండ్లి చేశారు. వీరి మొదటి సంతానమే ఈ నవల రచయిత నవీన్. ఇకపోతే రెండో కొడుకు శంకరయ్య – లక్ష్మమ్మలకు పుట్టిన కూతురే అనసూయ. ముత్తి లింగయ్యగారు అనారోగ్యం కారణంగా చనిపోయిన తర్వాత ఇంటి పెత్తనం, ఊరి పెత్తనం (పోలీస్ పటేల్) తన పెద్ద కొడుకు లక్ష్మీనరసయ్య చేతికొచ్చింది. రెండో కొడుకు శంకరయ్య లక్ష్మమ్మకు చాలా సంవత్సరాలకు ఆడపిల్ల పుట్టింది. పుట్టిన కొద్ది రోజులకే తన తల్లి లక్ష్మమ్మకు బాలింత రోగం వచ్చి చనిపోవడంతో ఆ ఉమ్మడి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పసిపాపను మేమే పెంచుకుంటామని లక్ష్మీనరసయ్య తీసుకొని రావడంతో ఊళ్ళో అందరు ఈ పసిపాప బతికి బట్టకడ్తుందా? ఈమెకు పాలెవరిస్తారు. ఈ తల్లిలేని పిల్లను ఎవరు పెంచి పెద్ద చేస్తారు. ఈమెని కని ఈ భూమ్మీద వదిలేసిపోయిన లక్ష్మమ్మ ఎన్ని తపస్సులు చేస్తే ఆమెకు ఈ పాప పుట్టిందో, చాలాకాలం ఆమెకు పిల్లలు పుట్టలేదని ఎంత బాధపడేదో, పుట్టిన ఈ పాపను కళ్ళనిండా చూసుకోకుండా వెళ్ళిపోవడం ఎంత బాధకరం. ఏ దేవుడికీ ఆమె మీద దయ కల్గలేదా! అని బంధువులు, చుట్టాలు కుటుంబ సభ్యులు పెద్ద పెట్టున ఏడ్వడం పాఠకుల హృదయాలను ద్రవింపచేస్తుంది.

ఊళ్ళో లక్ష్మినరసయ్య పోలీస్ పటేల్ కావడంతో ఒక పిల్ల తల్లి ఈ పాపకు రోజుకు రెండు మూడు సార్లు ఇంటికి వచ్చి పాలివ్వడం గ్రామంలోని ఆత్మీయ అనుబంధాలను తెలియజేస్తుంది.

ఆ పాపకు మూడు నెలలు గడిచిన సందర్భంగా బాలసారె ఫంక్షన్ చేస్తున్నామని మద్దిరాలకు రమ్మని వావిలాలకు ఎడ్లబండిని పంపిస్తే అందులో నవీన్ వాళ్ళ అమ్మ మద్దిరాలకు వెళ్ళారు. ఆ రోజు ఆ పాపకు పేరు పెట్టాలట, పాపకు ఏ పేరు పెట్టాలని అక్కడ ఉన్న తన పెద్దమామ కూతురు నవీన్‌ను అడుగడం అనసూయ అని నవీన్ చెప్పడంతో బంధువులందరు పాపకు అనుసూయ అని నామకరణం చేశారు. అంటే లక్ష్మమ్మ అత్త ఉన్నప్పుడు నాకు బిడ్డ పుడితే నీకే ఇస్తా అని అనడం, పేరు పెట్టాలని తననే అడగడం ఇవ్వన్ని చూస్తే అనసూయ తన కోసమే పుట్టింది అనే భావన నవీన్ మనసులో కల్గడం సహజం. ఆ పాప పట్ల బంధువులందరు అమితమైన ప్రేమను కనబరచడం నవీన్‌కు ఎంతో సంతోషాన్ని కల్గిస్తుంది. తన ముగ్గురు మేనమామలకు పెండ్లిల్లు అయిన ఉమ్మడి కుటుంబంగా కలిసి ఉండడంతో ఆ ఇల్లు ఎప్పుడు బంధువులతో కలకలలాడుతూ ఉండేది. అనసూయ తండ్రి శంకరయ్య మళ్ళీ పెళ్ళి చేసుకోవడంతో అనసూయను తన పెద్దమ్మ పెద్దనాన్న కన్న బిడ్డలాగా అతి గారాబంగా పెంచడం ఒక ఎత్తు అయితే ఉమ్మడి ఆస్తిలో తన పెళ్ళికోసం కొంత ఆస్తిని కేటాయించడం ఆనాటి తెలంగాణలోని ఉమ్మడి కుటుంబం యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుంది. అనసూయ పెరుగుతున్న కొద్దీ అతిగారాబం వల్ల పెంకిపిల్ల పేచిపిల్లగా ఆమె అనుకున్నది చేయడం లేదంటే మారం చేయడం గమనించిన నవీన్ అనసూయను గారాబం చేసి చెడగొడుతున్నారని వాళ్ళ అమ్మతో అనడం, తల్లి లేని పిల్ల కదరా అలాగే ఉంటుంది అని చెప్పడం ఇలా ఆ కుటుంబంలో అతి గారాబంగా ఆమె బాల్యం కొనసాగుతూ వచ్చింది. తర్వాత అనుకున్నట్టుగానే తన మేనత్త కొడుకు నవీన్‌తో 14 సంవత్సరాల వయస్సులో 1962 మే 17న వివాహం జరిగింది.

అప్పుడే డిగ్రీ పాసై ఉస్మానియా యూనివర్సిటిలో ఎం.ఏ., పొలిటికల్ సైన్స్, ఎం.ఏ. తెలుగు అప్లై చేసి వరంగల్‌కు వచ్చిన నవీన్‌కు సాహితీ మిత్రులు గంటా రామిరెడ్డి, వరవరరావు ఇద్దరు నవీన్‌తో ఇలా అన్నారు. నువ్వు ఆ రెండింటిలో ఎం.ఏ. పూర్తి చేసిన వెంటనే జాబ్ రాదు మళ్ళీ హైదరాబాద్‌కు వెళ్ళి ఎకానమిక్స్‌లో అప్లై చేసిరా అందులో సీటు వస్తే అది పూర్తి కాగానే వెంటనే జాబ్ వస్తుంది అని చెప్పగానే జాబ్ ఈజ్ మోస్ట్ ఇంపార్టెంట్ టు మీ. రెండేళ్ళు ఎం.ఏ. పూర్తి చేసి ఉద్యోగం సంపాదించి అనసూయను తన దగ్గరకు తెచ్చుకోవాలనే తపన అతనిలో మొదలైంది. కానీ మళ్ళీ హైద్రాబాద్ వెళ్ళటానికి కావాలసిన డబ్బు లేదు. ఎలా అని ఆలోచించి పెళ్ళప్పుడు మామగారు అతని చేతికి పెట్టిన ఉంగరాన్ని కుదువపెట్టి 50 రూపాయలు తీసుకొని హైదరాబాద్ వెళ్ళి ఎకనామిక్స్‌లో అప్లై చేసి వచ్చాడు. తర్వాత అదృష్టం కొద్దీ అతనికి ఎకనామిక్స్‌లో సీటు వచ్చింది. ఎం.ఏ.మొదటి సంవత్సరం ఖర్చంతా తన మామగారు భరిస్తానని ఒప్పుకున్నాడు. రెండో సంవత్సరం ఖర్చంతా తన తండ్రిగారు భరిస్తానని ఒప్పుకున్నాడు. ఈ రెండు సంవత్సరాల కాలంలో ఉస్మానియా యూనివర్సిటిలో గంట రామిరెడ్డి, వరవరరావు, వేనరెడ్డి నవీన్‌కు మంచి మిత్రులయ్యారు. ఎం.ఏ. చదువుకుంటున్న కాలంలో అతని మంచి చెడ్డల గురించి అనసూయకు నవీన్ అనేక ఉత్తరాలు రాశాడు. కొన్నిసార్లు అనసూయ కూడా నవీన్‌కు ప్రతిస్పందనగా ఉత్తరాలు రాసింది. అనసూయ రాసిన ఉత్తరాలు చదువుకుని ఎంతో మురిసిపోయేవాడు. అంతేకాదు ఈ చదువు, ఈ ఫ్రెండ్స్, ఈ యూనివర్సిటీ, ఇవన్నీ వదిలేసి ఆమె కౌగిలిలో చేరిపోవాలని కలలు కనేవాడు, అనసూయ అంటే అంత ప్రేమ నవీన్‌కు. అలా ఊహా ప్రపంచంలో విహరించే నవీన్‌కు రోజులు గడిచిపోయి ఎం.ఏ. పూర్తి అయ్యింది.

ఇప్పుడిక సమస్య ఉద్యోగం సంపాదించుకోవడం. రెండు నెలలు గడిచాక ప్రొఫెసర్ అక్తర్ హుస్సెన్ సార్ సహాయంతో అమెరికా నుండి వచ్చిన పీస్‌కోర్ వాలంటీర్స్‌కు తెలుగు అనువాదకుడిగా జాబ్‌లో జాయిన్ అయ్యాడు. నెలకు 250 రూపాయల జీతం. నవీన్ ఎక్సైటింగ్‌గా ఫీలయ్యాడు. అంతకంటే ముందే నరసింహరెడ్డి అనే మిత్రుడి ద్వారా డిపిఐ ఆఫీస్‌కు వెళ్ళి లెక్చరర్ ఉద్యోగం కోసం అప్లై చేసాడు. కానీ అది టైం పడుతుంది అని చెప్పారు. లెక్చరర్ కావాలన్నది అతని డ్రీమ్. కానీ అనసూయను తన దగ్గరకు తెచ్చుకోవాలనే ఆశతో ఈ జాబ్‌లో జాయిన్ అయ్యాడు. కొద్ది రోజులు ఉద్యోగం చేసి దీపావళి పండుగకు నాలుగు రోజులు సెలవు పెట్టి తన అత్తగారు ఊరైన మద్దిరాలకు వెళ్ళాడు. తర్వాత అనుకున్నట్టుగానే అనసూయను తీసుకొని హైదరాబాద్‌కు వచ్చి రాంనగర్‌లో పోర్షన్ అద్దెకు తీసుకుని కాపురం పెట్టాడు. 4 రోజులని వారం రోజులు ఊరుకు వెళ్ళాను ఆఫీస్‌లో సార్ ఏమంటాడో ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో అనుకుంటూ తెల్లవారి 10 గంటలకు ఆఫీసుకు వెళ్దామని యూనివర్సిటీ క్యాంపస్‌కు చేరుకున్నాడు. ఆర్ట్స్ కాలేజ్ లోపలున్న ఆఫీస్‌కు టెన్షన్‌గా వెలుతుండగా కెఫ్టిరియా దగ్గర వరవరరావు కలిసి హాల్లో నవీన్ ఎప్పుడొచ్చావు? నీకో గుడ్ న్యూస్ అన్నాడు. నిన్న రాత్రే వచ్చాను ఏమిటి ఆ గుడ్‌న్యూస్! నీకు లెక్చరర్ జాబ్ వచ్చింది, ఆర్యూ జోకింగ్ డియర్ వరవర్....

నోనో... అయామ్ నాట్ జోకింగ్! పోస్టాఫీసులో ఆ ఆర్డర్ నేనే తీసుకుని దాన్ని మీ తమ్మునికిచ్చాను. నిన్ను నల్గొండలోని ఎన్.జి.గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ లెక్చరర్‌గా పోస్టు చేశారని చెప్పాడు. అబ్బ ఎంత మంచి వార్త చెప్పారు థాంక్యూ వరవర్! వెంటనే తమ్ముని దగ్గరకు వెళ్ళి ఆర్డర్ తీసుకొని

సంతోషించాడు. వెంటనే అనసూయకు చెప్పాలి అని రూమ్‌కు వెళ్ళి నాకు లెక్చరర్ జాబ్ వచ్చింది అంటూ ఆమెను ఎత్తుకుని పైకెగరేస్తూ అమితమైన సంతోషంతో చెప్పాడు. తెల్లవారి వెళ్ళి కాలేజ్‌లో జాయిన్ అయ్యి రెండు రోజుల్లో అనసూయను తీసుకొని నల్గొండలో పోర్షన్ అద్దెకు తీసుకుని కాపురం పెట్టాడు. నవీన్ గారు బి.ఏ.నుండే కథలు, వ్యాసాలు రాసేవారు. దీంతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సాహితీ మిత్రులు వేనరెడ్డి, గంటా రామిరెడ్డి, వరవరరావులతో కొనసాగించిన గాఢమైన స్నేహబంధాన్ని నల్గొండలో ఉద్యోగం చేస్తున్న సమయంలో నవీన్ సాహితీ వాతావరణంలో విహరించేలా చేసింది. అనేక నవలలు కథలు చదవడమే కాదు ప్రతి సాహిత్య సభలకు అనసూయతో కలిసి హాజరయ్యేవాడు. మధ్య మధ్యలో అనసూయతో కలిసి సినిమాలకు వెళ్ళేవాడు. ఈ కారణంగా పల్లెటూరి వాతావరణంలో పెరిగిన అనసూయ స్వేచ్ఛయుత వాతావరణంలోకి అడుగు పెట్టింది. నవీన్‌కు ఇష్టమైన పనిని ఆటంకం లేకుండా చూసుకునేది. ఇలా కాలం నడుస్తున్న కొద్ది స్వప్న, సతీష్, శశికిరణ్ ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. తర్వాత ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్న అనసూయ పెద్దనాన్న, నాన్న, బాబాయి ముగ్గురు ఆస్తులు పంచుకొని ఎవరింట్లో వారు ఉండడం, తన తండ్రి శంకరయ్యకు బాబాయి రామలింగయ్యకు గొడవలు జరగడం, విడిపోయిన తర్వాత బంధువులు రాకపోవడంతో నవీన్ మద్దిరాలకు పోయినప్పుడు మునుపటి సంతోషం లేక కొంత విచారం వ్యక్తం చేసేవాడు. ఇలా నవీన్‌కు 8 సంవత్సరాల వయస్సున్నప్పుడు ప్రారంభమైన నవల ఆయన అశితి పూర్తి చేసుకునే దాక నవీన్‌ను తన ప్రాణంలో ప్రాణంగా కంటికి రెప్పలా కాపాడుకుంది అనసూయ.

అనుక్షణం తనను కంటికి రెప్పలా కాపాడుకున్న అనసూయ తన జీవితం నుండి వెళ్ళిపోతుంటే తట్టుకోలేక కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో అద్దం పగిలినట్టు పగిలిన రచయిత హృదయాన్ని చూసి అక్కడున్న వారందరు చలించిపోయారు. అనసూయ తన మనవరాళ్ళ పెండ్లిళ్లు చూడాలని ఎంత ఆరాటపడిందో తన చిన్న కొడుకు శశికిరణ్ జీవితంలో వచ్చిన కష్టాలను చూసి ఆ మాతృ హృదయం తల్లడిల్లింది. ఎంత కష్టమైన తన కోసం బాధ్యతల్ని నెత్తిమీద వేసుకుని అరవైయేళ్ళు ప్రాణంలో ప్రాణంగా బతికిన అనసూయను కోల్పోవడం ఎంత విషాదమో అక్షరాల్లో నిక్షిప్తం చేశాడు రచయిత. అయితే ఈ నవలలో కథ మొత్తం అనసూయ చుట్టూ తిరిగిన మద్దిరాలలో పోలీస్ పటేల్ వ్యవస్థ, సాహితీ వాతావరణం, వావిలాలలో తన అత్తగారి కుటుంబ సమస్యలు, పిల్లల చదువు మొదలగు సంఘటనలన్నీ, నవలలో అంతర్భాగంగా అంతర్లీనంగా చోటు చేసుకున్న అంశాలు. తెలంగాణలో కుటుంబ జీవన స్థితిగతుల్లో కాలం తెచ్చిన మార్పులకు అనుబంధాల మధ్య వినిపిస్తున్న అపశ్రుతులకు నిలువెత్తు నిదర్శనం అయిన స్థితిగతులను తెలంగాణ మధ్య తరగతి జీవన విశ్వాసాలను అత్యంత ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఆవిష్కరించిన అద్భుత నవల అనురాగ దీపం.

**ముగింపు :** నవీన్ జీవితంలో అరవై ఏళ్ల ప్రయాణాన్ని కన్నులు తడువకుండా చదువలేమని తెలియజేస్తున్నాను. 1962లో అనసూయను పెండ్లి చేసుకున్న నవీన్ తన భార్య స్వేచ్ఛాయుత ఆలోచనలకు ప్రేరణగా నిలిచాడు. 1941 నుండి 2023 వరకు ఇద్దరు వ్యక్తుల జీవన గాథగా ఈ నవలను పేర్కొనవచ్చు. తెలంగాణ సమాజంలో మేనరికాల సంస్కృతి కోణం నుండి నవల మొదలై అనసూయ తన తల్లి గారి కుటుంబం నుండి పొందిన ప్రేమ అనుబంధాలను తన తరాలకు పంచిందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో ఇష్టమైన వ్యక్తులు చనిపోతే కవిత్వం రాసారు కానీ ఏకంగా నవల రాసిన ఏకైక వ్యక్తిగా నవీన్ తెలుగు సాహితీ ప్రపంచంలో నిలిచిపోతారు.

తెలంగాణ సమాజాన్ని కుటుంబ అనుబంధాలను గొప్పగా చిత్రించిన నవలగా అనురాగ దీపం చిరస్థాయిగా నిలిచిపోతుంది. తెలుగు సాహిత్య చరిత్రలో తన భార్యకు భర్త ఇచ్చిన అపురూప అక్షర నివాళి ఈ నవల అని చెప్పవచ్చు. భార్య భర్తల అన్యోన్య దాంపత్యానికి నిదర్శనంగా నిలవడమే కాకుండా ఈ నవలలో నవీన్ తన అంతరంగాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు అని చెప్పవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే అంపశయ్య నవీన్ కన్నీటి ధారలే ఈ నవల. ఈ అనురాగ దీపం నవలకు సంపూర్ణ నవల లక్షణాలు ఉన్నాయని చెప్పవచ్చు.

భార్యను భార్యలాగా కాకుండా ఒక స్నేహితురాలుగా, తన హృదయాంబరం మీద ఆడుకునే చిన్న పిల్లలాగా చూసుకున్న నవీన్ అనసూయ బాధలోంచి బయటపడి సమాజ చైతన్యాన్ని కాంక్షిస్తూ మంచి రచనలు చేయాలని ఆశిద్దాం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. అనురాగ దీపం (నవల) – అంపశయ్య నవీన్ ప్రత్యూష ప్రచురణలు మే–2024

2. తెలంగాణ కాలరేఖలు మూల్యాంకనం – సంపాదకులు బన్న అయిలయ్య – 2011

3. నవలా శిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, బ్యాంక్ స్ట్రీట్, విజ్ఞాన్ భవన్, హైద్రాబాద్, ద్వితీయ ముద్రణ మార్చి – 2000

4. నవలా స్వరూప సమాలోచన – ఆచార్య మాదిరాజు రంగారావు, రసధుని సాహితీ పరిషత్, శాంతినగర్, హైద్రాబాద్.

❖ ❖ ❖ ❖ ❖

# కావ్యమధూలికలో వస్తు వైవిధ్యం

**డా. తండు కృష్ణకౌండిన్య,** అధ్యక్షులు, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట. సెల్: 9704731346

**ఉపోద్ఘాతం :** తెలుగులో గజళ్ళను, రుబాయిలను మొట్టమొదట దాశరథి రాశారు. వీరి తర్వాత డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య అనేక రుబాయిలు రాసి సంపుటాలుగా ప్రచురించారు. దాశరథి, తిరుమల శ్రీనివాసచార్య, పెన్నా శివరామకృష్ణ, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మొదలగు కవులు రుబాయిలను రాసి వాటికి వన్నెతెచ్చారు. అదే స్థాయిలో రుబాయిలను రాసి మెప్పించినవారు ఎన్.వి.రఘువీర్ ప్రతాప్.

**రుబాయి స్వరూపం :** రుబాయి ప్రక్రియ పారసీ భాష నుంచి ఉ ర్దూ భాషలోకి ప్రవేశించింది. అట నుండి తెలుగులోకి రావడం జరిగింది. నాలుగు అని అర్థం కలిగిన అర్బా అనే అరబ్బీ పదం నుంచి రుబాయి అను పదం ఏర్పడింది. రుబాయి అనేది ఒక ఫారసీ ఛందస్సు పేరు. అదే కవితా ప్రక్రియగా మారింది.

**రుబాయి లక్షణాలు :** దీనిలో నాలుగు పాదాలు ఉంటాయి. ఒకటి, రెండు, నాలుగు పాదాలకు రదీఫ్, కాఫియాల నియమం ఉ ంటుంది. మూడో పాదానికి ఈ నియమాలు ఉండవు. కాఫియా అనగా అంత్యప్రాస. రదీఫ్ అనగా పునరుక్తి పదం. మూడవ పాదంలోనూ రదీఫ్, కాఫియాలు పాటింపబడిన రుబాయిలను పూర్వం రుబాయి తరానాలు అనేవారు. రుబాయి మాత్రా ఛందస్సుకు సంబంధించినది.

డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యులు 'తెలుగు రుబాయిలు' పుస్తకానికి రాసిన పీఠికలో రుబాయి విశిష్టత గురించి ఈ విధంగా చెప్పారు. **"రుబాయిలో ప్రధానంగా ఒకే ఒక్క భావం ఉంటుంది. ఈ భావ ప్రసూనం నాలుగు రేకులుగా విచ్చుకుంటుంది. మొదటి పాదంలో భావం మొగ్గ తొడుగుతుంది.రెండవ పాదంలో కొంచెం విచ్చుకుంటుంది. మూడవ పాదంలో వినూత్న ప్రాసతో ఉబికి వచ్చి హృదయాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతుంది. నాలుగో పాదంలో మూడు పాదాల సారం ఇమిడి ఉంటుంది. మొదటి పాదంలో అంకురించిన భావం ఇందులో సమగ్రంగా గుబాళిస్తుంది".** మాత్రాచందస్సు ప్రయోగ నిపుణత,శబ్దం మీద అధికారం, చమత్కార సాధనాకుశలత, పాదాల కూర్పులో వ్యూహ నిర్మాణ చతురత మొదలగునవి రుబాయి రచనకు ఉండవలసిన అంశాలు.

**రచయిత పరిచయం :** ఎన్. వి.రఘువీర్ ప్రతాప్ సుప్రసిద్ధ కవి, విమర్శకులు మాత్రమే కాకుండా సాహితీ సంస్థ నిర్వాహకులు కూడా. గజల్, రుబాయి, నానీలు, హైకూలు లాంటి కవితా ప్రక్రియల్లో అందెవేసిన చేయి. కవితాంజలి, అమ్మంటే, విశ్వరహస్య విశేషం, అంతర్వాహిని, చిగురాశల ఊహలలో, మహోన్నత వృక్షాలు, అమృతధార వంటి రచనలు చేసి విమర్శకుల ప్రశంసలను అందుకున్నారు.తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని పొందిన కవివరేణ్యులు. వృత్తిరీత్యా అటవీశాఖలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్నప్పటికీ ప్రవృత్తి రీత్యా అనేక కవితా రచనలు గావిస్తూనే ధర్మకేతనం సాహిత్య కళా పీఠం ద్వారా పలు సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ సాహిత్య, ఆధ్యాత్మిక పరిమళాలను గుబాళింపజేస్తున్నారు. వీరు రాసిన రుబాయిలు 'కావ్య మధూలిక' అను పేరుతో పుస్తక రూపంలో ప్రచురింపబడ్డాయి.

కావ్యమధూలిక వస్తువైవిధ్యం గల 110 రుబాయిల సమాహారం. ఇందులోని పలు రుబాయిలు ప్రధానంగా ఈ క్రింది అంశాల గూర్చి రాయబడ్డాయి. అవి- పర్యావరణ పరిరక్షణ, మానవతా దృక్పథం,ఆధ్యాత్మికత, పల్లె ప్రాధాన్యత, భాషా ప్రాధాన్యత, స్నేహం ప్రాధాన్యత మొదలగునవి. ఇవేగాక వేరు వేరు అంశాల గూర్చి రాయబడిన రుబాయిలు కూడా ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన అంశాలకు సంబంధించిన రుబాయిలను పరిశీలిద్దాం.

**పర్యావరణ పరిరక్షణ :** కావ్యమధూలికలో పర్యావరణానికి సంబంధించిన రుబాయిలు చాలా ఉన్నాయి. అందులో మచ్చుకు కొన్నింటిని పరిశీలిద్దాం.

**"మొక్కల్తో చేతులు కలిపి పచ్చని జెండగా అవుతాను**
**చుక్కలకో ముచ్చట తెలిపి గుచ్చని దండగా అవుతాను**
**మేఘాలకు లేఖలంపి వరుణుని ఏదో చేసెయ్యాలి**
**చెలిమినే చెక్కిటనింపి నులివెచ్చని పండగ అవుతాను"** (రుబాయి సంఖ్య-2). పై రుబాయిలో మొక్కలతో చేతులు కలపడం అనే భావుకత బాగుంది. మొక్కలతో స్నేహం చేసినప్పుడే పచ్చని జెండాగా మారడానికి అవకాశం ఉంటుందని అంటారు.మొక్కలు చెట్లుగా ఎదిగినప్పుడే పర్యావరణం కాపాడబడుతుందని, అప్పుడే వర్షాలు సకాలంలో పడుతాయని కవి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రతి ఒక్కరు చెట్లను బాగా పెంచి మేఘాలకు లేఖను పంపి వరుణుని ఆహ్వానించాలి అంటూ పై రుబాయి ద్వారా తెలియజేశారు. అదేవిధంగా మరో రుబాయిలో ఇలా అంటారు- **"వానలు దండిగ వచ్చేదెలా/ నేల మొత్తంగ తడిసేదెలా/ వనాలు చక్కగ పెరగాలోయ్/ పంట నిండుగ పండేదెలా"** (రుబాయి సంఖ్య -12). మొదటి రెండు పాదాలతో పాటు నాలుగో పాదంలో వానలు దండిగ వచ్చేది, నేల మొత్తంగ తడిసేది, పంటలు నిండుగ పండేది ఎలా అని ప్రశ్నిస్తూ వాటన్నింటికీ సమాధానాన్ని వనాలు చక్కగ పెరగాలోయి అంటూ వ్యక్తీకరించిన విధానం బాగుంది. పై రుబాయిలో మొదటి రెండు

పాదాలతో పాటు నాలుగో పాదంలో ఏదైనా ఒక అంశాన్ని ప్రతిపాదిస్తే దానికి సరైన సమాధానంగా మూడవ పాదం ద్వారా వెలిబుచ్చడం జరిగింది. చెట్టును దేవతగా అభివర్ణిస్తూ చెప్పిన మరొక రుబాయి– **"ఊపిరయ్యే దేవతేగా చెట్టంటే /ఉనికి నిలిపే శ్వాసేగా చెట్టంటే/ పరిమితమైన బుద్ధి కాల్చేదెపుడట /అన్నిటి మనుగడ జతేగా చెట్టంటే"** (రుబాయి సంఖ్య –17). చెట్టును ఊపిరి దేవతగా, ఉనికి నిలిపే శ్వాసగా అభివ్యక్తీకరించిన విధానం బాగుంది. అదే విధంగా ప్రకృతిని రక్షించాలంటే చెట్లను నరకగూడదని మరింతగా పెంచాలన్న సందేశం ఈ క్రింది రుబాయి ద్వారా తెలియజేశారు. **"స్వార్థం వెంట పరుగు ఆపవా/ వనాల నాశనమును మానవా/ ప్రకృతి రక్షణ మనకు వరం/ పర్యావరణ శ్వాసను నిలుపవా"** (రుబాయి సంఖ్య– 24). ఇలా పర్యావరణ పరిరక్షణే మానవాళి ధ్యేయమని చెబుతూ రాసిన రుబాయిలు ఎంతో ప్రాశస్త్యాన్ని సంతరించుకున్నవి.

**మానవతాదృక్పథం :** రఘువీర్ ప్రతాప్ మానవతావాది, సహృదయులు. ఇతరుల కష్టాలలో పాలుపంచుకునే స్వభావం కలవారు. నిరంతరం నిరుపేదలకు అండగా ఉంటారు. మానవతా వాదియైన కవి సమాజంలో ఒకడుగా ఉంటూనే సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను చూసి సహించలేక కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని ఆ రుగ్మతలను రూపుమాపడానికి ప్రయత్నం చేస్తాడు. వీరు కూడా సమాజంలోని అసమానతలను చూసి చలించిపోయి కవిత్వం రాస్తున్నారు. వీరి కవిత్వంలో మానవీయత తొణికిసలాడుతూ ఉంటుంది. సమాజానికి ఏమాత్రం పాటుపడని బతుకు బతుకే కాదని అంటూ రాసిన ఒక రుబాయి– **"ఉబుసుపోని కబుర్లెందుకు అంటాను/ ఊపిరాడని దేహమెందుకు అంటాను/ జగతికి పాటుపడక బ్రతుకందామా/ మలినమైన స్వార్థం ఎందుకు అంటాను"** (రుబాయి సంఖ్య –4). స్వార్థంతో మలినమైపోయిన బతుకు అవసరం లేదన్న అభిప్రాయాన్ని పై రుబాయి ద్వారా తెలిపారు. స్వార్థం మనిషిని మలినపరిస్తే, నిస్వార్థం మరింత పవిత్రత కలిగే విధంగా చేస్తుందని మరొక రుబాయి ద్వారా ఇలా తెలియజేశారు–

**"పంకజం పంకిలం అంటకనే ఎదుగుతుంది**
**నిస్వార్థం మనస్సుని ముట్టకనే ఒదుగుతుంది**
**పేదవాని గుడిసైనా ఆకలే నెమరు వేస్తుందే**
**స్వధర్మం మానవత హత్తుకునే పెరుగుతుంది"** (రుబాయి సంఖ్య– 11).

నిస్వార్థపరుని మనసు ఎలాంటి కల్మషం లేకుండా ఉంటుందని, స్వధర్మం, మానవత్వం రెండూ కలిసి మరింతగా ఉన్నతిలోకి పంచభూతాలన్నీ సమధర్మాన్ని కలిగి ఉంటాయి తప్ప ఎలాంటి వివక్షను చూపవని అన్నారు. ఉన్నవారిపట్ల ఒక రకంగా లేనివారి పట్ల మరొక రకంగా ప్రకృతి వివక్షతను కలిగి ఉండదు అని చెప్పడంలో ప్రతి ఒక్కరు కూడా ప్రకృతి లాగానే సమధర్మాన్ని పాటించాలన్న విషయాన్ని ప్రబోధించారు. మానవత్వం బయట దొరికే వస్తువు కాదని, అది మనలోనే ఉంటుందన్న సత్యాన్ని ఈ క్రింది రుబాయి ద్వారా తెలియజేశారు. **"అభయ హస్తం ఎక్కడో లేదు/ మానవత్వం బయటది దొరకదు/ మనిషి తనమే మేల్కోవాలి/ దైవత్వం కొరతేమి ఉండదు"** (రుబాయి సంఖ్య 45). ఇలా రఘువీర్ ప్రతాప్ తన రుబాయిల ద్వారా మానవతా దృక్పథాన్ని ప్రతి ఒక్కరు కలిగి ఉండాలనే ఆకాంక్షను వెలిబుచ్చడం ఎంతో ముదావహం.

**ఆధ్యాత్మికత :** రఘువీర్ ప్రతాప్ ఆధ్యాత్మిక విషయసంపన్నులు. వీరి వస్తాయని చెప్పారు. పేదవాని గుడిసె ఆకలి నెమరు వేయడం అనే ప్రయోగం అద్భుతంగా ఉంది. గుడిసెలకైనా అదే గాలి, మేడలకైనా అదే గాలి, సమధర్మమే ప్రకృతిమయం, ఏ మనుగడైనా అదే గాలి అంటూ తండ్రి నారాయణదాసు శ్రీరామాచార్యులు గొప్ప విద్వాంసులు, ఆధ్యాత్మిక సంపన్నులు. తండ్రి నుండి వారసత్వంగా వీరికి ఆధ్యాత్మిక చింతనతో పాటు రచనావ్యాసంగం కూడా లభించింది. ధర్మకేతనం సాహిత్య కళాపీఠం ద్వారా పలు సాహిత్య కార్యక్రమాలే కాకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీరు రాసిన రుబాయిల్లో ఆధ్యాత్మికత కలిగినవి చాలా ఉన్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని–

**"దైవాన్ని స్మరించు ఎల్లప్పుడు/ దెయ్యాన్ని విస్మరించు ఎల్లప్పుడు/ తనకిది ఆఖరు జన్మే కావాలా/ ఆనందాన్ని పండించు ఇప్పుడు"** (రుబాయి సంఖ్య–14). ప్రతి ఒక్కరూ దైవాన్ని స్మరించాలని, దెయ్యాన్ని విడనాడాలని కోరుతారు. అంటే మంచితనాన్ని పెంపొందించుకొని చెడుతనాన్ని పూర్తిగా వదిలి పెట్టాలన్న అంతరార్థం కూడా ఇందులో ఉంది. ప్రతి ఒక్కరికీ ఇదే చివరి జన్మ కావాలి అని అంటారు. ప్రతి ఒక్కరు ఈ భవబంధాల నుండి బయటపడి మోక్షాన్ని పొందాలి అనే ఆధ్యాత్మికత ఇందులో దాగి ఉంది. ప్రతి ప్రాణికి చివరి మజిలీ మరణమే అయినా ఏ ప్రాణికి లేని ఒక గొప్ప అవకాశం మనిషికి మాత్రమే ఉంది. ఈ జన్మలోనే తరించే ఒక అద్భుత అవకాశం మనిషికి మాత్రమే ఉందన్న సత్యాన్ని ఈ రుబాయి ద్వారా తెలియజేశారు. మతాల సారమంతా ఒక్కటే అన్న సత్యాన్ని ఈ క్రింది రుబాయి ద్వారా తెలియజేశారు. **"సర్వ మతాల సారం ఏమంటుంది / జీవులలోని రుధిరం ఏమంటుంది/ సత్యపు ధర్మమే బోధపడాలిగా /ఈశ్వర సంసారం ఏమంటుంది"** (రుబాయి సంఖ్య–20). సకల మతాలన్నీ సత్యాన్ని మాత్రమే చాటి చెబుతున్నాయన్న విషయాన్ని తెలియజేశారు. కోరికలు దుఃఖాలకు చేటు అని బుద్ధ భగవానుడు చెప్పాడు. కోట్లు లేకున్నా మానవులకు కోరికలకు మాత్రం లోటు లేదు అన్న సత్యం ఈ క్రింది రుబాయి ద్వారా చెప్పిన విధానం బాగుంది. **"కోట్లు లేకున్నా కోరికలకు లోటు ఏమి/ మురళి తూట్లున్నా రాగాలకు లోటు ఏమి/ మనసు ఖాళీ అయితేనే రుషివవుతావు/ చీకట్లెన్నున్నా దీపాలకు లోటేమి"** (రుబాయి సంఖ్య–23). కోట్లు లేకపోయినా కోరికలకు లోటు ఉండదు, మురళికి

తూట్లు ఉన్నా రాగాలకు లోటు ఉండదు, ఎంత చీకటి ఉన్నా దీపాలకు లోటు ఉండదు అను సత్యాన్ని చెబుతూనే మనసు ఖాళీ అయితేనే రుషివవుతావు అన్న సత్యాన్ని చాటి చెప్పారు. మనసు ఖాళీ కావడం అంటే మనసును రహితం చేసుకోవడమే. అంటే తనను తాను లేకుండా చేసుకోవడం. నేను (అహం) అను భావన లేకుండా ఉన్నప్పుడే మనిషి రుషిగా మారుతాడు. ఇదే అభిప్రాయాన్ని కవి పై రుబాయి ద్వారా వెలిబుచ్చారు. ఇలా ఆధ్యాత్మిక విషయ సంపన్నులైన రఘువీర్ ప్రతాప్ చక్కని ఆధ్యాత్మిక భావాలు కలిగిన రుబాయిలను రాసి ఆధ్యాత్మిక భావనలను గుబాళింపజేశారు.

**పల్లె ప్రాధాన్యత :** పల్లె విశిష్టతను, పల్లె వాతావరణాన్ని గురించి తెలియజేస్తూ రాసిన రుబాయిలు చాలా ఉన్నాయి. పల్లె పలకరింపులోనే స్వచ్ఛత ఉందని, అలాంటి స్వచ్ఛత మట్టి గుబాళింపులో, పసిపాపల చిరునవ్వులో కూడా ఉంటుందని తెలియజేస్తూ రాసిన రుబాయి – **"పల్లె పలకరింపులో స్వచ్ఛత /మట్టి గుబాళింపులో స్వచ్ఛత/ ఉండేది పసి మనస్సులనేగా/ అసలు చిరునవ్వులలో స్వచ్ఛత"** (రుబాయి సంఖ్య– 47). "పల్లె తల్లి వంటిది, పట్నం ప్రియురాలు వంటిది" అని ఒక సామెత ఉంది. అంటే పల్లె ప్రతి ఒక్కరినీ తల్లిలా ఆదరిస్తుంది. కాని పట్నం డబ్బున్న వాడిని మాత్రమే ఆదరిస్తుంది. పల్లె స్వచ్ఛతను పసిపాప నవ్వుతో, మట్టి గుబాళింపుతో పోల్చడం బాగుంది.

**భాషా ప్రాధాన్యత :** భావవ్యక్తీకరణకు తోడ్పడేది భాష. ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరు వారి వారి మాతృభాషలను ఇష్టపడక తప్పదు. అమ్మ భాషను నిరాదరణకు గురి చేస్తే ఎప్పుడో ఒకప్పుడు ఆ భాష కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. కావున మన మాతృభాషయైన తెలుగును కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అమ్మ భాష ఏదైనా అమృతమయమే. అమ్మ భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అంటూ ఈ క్రింది రుబాయి ద్వారా తెలియజేశారు. **"అజరామరమే అమ్మ భాష /అమృత మధురమే నా భాష /విలువ కట్టడమే ఒక ఘోష/ ఆనందమే హృదయ భాష"** (రుబాయి సంఖ్య –49). అమ్మ భాష మధురమైన భాషయని, విలువలకు పట్టంకటే భాషయని, ఆనందానుభూతిని కలిగించే భాషయని చెప్పిన విధానం బాగుంది.

**స్నేహం ప్రాధాన్యత :** "స్నేహానికన్న మిన్న లోకాన లేదు లేదురా" అన్నాడు ఓ సినీ కవి. స్నేహం కన్నా గొప్ప సంపద ఏమీ లేదంటాడు ఈ కవి. రఘువీర్ ప్రతాప్ స్నేహాన్ని బాగా ఇష్టపడుతారు. "మంచి మిత్రుల పొత్తు పెంచి పోషించుకో" అని దమ్మపథం చెబుతున్నట్లే వీరు కూడా మంచి మిత్రుల పొత్తును ఎక్కువగా ఇష్టపడుతారు. మనసు లోతు తెలియకుండా స్నేహమేలా మొలుస్తుంది అని అంటూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అదేవిధంగా స్నేహం గురించి రాసిన మరొక రుబాయి – **"ప్రేమ ధనమే గుండెలను పరిమళింపజేస్తుంది/ మనిషి తనమే మనసులను పల్లవింపజేస్తుంది/పల్లెయైనా పట్నమైనా విలువలుంటేనే/ స్నేహములే బతుకులను పండింపజేస్తుంది"** (రుబాయి సంఖ్య–57) అంటూ బ్రతుకులను పండింపజేసేది స్నేహమే తప్ప మరేదీ కాదని చెప్పడంలో స్నేహం గొప్పతనమేమిటో తెలుస్తుంది. ఇలా పలు అంశాల గూర్చి రాసిన రుబాయిలు వేటికవే ప్రత్యేకతను సంతరించుకున్నవి.

**ముగింపు :** రుబాయి మాత్రా ఛందస్సుతో కూడినది. అద్భుతమైన లయ కలిగి గానయోగ్యమై ఉంటుంది. రఘువీర్ ప్రతాప్ రుబాయి నడకను ఒడిసి పట్టుకొని పలు గతుల్లో రుబాయిలను రాశారు. రదీఫ్, కాఫియా వంటి వాటిని చక్కగా పాటిస్తూ ప్రామాణికమైన రుబాయిలను రాసి కవి పండితుల మెప్పును పొందడంలో సఫలీకృతులయ్యారు. ఎక్కడ కూడా పదాల ప్రయోగంలో తడబాటు కానరాదు. అలవోకగా పదాలను ప్రయోగించారు. చక్కని శిల్పంతో, గానయోగ్యమైన లయలో రుబాయిలను నడిపించారు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ప్రముఖకవి, కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అన్నట్లుగా **"సరళమైన భాష, నిరాడంబరమైన శైలి, వెంటనే హృదయానికి తాకే భావుకత రఘువీర్ ప్రతాప్ కవితా లక్షణాలు"** అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.


**ఆధార గ్రంథాలు :**

1. రఘువీర్ ప్రతాప్ ఎన్. వి. (2022), కావ్యమధూలిక, ధర్మకేతనం సాహిత్య కళాపీఠం, హైదరాబాద్.
2. నరసింహారెడ్డి ఏనుగు (2020), తెలంగాణ రుబాయిలు, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
3. డాక్టర్ శ్రీనివాసాచార్యులు తిరుమల(1988),తెలుగు రుబాయిలు.

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.





సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి


సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-


**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్: 934 7971177**

# స్వ'కృతి'







**సౌందర్య లహరీ సౌందర్యము**
డా. అయాచితం నటేశ్వర శర్మ
వెల : 200/-
**ప్రతులకు :** డా. రాళ్ళబండి కౌముది, వేపా జాహ్నవి ప్లాట్ నెం. 401, ప్రగతి అరిహంత్ రెసిడెన్సీ, బ్లాకు-1 డిమార్ట్ ప్రక్కన, విలటరీ డైరీ ఫారం రోడ్, ఓల్డ్ బోయిన్ పల్లి, సికింద్రాబాద్ -500 009.




**పోరాట పథం (ఆత్మకథ)**
డా. హెచ్. నరసింహయ్య
వెల : 500/-
**ప్రతులకు :** డా. హెచ్. నరసింహయ్య సోషల్ అండ్ కల్చరల్ ప్రతిష్ఠాన్ ట్రస్ట్, హొసూర్.
ఫోన్ : 9701 371 256



**లోపలి మనసు (కవిత్వం)**
అరుణ నారదభట్ల
వెల : 150/-
**ప్రతులకు :** ఫ్లాట్ నెం. 102, సాయి భారతి హోమ్స్, ఇం.నెం. 2-2-1137/3/సి/3, రామాలయం దగ్గర, ప్రశాంత్ నగర్, న్యూ నల్లకుంట, హైదరాబాద్ - 500 044
ఫోన్ : 97050 15207



**పుష్పకయానం**
దుగ్గిరాల భువనేశ్వరి
అమూల్యం
**ప్రతులకు :** డి.ఎ.ఎల్.ఎన్. మూర్తి ట్రస్ట్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్.



**లింగమూర్తి శతకము**
వైద్యం వేంకటేశ్వరాచార్యులు
వెల : 200/-
**ప్రతులకు :** కపిలవాయి అశోక్‌బాబు, ఫ్లాట్.నెం. 404-సి బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ పామ్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్, హైదరాబాద్-44.
ఫోన్ : 87907 27772, 94402 06387

**చిరునామా**

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com



**మా భగోట**
డా. కపిలవాయి లింగమూర్తి
వెల : 800/-
**ప్రతులకు :** కపిలవాయి అశోక్‌బాబు, ఫ్లాట్.నెం. 404-సి బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ పామ్, అచ్యుతరెడ్డి మార్గ్,
విద్యానగర్, హైదరాబాద్-44.
ఫోన్ : 87907 27772, 94402 06387

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177


# నేను ఇంకెందరినో...

## డా. కందుల శ్రీను

ఫోన్ : 96526 74834



నాలో నేనున్నానా...?
ఏమో......
నాలో నా జిజ్ఞాసి క్రమక్రమంగా అంతమైపోతున్నాడా.....
అవునేమో..
మౌనంగా నేను మాములైపోతున్నాను
ఏమిటీ అచేతనం
ఎందుకీ నిశ్శబ్దం
అనంతమైన ఆకాశాన్ని చిన్న ధూళికణంలో చూసిన నా సూక్ష్మత్వం ఎటుపోయింది
దారులు పడని దారుల్లో రహదారిని నిర్మించిన నా సాహసత్వం ఎందుకిలా ఒత్తిగిల్లింది



కులకంచలు పేదరికపు విషవలయాలు నన్నుబంధించి
మానసికాగ్నికి ఆహుతయ్యేలా చేస్తుంటే
తెగించి
నరాలుబిగించి
ఎత్తుపల్లాల అసహజత్వ సమాజానికి పెన్నుతో
సమ్మెట పోటునై మ్రోగించిన ధిక్కార స్వరాన్ని ఏ ఉక్కు సంకెళ్లు బంధించాయో......
ఎందుకో ఈకాలం నాలో నేను కనిపించడం మానేశాను
నామనసుకొచ్చిందా...?
అసలు నా వయసుకే వచ్చిందా...?
ఈ వృద్ధాప్య అలసత్వ ఛాయలు...
సాధించినదెంత...?
ఏదో సాధించామనే మాయలో



పోగొట్టుకున్న దెంత..?
వయసు మబ్బుముక్కల్లా
నెమ్మదిగా కరుగుతుంటే
నా వడలు వృద్ధురాలి చీరె కుచ్చిళ్ళలా ముడతపడుతుంది.
నది వెనకకు మళ్ళలేదు
యవ్వనం వంటిని బట్టి ఆగలేదు
అయినా నా అంతం లోపే నాఆశను పండించాలి
ఈ లోకానికేదో ఇవ్వాలి
ఇచ్చినది యుగాలు నిలవాలి
అందరికి నేనొక ఆలోచనవ్వాలి.




Scanned with OKEN Scanner